www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 12 + 16 +
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 312
బుధవారం | 26-2-2020
శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: తదియ తె. 4.12 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 10.09 తదుపరి రేవతి; వర్జ్యం: శే. ఉ.7.46 వరకు; దుర్ముహూర్తం: మ.12.05-12.52; అమృతఘడియలు: సా.4.45-6.33; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 6.17
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



ఢిల్లీలోని గోకల్‌పురిలో మంటల్లో కాలిపోతున్న ఓ దుకాణం

# రాజధాని రణరంగం

## ఢిల్లీలో 13కు పెరిగిన మృతులు

- 200 మందికి పైగా గాయాలు
- వీరిలో సగం మందికి తాకిన బుల్లెట్లు
- షాపులు ధ్వంసం.. వాహనాలకు నిప్పు
- రాళ్లు, కర్రలతో దాడులు.. పెట్రోలు బాంబులు
- ఇళ్ల పైనుంచి బలగాలపై యాసిడ్ దాడులు
- ఈశాన్య ఢిల్లీలో కర్ఫ్యూ.. కనిపిస్తే కాల్చివేత
- అదుపు తప్పిన పరిస్థితి.. సరిహద్దుల మూసివేత
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక భేటీ
- హాజరైన కేజ్రీవాల్, గవర్నర్ తదితరులు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు వద్దని పార్టీలకు హితవు
- హింసకు కపిల్ మిశ్రా వ్యాఖ్యలే కారణం: లెఫ్ట్
- మిశ్రా సహా అందరిపై చర్య తీసుకోవాలి: గంభీర్
- ఉన్మాదం వీడి సంయమనం పాటించండి: కేజ్రీ

9

*ఢిల్లీలో ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటన! మరోవైపు, రెండో రోజూ కొనసాగిన హింసాత్మక ఆందోళనలు! ఏకంగా 13కు పెరిగిన మృతుల సంఖ్య! 'జఫ్రాబాద్, చాంద్‌బాగ్ రోడ్లను మూడు రోజుల్లో ఖాళీ చేయాల్సిందే. ఆ తర్వాత మేం మీ మాట వినం' అంటూ ఢిల్లీ పోలీసులకు బీజేపీ నేత కపిల్ మిశ్రా అల్టిమేటం జారీ చేయడంపై సొంత పార్టీలోనూ, ఇతర పార్టీల్లోనూ ఆగ్రహావేశాలు! ఆయన వ్యాఖ్యలే ఆందోళనకు కారణమని మండిపాటు! పరిస్థితిని చక్కదిద్దడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమావేశం! శాంతి భద్రతలు కేంద్రం చేతిలోనే ఉన్నా.. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కూ ఆహ్వానం! పార్టీలు, నేతలు సంయమనం పాటించాలని తీర్మానం! వెరసి, రణరంగంగా మారిన దేశ రాజధానిలో శాంతి దిశగా కేంద్రం ప్రయత్నాలు!*



శాంతి భద్రతలపై సమీక్షలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీ వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలు



## వీసాల సంగతేంటి?

### ట్రంప్‌తో చర్చల్లో లేవనెత్తిన ప్రధాని?

- భారతీయులకూ సామాజిక భద్రత ఉండాలి
- అక్కడ మా విద్యార్థులు, టెకీలది కీలక పాత్ర
- వారి కృషిని గుర్తించాలని ట్రంప్‌ను కోరా
- అమెరికాతో త్వరలో భారీ వాణిజ్య ఒప్పందం
- దానికి చట్టబద్ధతనిచ్చే పని ప్రారంభిస్తాం
- రక్షణ భద్రతా సహకారం పెరుగుతుంది
- 21వ శతాబ్దిలోనే అతి ముఖ్య సహకారమిది
- చర్చల అనంతరం ప్రధాని వ్యాఖ్య

10

# మత స్వేచ్ఛపై మోదీతో చర్చించా

### కశ్మీర్ 'ముల్లు'లా గుచ్చుకుంటోంది.. కుదిరితే మధ్యవర్తిత్వానికి నేను సిద్ధం

### ఇమ్రాన్‌తో నాకు సత్సంబంధాలున్నాయ్.. ఉగ్రవాద నిర్మూలనకు పాక్ కృషి

- మత స్వేచ్ఛ మోదీ అభిమతం కూడా!
- ముస్లింలతో కలిసి నడవాలని భావిస్తున్నారు
- సీఏఏ గురించి చర్చల్లో ప్రస్తావించలేదు
- ప్రజలకు ఏది మేలో భారత్ అదే చేస్తుంది
- మా ఉత్పత్తులపై భారీ సుంకాలు తగదు
- 'న్యాయం'గా వ్యవహరించాలని కోరాను
- మోదీ 'టెర్రిఫిక్ - స్ట్రాంగ్' లీడర్
- ఉగ్రవాదం సంగతి చూసుకుంటారు
- 'ఇంటర్నెట్' స్వేచ్ఛను కాపాడాలి
- భారత పర్యటన అసాధారణం, అద్భుతం
- అమెరికా అధ్యక్షుడి 'వీడ్కోలు' సందేశం
- రూ.21 వేల కోట్ల ఆయుధాల కొనుగోలు
- అగ్రరాజ్యంతో కుదిరిన ఒప్పందం

*నేను గెలవకపోతే నాశనమే... అంటూ ఇప్పటి నుంచే తన దేశ పౌరులకు 'హెచ్చరిక' సందేశాలు! 'మీ దేశంలో మత స్వేచ్ఛను కాపాడండి'... అంటూ తన ప్రత్యేక మిత్రుడైన ప్రధాని మోదీకి పాఠాలు! 'అటూ ఇటూ అనేకమందిని కశ్మీర్ ముల్లులా గుచ్చుకుంటోంది'... అనే వ్యాఖ్యలు! ఒకవైపు 'భారత్ మాపై సుంకాలు బాదుతోంది'... అని విమర్శలు! మరోవైపు మోదీ 'టెర్రిఫిక్' లీడర్ అంటూ ప్రశంసలు!*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఘనమైన స్వాగతం అందుకుని... 'ధనమైన' రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోతూ పోతూ భారత్‌ను, తన ఆత్మీయ మిత్రుడైన మోదీని 'ఇరకాటం'లో పెట్టే అనేక వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల భారత పర్యటనలో చివరి రోజైన మంగళవారం ఆయన పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. ఢిల్లీలోని చారిత్రక 'హైదరాబాద్ హౌస్'లో ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరువురూ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. తాను బస చేసిన హోటల్‌లోనూ ట్రంప్ పాత్రికేయులతో

మిగతా 10వ పేజీలో...



ఢిల్లీ సర్వోదయ స్కూల్లో ఓ చిన్నారితో ట్రంప్ సతీమణి మెలానియా

## భారతదేశమా? అదెక్కడుంది?

గూగుల్‌లో సెర్చ్ చేసిన అమెరికన్లు

10

## జాస్తి కృష్ణకిశోర్ సస్పెన్షన్ రద్దు



- రాష్ట్ర ఉత్తర్వులు చట్టవిరుద్ధం
- పాలనా ట్రైబ్యునల్ తీర్పు
- తక్షణమే ఐటీలో చేర్చుకోండి
- కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం
- దర్యాప్తు సాగించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన

9

## ఎమర్జెన్సీని తలపిస్తున్న పోలీస్



బిహార్ కన్నా ఆంధ్రలోనే ఎక్కువగా అక్రమ నిర్బంధ కేసులు: హైకోర్టు

2

## సేల్.. పబ్లిక్

# జీవో.. సీక్రెట్





- 'బిల్డ్ ఏపీ'లో కీలక ప్రక్రియైన కమిటీలను వేస్తూ ఉత్తర్వులు
- రాష్ట్రస్థాయిలో సీఎం నేతృత్వం
- జిల్లాల్లో కలెక్టర్‌కు ఆ బాధ్యత
- కమిటీల ఏర్పాటుపై ఇచ్చిన జీవోపై అతి గోప్యత!
- గతంలో వర్సిటీలకు ఊరట
- ఇప్పుడు వాటికీ ఉత్తర్వులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఖరీదైన సర్కారీ భూములను తెగనమ్మడానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ భూముల జాబితాను ఖరారు చేయడానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కీలక కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై రెవెన్యూశాఖ ఉత్తర్వులు (జీవో 66) జారీ చేసింది. కాక పోతే ఈ జీవోను రహస్యంగా ఉంచారు. ప్రభుత్వ భూముల అమ్మకంపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్న నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...

## 'పెద్దలు' ఎవరు?

- ఏపీలో 4 సీట్లు సహా 55 ఖాళీలకు మార్చి 26న పోలింగ్
- రేసులో అయోధ్యరామిరెడ్డి, బీద మస్తాన్‌రావు?
- మేకపాటి, బోస్ కూడా!
- ఒక సీటు ఎస్సీ మహిళకు?
- వైసీపీ నేతల్లో జోరుగా చర్చలు

2











## అవినీతి ఉండకూడదు

- నా స్థాయిలో, అధికారుల్లోనే 50% తగ్గాలి
- మిగిలింది ఏసీబీ చూసుకోవాలి: సీఎం
- నెలలోగా ఇళ్ల స్థలాల సేకరణ పూర్తి కావాలి
- రూపాయి ఎక్కువ ఇచ్చే తీసుకోండి
- ప్రభుత్వానికి ఎవరి ఉసురూ తగలకూడదు
- 'స్పందన'పై సమీక్షలో సీఎం జగన్ ఆదేశాలు

2



## ఆరుగురు జడ్జీలకు స్వైన్‌ఫ్లూ

- విచారణకు ఆటంకం
- సీజే ఆందోళన...
- జడ్జీలతో, బార్‌తో భేటీ

9

## ఆర్థిక నేరగాడనే పిలవలేదు

- ట్రంప్ పర్యటనకు జగన్‌ను పిలవని కేంద్రం
- గతంలో ఎందరో మన రాష్ట్రానికొచ్చి కితాబు
- ఇలాంటి ముఖ్యమంత్రి జనం దౌర్భాగ్యం
- ఆయన తండ్రి స్కీమ్‌లను కొనసాగించా
- జగన్ మాత్రం కక్షతో రద్దుబాట పట్టారు
- వసతి దీవెన కాదది.. వంచన: చంద్రబాబు

3



పరంజ్యోతి

# సమూర్త్యారాధనతోనే నిర్గుణ జ్ఞానం



భూమ్మీద జన్మించే 84 లక్షల జీవరాశులన్నింటిలోకీ మానవుడు పరమశ్రేష్ఠుడు. బుద్ధి, జ్ఞాన, వికాసాలతో ప్రకాశించే మానవ జన్మ ఉత్తమమైనది. మిగతా జన్మలన్నింటిలో కర్మఫలాన్ని అనుభవించే జీవుడికి.. భగవంతుని సేవలో తరించి మోక్షాన్ని అందుకోవడానికి దొరికిన మార్గమే మానవ జన్మ. అంతటి ఉత్కృష్టమైన మానవ జన్మ లభించినప్పుడు ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధించి, నిరంతరం సత్యకాముకుడిగా ఉంటే కైవల్యం ప్రాప్తిస్తుంది. అలా జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి మానవునికి ఉపకరించే సాధనాలు.. తపస్సు, సాధన, ఆరాధన, సేవాభావ నిరతి. వీటిలో సామాన్య మానవులకు సులభమైనది ఆరాధన. భగవంతుని ఆరాధనలో అమూర్త్యారాధనం, సమూర్త్యారాధనం అని రెండు రకాలున్నాయి. అమూర్త్యారాధనం అంటే.. తపస్సు, దీక్ష, ఇంద్రియ నిగ్రహాల ద్వారా పరమాత్మని దర్శించడం. కానీ అది అందరికీ సాధ్యం కాదు. 'సగుణ జ్ఞాన హీనస్య న హి నిర్గుణ వేదనం'.. సగుణ జ్ఞానం లేనివారికి నిర్గుణజ్ఞానం సిద్ధించదని దీని అర్థం. నిరాకారుడై, అండపిండబ్రహ్మాండాల్లో నిండి నిబిడీకృతమైనటువంటి ఆ పరమాత్మను ఎట్టి అవరోధాలూ లేకుండా ధ్యానించగలిగే స్థితికి చేరుకోవాలంటే అందుకు సమూర్త్యారాధన దోహదం చేస్తుంది. సమూర్త్యారాధనం అంటే.. భగవంతుని విగ్రహంలోకి ఆవాహనం చేసి మంత్రపూర్వకంగా, భక్తిశ్రద్ధలతో పూజించడం. ఏ ఆరాధనకైనా త్రికరణశుద్ధి అవసరం. సమూర్త్యారాధనలో భగవంతుని అర్ఘ్య, పాద్య, ధూప, దీప, నైవేద్యాది ఉపచారములతో పూజిస్తే.. స్వామి ఆవాహిత బింబం నుంచి దర్శనమిస్తూ భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తాడు. సమూర్త్యారాధనకు పుణ్యదినాలు, పండుగ రోజులు, కార్తిక, మార్గశీర్షాది పవిత్రమాసాలు ఉత్కృష్టమైనవి. అలాగే.. సమూర్త్యారాధనకు ఆలయాలు ముఖ్యద్వారములు. భగవంతుని ప్రాణప్రతిష్ఠ జరిగిన ఆలయాల్లో విశేష సేవలు, ఉత్సవాలు మానవులను భక్తి మార్గంలో ముందుకు నడిపి ముక్తికి మరింత దగ్గర చేస్తాయి. అందునా..

### రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే

రథమునందు అధిరోహించిన ఆ కేశవుణ్ని దర్శిస్తే పునర్జన్మ ఉండదని అంటారు. భౌతికదృష్టితో చూస్తే ఇది ఆలయాల్లో జరిగే రథోత్సవాలకు వర్తిస్తుంది. అంతర్‌దృష్టితో చూస్తే.. రథం అంటే ఈ శరీరమే. మన దేహమే రథం, జీవాత్మయే రథారూఢుడైన పరమాత్మ, ఈ రథానికి సారథి బుద్ధి, మనసే పగ్గం, ఇంద్రియాలు ఈ రథాన్ని లాగే గుర్రాలు. బుద్ధి అనే సారథి చేత మనసనే పగ్గంతో ఇంద్రియాలనే గుర్రాలను అదుపులోకి తెచ్చుకుని, వశపరచుకుంటే దుఃఖాన్ని (సంసార సాగరం) వీడి.. 'తద్విష్ణోః పరమంపదమ్'.. సర్వవ్యాపకుడైన విష్ణుస్థానాన్ని చేరడం తథ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే.. మనలోనే కొలువై ఉన్న విష్ణువును చూడగలిగిన నాడు ఇక పునర్జన్మన్న మాట ఎక్కడుంది!

- పరాంకుశం శ్రీనివాసమూర్తి, 9493455256

# వచ్చాడయ్యో స్వామీ...!

- ప్రధాన దేవాలయాల్లో ఆయన మాటే వేదం
- ఈ స్వామీజీ సిఫారసులు జీవోతో సమానం
- ఆ కోటాలోనే దుర్గగుడి పాలకమండలిలో హోమియో వైద్యుడికి పదవి



స్వామిజీ తరఫున గవర్నర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న వైద్యుడు రమణ

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో నామినేటెడ్ పదవులు దక్కడం సహజమే. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఓ ప్రముఖ స్వామీజీ పేరిట కొత్తగా మరో కోటా ఏర్పడింది. సీఎం జగన్ సహా ప్రభుత్వ పెద్దలు, కీలక ఉన్నతాధికారులు తరచూ ఆయన దగ్గరకు వచ్చి పోతుండటంతో ఆయన మాటకు ఎదురే లేకుండా పోయిందని చెబుతున్నారు. కీలక దేవాలయాలకు పాలక మండళ్లు నియమించే సమయంలో తప్పనిసరిగా ఆయన సూచించిన వారికి అవకాశం కల్పించాలని అనధికారిక ఆదేశాలు కూడా ఉన్నాయంటున్నారు. ఇది ఒక రకంగా జీవోలానే భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రెండురోజుల క్రితం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం పాలక మండలిలో గుంటూరుకు చెందిన హోమియో వైద్యుడు ఓవీ రమణకు చోటు లభించింది. సదరు స్వామీజీకి ఆయన అత్యంత అనుంగు శిష్యుడు. ఇటీవల స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానించేందుకు ఈ వైద్యుడే వెళ్లి ఆహ్వానపత్రం కూడా అందించారు. ఇటీవల గుంటూరులోని గోరంట్ల ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన స్వామీజీ తిరిగి కారు దగ్గరకు వెళ్తుండగా రాజధాని ప్రాంత మహిళలు ముట్టడించి 'జై అమరావతి' అనాలని పట్టుబట్టారు. ఆ సమయంలో పక్కనే ఉన్న రమణ ఆయనను ఆందోళనకారుల నుంచి తప్పించి కారులో తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనల ద్వారా స్వామీజీతో ఆయనకున్న సాన్నిహిత్యం వెల్లడైంది. ప్రస్తుతం ఆయన సిఫారసుతోనే రమణకు పాలకమండలిలో చోటుదక్కిందని చెబుతున్నారు. ఈ పదవికోసం గుంటూరు నగరానికి చెందిన పలువురు వైసీపీ నేతలు ప్రయత్నించినప్పటికీ అవకాశం లభించలేదు. తమకు కాకుండా పార్టీతో ఏమాత్రమూ సంబంధం లేనివ్యక్తికి ఆ పదవి దక్కడంతో అంతా విస్మయానికి గురయ్యారు. స్వామీజీ సిఫారసుతోనే వైద్యుడికి పదవి దక్కిందని తెలియడంతో భగ్గుమంటున్నారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రముఖ ఆలయ పాలకమండళ్లలోనూ ఆయన సిఫారసుతో పదవులు పొందినవారున్నారని తెలుస్తోంది. గుంటూరుజిల్లా నుంచి దుర్గగుడి పాలకమండలిలో ఇద్దరికి చోటు దక్కగా అందులో రమణ ఒకరు. రెండోది వైసీపీ సానుభూతిపరుడి కుటుంబానికి దక్కింది.

# ఎవరి ఉసురూ తగలొద్దు

- కలెక్టర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి
- యుద్ధప్రాతిపదికన చేయకపోతే లక్ష్యాన్ని చేరుకోలేం
- భూములు రూపాయి ఎక్కువ ఇచ్చే తీసుకోండి
- నెలలోగా స్థలాల సేకరణ
- సిద్ధమైన ప్లాట్లలో వెంటనే లాటరీ తీయండి
- ఏ ప్లాటు ఎవరికో ముందస్తుగా ప్రకటించాలి
- 'స్పందన'పై సమీక్షలో సీఎం జగన్ ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం రోజు నిర్వహించే 25లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని సీఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు. దీనికి మరో నెల మాత్రమే సమయం ఉందని, యుద్ధప్రాతిపదికన పనులు చేయకపోతే లక్ష్యాన్ని చేరుకోలేమని హెచ్చరించారు. ఇళ్ల పట్టాల కోసం వీలైనంత త్వరగా భూమిని సమీకరించుకోవాలన్నారు. గుర్తించిన భూముల్లో శరవేగంగా భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలని, సిద్ధం చేసిన ప్లాట్లలో వెంటనే లాటరీ నిర్వహించి ఏ ప్లాటు ఏ లబ్ధిదారుడిదో ముందస్తుగానే ప్రకటించాలని సీఎం ఆదేశించారు. స్పందన కార్యక్రమంపై ఆయన సచివాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఇళ్ల పట్టాల పంపిణీపై సమీక్షించారు. భూసేకరణలో కలెక్టర్లు మానవతా దృక్పథంతో ఉండాలని, అవసరమైతే ఒక రూపాయి ఎక్కువ ఇచ్చే భూములు తీసుకోవాలని జగన్ సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మంచిపని చేస్తున్నామని దీనివల్ల ప్రభుత్వానికి ఎవరి ఉసురూ తగలకూడదన్నారు. ఫలానా కలెక్టర్ అన్యాయంగా తీసుకున్నాడన్న మాట రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఇళ్ల పట్టాల పంపిణీలో సమస్యల పరిష్కార బాధ్యతలను సీఎస్ నీలం సాహ్ని, సీఎంఓ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు అప్పగించారు. సీఎం ప్రధాన సలహాదారు అజేయ కల్లాంకు ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, సీఎంఓ కార్యదర్శి ఆరోకియా రాజ్‌కు రాయలసీమ జిల్లాలు, సీఎంఓ అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డికి ఉత్తరాంధ్ర జిల్లాల బాధ్యతలు అప్పగించారు.



### 'బెల్టు' తీయండి

రాష్ట్రంలో ఇంకా బెల్టుషాపులు నడుస్తున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇవి నడుస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వివరాలు తెప్పించుకుని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ మద్యం, అక్రమ ఇసుక తవ్వకాలు తదితరాలపై స్థానిక ఎస్పీ, డీజీపీలకు, వాటిని నిరోధించేందుకు ఏర్పాటైన ప్రత్యేక బృందాలకు అభ్యర్థనలు పంపాలని సూచించారు. సమస్యను పరిష్కరించిన తర్వాత ఫిర్యాదుదారుడి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని ఆదేశించారు. దీనివల్ల వినతులిచ్చినవారు సంతృప్తి చెందుతారని సీఎం పేర్కొన్నారు. పెన్షన్లు, బియ్యం కార్డుల పునఃపరిశీలనపై జగన్ సమీక్షించారు. అదనపు లబ్ధిదారులకు వచ్చేనెల 1కల్లా కార్డులు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతి వలంటీర్‌కూ 50ఇళ్ల కేటాయింపులపై క్లస్టర్‌ను మ్యాపింగ్ చేయాలన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులకు అటెండెన్స్ తప్పనిసరని, వలంటీర్లు కూడా అందుబాటులో ఉన్నారని చెప్పేలా ఏదో ఒక సమయంలో హాజరు ఇచ్చే పరిస్థితి ఉండాలన్నారు. మార్చి 1కల్లా అన్ని దిశ పోలీసు స్టేషన్లనూ సిద్ధం చేయాలని జగన్ ఆదేశించారు. ప్రతి గ్రామ సచివాలయాల్లోనూ మహిళా పోలీసు, మహిళా మిత్రలను నియమించామని వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. కాగా, పోలీసులు శరవేగంగా పని చేసి చార్జిషీటు వేయడంతో సహా గట్టి ఆధారాలు కోర్టు ముందుంచడంతో చిత్తూరులో బాలిక అత్యాచారం, హత్య కేసులో తీర్పువచ్చిందని డీజీపీ గౌతం సవాంగ్ చెప్పారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ఎస్పీ సెంథిల్‌ను సీఎం అభినందించారు. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలో కరెంటు కోతలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, కృష్ణా, కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మంచినీటి సమస్య ఉందని, వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ నీలం సాహ్ని, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### అవినీతి ఉండకూడదు

రాష్ట్రంలో అవినీతి అనేది ఎక్కడా ఉండకూడదని సీఎం జగన్ స్పష్టం చేశారు. తనతో పాటు అధికారుల స్థాయిలో 50శాతం తగ్గితే మిగతా సగం తగ్గించేందుకు ఏసీబీ అధికారులు పూర్తిస్థాయి దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు అవినీతి నిరోధానికి ప్రారంభించిన టోల్ ఫ్రీ నంబరుపై ప్రచార వీడియోను సీఎం విడుదల చేశారు. దానిలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుతో సందేశం ఇప్పించారు. 'ఎవరు అవినీతికి పాల్పడినా నిర్భయంగా మీ గొంతు వినిపించండి. వెంటనే 14400 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వండి. అవినీతి రహిత రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్ సంకల్పం. లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని ఆ వీడియో సందేశంలో సింధు హామీ ఇచ్చారు.

# సేల్ పబ్లిక్.. జీవో సీక్రెట్

(మొదటి పేజీ తరువాయి)

తొలి నుంచీ ఈ అంశాన్ని చాలా గుట్టుగా ఉంచుతున్నారు. కమిటీ ఏర్పాటులోనూ ఇదే ఒరవడిని కొనసాగించారు. ముఖ్యమంత్రి చైర్మన్‌గా రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ (ఎస్ఎల్ఎంసీ)ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను అమ్మిపెట్టే నోడల్ ఏజెన్సీగా ఉన్న నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌ని (సీఎండీ) కమిటీ వైస్‌చైర్మన్‌గా నియమించారు. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్) ఈ కమిటీ కన్వీనర్‌గా, 'బిల్డ్ ఏపీ మిషన్' డైరెక్టర్ ఉప కన్వీనర్‌గా ఉంటారు. 'ఎన్‌బీసీసీ' నుంచి మరో ప్రతినిధికి ఈ కమిటీలో అవకాశం కల్పించారు. రెవెన్యూ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ఉంటే ఈ కమిటీలో పట్టణాభివృద్ధిశాఖ అధికారి, పురపాలక కమిషనర్, 'ఎన్‌బీసీసీ' ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వ భూములను అమ్మడానికి జగన్ ప్రభుత్వం.. 'బిల్డ్ ఏపీ' పేరిట మిషన్‌ను చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం దగ్గర ఉన్న విలువైన భూములతోపాటు కబ్జాకు గురవుతున్నవీ, ఇంకా కాపాడుకోలేక అన్యాక్రాంతమవుతున్న వాటినీ అమ్మాలని భావించింది. ఈ భూములను అమ్మి నాడు-నేడు పేరిట అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇది బిల్డ్ ఏపీలో భాగమేనని చెబుతోంది. దీనిపై గత ఏడాది నవంబరు 5న 'ఎన్‌బీసీసీ'తో ఒప్పందం కుదుర్చుకుంది. 'ఎన్‌బీసీసీ' అనేది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ప్రభుత్వ భూములను అమ్మడంలో దానికి మంచి ట్రాక్ రికార్డు ఉందని ఏరికోరి ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. నగరాలు, పట్టణాల్లో మంచి ధర పలికే భూములనే ప్రభుత్వం విక్రయించాలనుకుంటోంది. ప్రభుత్వ శాఖలు, వాటి పరిధిలోని సంస్థలకు నగరాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల పరిధిలో విలువైన భూములున్నాయి. వీటిలో మంచి ధరకు అమ్ముడుపోయే భూములను గుర్తించడం కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి ప్రణాళిక, అమలు కమిటీ(డీపీఐసీ) బాధ్యత. ఇప్పటికే జిల్లాలవారీగా అమ్మే భూముల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పుడు 'డీపీఐసీ'ల ఏర్పాటుతో ఈ ప్రక్రియలో కదిలిక రానుంది. అమ్మకానికి సిద్ధం చేసిన భూముల జాబితాను 'డీపీఐసీ' ఆమోదిస్తుంది. ఆపై దాన్ని రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీకి పంపిస్తారు. అక్కడ కూడా ఈ జాబితాను ఆమోదించి కేబినెట్‌కు పంపిస్తారు. ఇందులో జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీల ఆమోదమే అత్యంత కీలకం. ఈ రెండు ఘట్టాలు దాటాక మంత్రివర్గ ఆమోదం లాంఛనమే. అనంతరం జిల్లాల వారీగా ఈ-బిడ్డింగ్ నిర్వహించి భూములను అమ్మేస్తారు.

**తొలగని కత్తి:** 'ఎన్‌బీసీసీ'తో ఒప్పందంలో అమ్ముకునే భూములపై వివరణ ఇచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలు, అటానమస్ సంస్థలు, విశ్వవిద్యాలయాల పరిధిలోని భూములు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వర్సిటీలు, దాని పరిధిలోని విద్యాసంస్థల వద్ద ఖాళీగా ఉన్న విలువైన భూములు కూడా అమ్ముకునే వెసులుబాటు ఉంది. ఇదే అంశాన్ని వెలుగులోకి తీసుకొస్తూ 'క్యాంపస్ ఖల్లాస్' శీర్షికన ఆంధ్రజ్యోతి వార్తలు వెలువరించింది. దీనిపై అప్పట్లోనే ప్రభుత్వం స్పందించింది. భూముల అమ్మకం పద్దు నుంచి యూనివర్సిటీ, విద్యాసంస్థల భూములను మినహాయించాలని కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. అయితే, దీనికి అనుగుణంగా 'ఎన్‌బీసీసీ'తో కుదుర్చుకున్న ఒప్పందంలో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. జీవో 447లో పేర్కొన్న ల్యాండ్ పార్సిల్ అన్న పదాన్ని సవరించలేదు. ఆ తర్వాత ఇచ్చిన మార్గదర్శకాల ఉత్తర్వు(జీవో 474)లోనూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీన్ని బట్టి విద్యాసంస్థల భూములపై కత్తి వేలాడుతున్నట్లేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికితోడు, కమిటీల ఏర్పాటుపై మంగళవారం ఇచ్చిన జీవో 66లోని అంశాలు ఈ ఆందోళనను మరింత బలపరిచేలా ఉంది. ఈ జీవో ప్రతిని ప్రభుత్వశాఖలతోపాటు వర్సిటీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు కూడా పంపించాలని అందులో పేర్కొన్నారు. వర్సిటీల భూములు అమ్మడం లేదని నిర్ణయం తీసుకున్నప్పుడు, ఉత్తర్వు కాపీని వాటికి పంపించడంలోని ఆంతర్యమేంటో తేలడం లేదు. ఇదే అంశంపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా, తాము కాంపిటెంట్ కాదంటూ స్పందించేందుకు నిరాకరించారు.

# సర్వేతోనే బీసీల లెక్క తేలాలి!

- 2010 జనాభా లెక్కలతో.. రిజర్వేషన్లు ఎలా ఖరారు చేస్తారు?
- కోటాపై నెలాఖరులో.. లేదంటే మార్చి మొదటివారంలో తీర్పు: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల అంచనాలతో రిజర్వేషన్లు ఎలా ఖరారు చేస్తారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సర్వే ద్వారా తేలిన జనాభాను బట్టి బీసీల రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం బీసీల సంఖ్యను అంచనా వేయడం సరికాదని అభిప్రాయపడింది. బీసీలను లెక్కించి, ఆ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని.. వాటిపై వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది జాబితాను ప్రచురించాలని.. కానీ ప్రభుత్వం ఈ నిబంధనల్ని పాటించినట్లు లేదని పేర్కొంది. తమకూ రాష్ట్రాభివృద్ధి ముఖ్యమేనని, అయినా అన్నిటినీ న్యాయపరంగానే పరిశీలిస్తామని వ్యాఖ్యానించింది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల వ్యవహారంపై ఈ నెలాఖరులోపు గానీ, మార్చి మొదటివారంలో గానీ తీర్పు వెల్లడిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 59.85 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం గత డిసెంబరు 28న జారీ చేసిన జీవో 176తో పాటు, బీసీల రిజర్వేషన్లకు వీలు కల్పిస్తున్న ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని పలు సెక్షన్లను సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇప్పటికే వాదనలు పూర్తయ్యాయి. అయితే రాజ్యాంగంలోని 340 అధికరణ కింద ఏర్పాటయ్యే బీసీ కమిషన్, ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 202-ఏ కింద ఏర్పాటయ్యే బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లకు సంబంధించి నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని ధర్మాసనం అడ్వకేట్ జనరల్‌కు, పిటిషనర్లకు సూచించింది. ఈ నేపథ్యంలో ఆ అంశాలపై మంగళవారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ.. రాజ్యాంగంలోని 340 అధికరణలో పేర్కొన్న బీసీ కమిషన్‌కు, పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 202-ఏలో పేర్కొన్న బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఏమాత్రం సంబంధం లేదన్నారు. బీసీ కార్పొరేషన్ బీసీల సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించి సిఫారసులు చేస్తుందన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎన్నికల కోసం బీసీ జనాభాను గణిస్తుందన్నారు.

**బీసీలకు 34% రిజర్వేషన్లు సబబే: ఏజీ**

ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరాం వాదిస్తూ.. 2011 జనాభా లెక్కల ప్రకా రం రాష్ట్రంలో బీసీల సంఖ్య 48 శాతంగా ఉందని, వారికి 34% రిజర్వేషన్లు కల్పించడం సబబేనని తెలిపారు. డి.కృష్ణమూర్తి కేసులో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు స్ప ష్టం చేసిందన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రా జ్యాంగంలోని అధికరణ 340 కింద ఏర్పాటు కాలేదని, పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 202-ఏ కింద ఏర్పాటైందన్నారు. విభజన చట్టం 9వ షెడ్యూలు లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉందని తెలిపారు. ప్రత్యేక పరిస్థితులను బట్టి రిజర్వేషన్లు మీరవచ్చని ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు పేర్కొందని చెప్పారు.

# రాజ్యసభ ఎన్నికలకు మోగిన నగారా

- 55 స్థానాలకు మార్చి 26న ఎన్నికలు
- ఏపీలో 4, తెలంగాణలో 2 సీట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు మంగళవారం షెడ్యూల్ విడుదలైంది. మొత్తం 55 స్థానాలకు.. మార్చి 26న కొత్తవారిని ఎన్నుకునేందుకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. వీరిలో 17 రాష్ట్రాల నుంచి 51 మంది సభ్యులు ఏప్రిల్ 9తో పదవీ విరమణ చేయనుండగా, నలుగురు ఇప్పటికే రాజీనామా చేశారు. ఈ స్థానాల భర్తీకి మార్చి 6న నోటిఫికేషన్ వెలువడుతుంది. మార్చి 13వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాలి. 18తో ఉపసంహరణ గడువు ముగుస్తుంది. 26వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుంది. కాగా, ఈసారి ఏపీలో 4 స్థానాలకు, తెలంగాణలో 2 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం తెలంగాణ కోటాలో రాజ్యసభ సభ్యులుగా ఉన్న కేవీపీ రామచంద్రరావు, గరికపాటి మోహనరావు, ఏపీ కోటాలో సభ్యులుగా ఉన్న ఎంఏ ఖాన్, టి.సుబ్బరామి రెడ్డి, తోట సీతామహాలక్ష్మి, కె.కేశవరావు సహా ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అథావలే (మహారాష్ట్ర), దిగ్విజయ్ సింగ్ (మధ్యప్రదేశ్) వంటి ప్రముఖుల పదవీ కాలం ముగియనుంది.

## సుప్రీంకోర్టులోని పిటిషన్లతో.. సంబంధం లేదని అఫిడవిట్ వేయండి

- పోలవరంపై కేవీపీకి హైకోర్టు సూచన

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏపీవిభజన అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లకు, పోలవరం వ్యవహారంపై దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధం లేదంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు తరఫు న్యాయవాదికి హైకోర్టు సూచించింది. ఆ అఫిడవిట్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామంది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం నిర్మాణ వ్యయం మొత్తం కేంద్రమే భరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ కేవీపీ 2017లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం మరోమారు విచారణ జరుగగా.. కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్ వాదనలు వినిపించారు. రాష్ట్ర విభజనకు సంబంధించిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రం పిటిషన్ దాఖలు చేసిందని, ఈ పిటిషన్ కూడా అక్కడికే వెళ్లాల్సి ఉందని తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. ఆ పిటిషన్లకు, తమ పిటిషన్‌కు సంబంధం లేదని చెప్పారు.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న పోలీసులు

- అక్రమ నిర్బంధం కేసులో హై కోర్టు వ్యాఖ్య
- సీబీఐ విచారణకు ఆదేశించిన ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. మంగళవారం ఈ కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "బిహార్ కన్నా ఏపీలోనే అక్ర మ నిర్బంధ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నా యి. ఏపీ పోలీసుల విధానం ఎమర్జెన్సీని తలపిస్తోంది. పోలీసులు చట్ట నిబంధనలని ఏ మాత్రం పాటించడం లేదు" అని జస్టిస్ రాకేశ్‌కుమార్, జస్టిస్ డీ రమేశ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 17కి వాయిదా వేసింది. గుంటూరుకు చెందిన నల్లబోలు ఆదినారాయణ, రాయిడి శ్రీనివాసరావు, తూమాటి శ్రీనివాసరావు గత ఏడాది అక్టోబరు 14 నుంచి కనిపించడం లేదంటూ వారి కుటుంబీకులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అదే నెల 29న గుంటూరు అర్బన్ ఎస్పీకి మొరపెట్టుకున్నారు. ఫలితం లేకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. అక్టోబరు 31న హెబియస్ కార్పస్ పిటిషన్లను పరిశీలించిన హైకోర్టు.. పూర్తి విచారణ జరిపి వివరాలు సమర్పించాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. క్రికెట్ బెట్టింగ్ ఆరోపణల కింద ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసిన గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీసులు.. అక్టోబరు 31న మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. విచారణ సందర్భంగా తాము అక్టోబరు 14 నుంచే పోలీసుల అదుపులో వున్నట్లు ఆ ముగ్గురూ వాంగ్మూలం ఇచ్చారు. ఆ రికార్డు ప్రతుల్ని పిటిషనర్ల త రఫు న్యాయవాది వెంకటేశ్వర్లు హైకోర్టు ముందుంచారు.

# రాజ్యసభ రేసులో అయోధ్యరామిరెడ్డి, మస్తాన్‌రావు?

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీలో రాజ్యసభ ఎన్నికల కోలాహలం మొదలైంది. నలుగురు అభ్యర్థులెవరో ప్రకటించేందుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. పార్టీ కోసం కష్టపడే వారికీ.. అధినేత జగన్‌కు నమ్మినబంట్లుగా ఉన్నవారికే అవకాశం దక్కుతుందని పార్టీ నేతలు అంటున్నారు. అటు సీఎం జగన్ కూడా సీనియర్ నేత విజయసాయిరెడ్డిని మంగళవారం తాడేపల్లికి పిలిపించి మంతనాలు జరిపారు. అభ్యర్థుల జాబితాలో తొలివరుసలో 'రాంకీ' అయోధ్యరామిరెడ్డి పేరున్నట్లు సమాచారం. ఇదే సమయంలో టీడీపీని వీడి వైసీపీకి వచ్చే సమయంలోనే.. నెల్లూరు నేత బీద మస్తాన్‌రావుకు రాజ్యసభ పదవి ఇస్తానని జగన్ హామీ ఇచ్చారని అంటున్నారు. అయితే.. ఇదేజిల్లాకు చెందిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కూడా తనకూ ఈ హామీ ఇచ్చారని చెబుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. శాసనమండలి రద్దు తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించిన నేపథ్యంలో మండలి నుంచి మంత్రులుగా కొనసాగుతున్న చంద్రబోస్, మోపిదేవిలకు ఎమ్మెల్సీల కంటే ఉన్నత పదవులు ఇస్తానని మంత్రివర్గ సమావేశంలో జగన్ హామీ ఇచ్చారు. దీంతో వీరి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. టీడీపీ నుంచి వైసీపీలో చేరిన అమలాపురం మాజీ ఎంపీ పి.రవీంద్రబాబుకు కూడా రాజ్యసభ చాన్సు దక్కవచ్చని అంటున్నారు. అయితే ఎస్సీ మహిళను పంపే అవకాశమూ ఉందని చర్చ నడుస్తోంది.

## లోకం తీరు




### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 18.6 | 34.6 |
| కడప | 20.0 | 36.0 |
| హైదరాబాద్ | 20.8 | 34.7 |
| గుంటూరు | 20.1 | 33.9 |
| విజయవాడ | 21.6 | 34.1 |
| విశాఖపట్నం | 21.6 | 32.6 |
| ఒంగోలు | 23.1 | 32.6 |

## నేడు, రేపు ఉత్తరాంధ్రకు వర్షసూచన

అమరావతి/విశాఖపట్నం ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బిహార్ పరిసరాల నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. అలాగే రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తాయని పేర్కొంది. వీటి ప్రభావంతో యానాం, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఈ నెల 26, 27 తేదీల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతంలో మాత్రం పొడి వాతావరణమే ఉంటుందని వివరించింది.



## మోదీ ఉన్నంత కాలం కశ్మీర్‌పై ఏమీ చేయలేం

భారత్ ప్రధానిగా మోదీ ఉన్నంత కాలం కశ్మీర్ విషయంలో ఏమీ చేయలేం. భవిష్యత్తులో భారత్‌లో మరో బలమైన నాయకుడు వస్తేనే కశ్మీర్ సమస్య పరిష్కారమవుతుంది. కశ్మీరీలకు హక్కులు కల్పిస్తామని దేశ విభజన సమయంలో ఇచ్చిన మాటను నెహ్రూ నిలబెట్టుకోలేదు.

- ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధాని



## వాళ్ల నోటికి తాళం వేయాలని కోరుకున్నా

సీఏఏ, ఎన్నార్సీలపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్న వాళ్ల నోటికి తాళం వేయాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నా. దేశంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ప్రార్థించా. 370 ఆర్టికల్ ద్వారా ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో ప్రశాంతమైన వాతావరణం నెలకొని ఉంది. అక్కడ ప్రజలు చాలా ఆనందంగా ఉన్నారు.

- ప్రహ్లాదమోదీ, ప్రధాని సోదరుడు

## 'ఈ సిగరెట్ల'తో డీఎన్ఏకు దెబ్బ

కాలిఫోర్నియా, ఫిబ్రవరి 25: సాధారణ సిగరెట్లతో క్యాన్సర్, గుండెపోటు ప్రమాదం ఉండటంతో ప్రత్యామ్నాయంగానో, లేదా అలవాటు మానేందుకో, తగ్గించుకునేందుకో కొందరు ఎలక్ట్రానిక్ సిగరెట్ల (ఈ సిగరెట్ల)ను ఆశ్రయిస్తుంటారు. అయితే, అవి కూడా మంచివేమీ కావనే వాదన ఉంది. అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ బృందం చేసిన అధ్యయనం దీనిని బలపరుస్తోంది. జింక్ ప్రమాదకర స్థాయిలో ఉండటంతో 'ఈ సిగరెట్లు' మనిషి డీఎన్ఏ (డి ఆక్సిరైబో న్యూక్లియిక్ ఆసిడ్)ను దెబ్బతీస్తాయి. వాటిని తాగే అలవాటున్న గర్భిణులకైతే ముప్పు మరింత ఎక్కువ.

## డెయిరీ పాలతో రొమ్ము క్యాన్సర్ ప్రమాదం!

లాస్‌ఏంజెల్స్, ఫిబ్రవరి 25: ఈ రోజుల్లో అంతా డెయిరీ (ప్యాకెట్) పాలనే కొనుగోలు చేస్తున్నారు. అయితే, వీటి వినియోగం కారణంగా మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని అమెరికాలోని లొమా లిండా వర్సిటీ అధ్యయనంలో తేలింది. వినియోగం స్థాయిని బట్టి రొమ్ము సోకే క్యాన్సర్ ముప్పు 80% వరకు ఉంటుందని వర్సిటీ పేర్కొంది. 'రోజుకు పావు కప్పు నుంచి ముప్పావు కప్పు వరకు డెయిరీ పాలను తాగే వారిలో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం 30%, కప్పు తాగేవారిలో ముప్పు 50%, రెండు లేదా మూడు కప్పులైతే ముప్పు 70నుంచి 80% వరకు ఉంటుందని' అధ్యయనంలో పాల్గొన్న గ్యారీ ఫ్రేజర్ పేర్కొన్నారు. 8 ఏళ్ల పాటు డెయిరీ పాలు తాగుతున్న 53 వేలమంది ఉత్తర అమెరికా మహిళలను పరిశీలించగా.. వారిలో 1,057 మంది రొమ్ము క్యాన్సర్ బారినపడినట్లు గుర్తించారు.


విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరావు

## నెలాఖరులోగా సీపీఎస్‌ను రద్దు చేయాలి

- 59 % ఫిట్మెంట్‌తో తక్షణం పీఆర్సీ ఇవ్వాలి
- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

గుంటూరు, ఫిబ్రవరి 25 : కొద్ది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సీపీఎస్ రద్దు విషయంలో ప్రభుత్వం తక్షణం స్పందించి ఈనెలాఖరు లోగా రద్దు చేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.చంద్రశేఖరరెడ్డి, బండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్జీవో అసోసియేషన్‌కు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర వర్గాన్ని గుంటూరులోని ఎన్జీవో కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రిపోర్టును ఈనెలాఖరు లోగా తెప్పించుకుని సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీ విషయంలో సాచివేత ధోరణి అవలంబించడం తగదన్నారు. తక్షణం పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 53 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ పదవీ విరమణలోపు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఏనుగు లాంటిదని, దొడ్డిదారిన గుర్తింపు పొందిన కొన్ని సంఘాలు తమ సంఘం ముందు చీమలు లాంటివన్నారు. అవి తమ సంఘాన్ని ఏమీ చేయలేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు బాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్‌బాబుకు జగనన్న విద్యాదీవెన




పత్తికొండ టౌన్/ఎమ్మిగనూరు ఫిబ్రవరి 25: కర్నూలు జిల్లా అధికారులు.. ప్రముఖ సినీ హీరో మహేశ్‌బాబుకు 'జగనన్న విద్యాదీవెన' పథకంలో అర్హత కల్పించారు!!. ఇది నిజం కాకపోయినా.. మహేశ్‌బాబు ఫొటోతో ఉన్న జగనన్న దీవెన కార్డు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. పత్తికొండ నియోజకవర్గంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న ఈడిగ లోకేశ్‌గౌడ్‌తో పాటు ఎమ్మిగనూరులోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పరంపోగు లక్ష్మి జగనన్న విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. లోకేశ్‌గౌడ్‌కు ఇప్పటికే కార్డు అందగా.. లక్ష్మికి ఇంకా అందాల్సి ఉంది. ఆమె కార్డు ప్రస్తుతం గ్రామ సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటం చూసిన లక్ష్మి తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. జరిగిన పొరపాటును అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సచివాలయ ఉద్యోగుల ద్వారానే తప్పు జరిగిందని, తమకెలాంటి సంబంధం ఉండబోదని చెబుతుండటం విశేషం.

# ఆర్థిక నేరగాడనే పిలవలేదు



"టీడీపీ హయాంలో దేశవిదేశాలకు చెందిన అధినేతలు, కార్పొరేట్ సంస్థల సీఈవోలు మన రాష్ట్రానికి వచ్చారు. ఇక్కడి పాలనా పద్ధతులనూ, అభివృద్ధినీ ప్రశంసించారు. అమెరికా దేశాధ్యక్షుడు ట్రంప్ రాక సందర్భంగా కనీసం మన ముఖ్యమంత్రికి ఆహ్వానం లేకపోవడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం. ఆర్థిక నేరస్థుడు కాబట్టే జగన్‌కు కేంద్రప్రభుత్వం నుంచి పిలుపందలేదు"

-చంద్రబాబు, టీడీపీ అధినేత

- ట్రంప్ పర్యటన సందర్భంగా కనీసం ఆహ్వానించని కేంద్రం
- గతంలో ఎందరో మన రాష్ట్రానికి మన పాలన, పద్ధతులకి కితాబు
- ఇలాంటి సీఎం జనం దౌర్భాగ్యం
- తండ్రి స్కీమ్‌లను కొనసాగించా
- జగన్ మాత్రం కక్షతో రద్దుబాట
- వసతి దీవెన కాదది.. వంచన
- రాష్ట్రంలో వైసీపీ దాడులపై కుప్పంలో చంద్రబాబు నిప్పులు


గోవిందపల్లెలో చంద్రబాబు ప్రసంగం

చిత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "సీఎం జగన్ మీద అనేక క్రిమినల్ కేసులున్నాయనే ట్రంప్ పర్యటన సందర్భంగా పిలుపు రాలేదు. అమెరికా చట్టం చాలా నిక్కచ్చిగా ఉంటుంది. ఇలాంటి ఆర్థిక నేరగాళ్లను వాళ్లు దూరంగా పెడతారు" అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను జగన్ కావాలనే రద్దు చేస్తున్నారని మండిపడ్డారు. "వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన చాలా కార్యక్రమాలను రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా నేను కొనసాగించాను. ఇప్పుడు అలా జరగడం లేదు. రాజధాని విషయంలో కూడా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తుతో ఆటలొద్దు. స్థానిక ఎన్నికలను గతంలోలాగే 59.85 శాతం రిజర్వేషన్‌తో నిర్వహించాలి. అవసరమైతే మేమూ మద్దతిస్తాం" అని ప్రకటించారు. 'జాగ్రత్త.. మీకూ త్వరలో ఇదే పరిస్థితి వస్తుంది' అంటూ టీడీపీ మీద దాడులకు తెగబడుతున్న వైసీపీ నాయకులను ఉద్దేశించి తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. వైసీపీ దాడులతో దెబ్బతిన్న టీడీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. విలేకరుల సమావేశం వివరాలు ఆయన మాటల్లోనే..

### అది విని నేనే కంగుతిన్నా..

"ప్రభుత్వ విధానాలను విమర్శించే మీడియాను ఎల్లోమీడియా అని ముద్ర వేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి మీడియా సైతం జగన్ తీరును పిచ్చి తుగ్లక్ పాలన అంటూ విమర్శిస్తోంది. వ్యతిరేక కథనాలు రాసేవారిపై కేసులు పెట్టి బెదిరిస్తున్నారు. రాష్ట్ర ప్రజలెవ్వరూ మూడు రాజధానులు కోరలేదు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో పిచ్చి ప్రయోగం చేస్తున్నారు... కొత్తగా 'జగనన్న వసతి దీవెన' తెచ్చారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన నేనే దీనిగురించి విని కంగుతిన్నాను. అది దీవెన కాదు.. వంచనా దీవెన"

### హీరోలయ్యే చాన్సొచ్చింది..

"ఇంటి పట్టాల పేరుతో పేదల నుంచి అసైన్డ్ భూములను లాక్కుంటున్నారు. ఇది దారుణం. మీకు చేతనైతే భూములను కొనుగోలు చేసి పంపిణీ చేయండి. మేమూ మద్దతిస్తాం. ఇలా బలవంతంగా లాక్కోవడంతో కొందరు గుండె పగిలి చనిపోతున్నారు. మరికొందరు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా నగదుతో లేదా దానిని పంచుతూ పట్టుబడితే వారిమీద అనర్హత వేటు వేస్తామని సీఎం కొత్త చట్టాన్ని తెరమీదకు తెచ్చారు. ఇది కావాలనే తీసుకొచ్చిన చట్టం. వారం వారం కోర్టుకు వెళ్లే నేరగాడు ఇలాంటి నీతి మాటలు చెప్పడం హాస్యాస్పదం. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పాలి. 1984లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు రాష్ట్రం కోసం పోరాడి హీరోలయ్యారు. తాజాగా ఎమ్మెల్సీలు అమరావతి కోసం వీరోచితంగా పోరాడి హీరోలయ్యారు. ఇప్పుడు ప్రజల సమయం వచ్చింది."

### పోరాడితేనే భవిష్యత్తు..

"వైసీపీ అధికారంలో వచ్చిన తొమ్మిది నెలల్లో అనేక కమిటీలు వేసి విచారించినా ఎలాంటి సాక్ష్యాలు లభించలేదు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పది మంది పోలీసు అధికారులతో గత ఐదేళ్ల పాలన గురించి సిట్ వేసి విచారిస్తారట! ఎక్కడైనా ఓ నిర్దిష్ట అంశం గురించి విచారించాలే గానీ ఇలా చేయడం తగదు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు చాలా ఉత్సాహంగా మాపై దాడులు చేస్తున్నారు. కావాలనే ఇబ్బందులు పెడుతున్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే చేసి ఉంటే మీరిప్పుడు ఇలా ఉండేవారు కాదు. మీకూ అదే పరిస్థితి త్వరలోనే వస్తుంది. ఈఎస్ఐ కుంభకోణంలో మాజీ మంత్రులపై కావాలనే బురద జల్లుతున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా జగన్ సీఎం పదవిని పట్టుకుని వేలాడుతున్నారు. జగన్‌కు సిగ్గుంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. అధికారపార్టీ నేతలు ఇసుకను పొరుగురాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్రమమద్యం విక్రయాలు చేస్తున్నారు. ఎడ్ల పందేల పేరిట డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. టీడీపీ సానుభూతిపరులు ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక నిల్వ ఉంచుకుంటే, వైసీపీ నేతలు పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు నమోదు చేయిస్తున్నారు. అవినీతి దౌర్జన్యకర వైసీపీపై పోరాటానికి ఉద్యమించాలి."

### తొలిరోజు నుంచీ రద్దులే..

"వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన జలయజ్ఞం పథకాన్ని మొదట్లో రద్దు చేయాలనుకున్నా. అయితే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ పథకం కొనసాగించి, పలు ప్రాజెక్టులను పూర్తి చేశాను. ఆ రోజు తీసుకున్న నిర్ణయంతోనే ఇప్పుడు కరువు ప్రాంతాల్లోనూ నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా ఎన్టీఆర్ ఆరోగ్యసేవగా పేరుమార్చి మరింత మెరుగ్గా కొనసాగించాం. జగన్ మాత్రం ఉద్దేశపూర్వకంగా అన్నీ రద్దు చేసుకుంటూపోతున్నారు. ముఖ్యమంత్రి అజ్ఞానంతో పోలవరానికి ఇబ్బంది కలుగుతోంది. అమరావతి కోట్ల ప్రజల ఆస్తి. దాన్ని కూడా నాశనం చేస్తున్నారు. మా మీద కక్షతో రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. అనేక తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టం కలుగుతోంది. ఇప్పటికే రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయి. టీడీపీ పాలనలో రాష్ట్రానికి రూ. 16 లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తగా..నేడు పెట్టుబడిదారులు మన వైపు తొంగి చూసేందుకే సాహించలేకపోతున్నారు. చివరకు ఉత్పత్తికి సిద్ధమైన ప్రసిద్ధ కియా మోటార్స్ కూడా వీళ్ల పెట్టే బాధలకు తట్టుకోలేక వెనుతిరిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది"

## జీతాల కోసం వలంటీర్ల ధర్నా


ధర్నా చేస్తున్న వలంటీర్లు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 25: 'మూడు నెలలుగా జీతాలు లేవు. ఇంటి నుంచి తెచ్చి ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తోంది. అధికారులను అడిగితే దుర్భాషలాడుతున్నారు. మా సమస్యలు పరిష్కరించండి' అంటూ.. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో వలంటీర్లు ధర్నా చేశారు. సుమారు 20 మంది వలంటీర్లు జంగారెడ్డిగూడెం పాత మునిసిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నాలో పాల్గొన్నారు. మునిసిపాలిటీలో 209 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 48 మంది కొత్తగా చేరిన వారే. వీరికి మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. నెలకు ఇచ్చే రూ.8 వేలు సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. విధి నిర్వహణలోనూ కమిషనర్, అధికారులు తమకు సహకరించడం లేదని వాపోయారు.

## మల్లన్న ఆదాయం రూ.3.97 కోట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 25: ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను దేవస్థాన కల్యాణ మండపంలో మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.3,97,80,828 ఆదాయం వచ్చిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కేఎస్ రామరావు తెలిపారు.

## 'ఆదిత్య'కు ఉత్కృష్ట విశ్వకర్మ అవార్డు


అవార్డు అందుకుంటున్న సతీష్‌రెడ్డి

గండేపల్లి, ఫిబ్రవరి 25: తూర్పుగోదావరి జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల 2019కి గాను జాతీయ స్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచి ఉత్కృష్ట విశ్వకర్మ అవార్డును కైవశం చేసుకుంది. అమలాపురం, కడియపు లంకలలో కాయర్ క్లస్టర్లు అమలు చేసి కొబ్బరి రైతులకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. భవిష్యత్తులో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి గ్రామాల రైతుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు. అవార్డు అందుకున్న వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డిని ఆదిత్య సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.కృష్ణ, దీపక్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ టీకే రామకృష్ణారావు, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తదితరులు అభినందించారు.

## ఫేస్‌బుక్ పరిచయం.. ఆపై మోసం

- కమీషన్ల ఆశ చూపి నగదు దోపిడీ.. నైజీరియన్ సహా ముగ్గురి అరెస్టు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 25: ఫేస్‌బుక్‌లో పరిచయమై అమాయకులకు కమీషన్ల ఆశ చూపి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న నైజీరియన్‌తో పాటు, ఇద్దరు సభ్యుల ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టుచేశారు. ప్రకాశం ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మంగళవారం తెలిపిన వివరాలు.. నైజీరియాకి చెందిన ఒయాంకో హైజనస్, యూపీలోని బరేలీకి చెందిన షాహిద్ ఖాన్, మహ్మద్ యాకోబ్‌లు ముఠాగా ఏర్పడ్డారు. 'టీబీ జాషువా మినిస్ట్రీస్' పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను ప్రారంభించి.. అమాయకులను ముగ్గులోకి లాగుతూ.. రూ.లక్షలు కాజేస్తున్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా పొదిలిలోని బాప్టిస్టు కాలనీకి చెందిన వేల్పుల అచ్చయ్యకు హైజనస్ ఫేస్‌బుక్‌లో పరిచమయ్యాడు. తాము భారతదేశంలో చర్చిలు, ఆసుపత్రులు నిర్మించేందుకు 2.4 మిలియన్ డాలర్లు తీసుకొని వస్తున్నామని అచ్చయ్యను నమ్మించాడు. ఆ నిర్మాణాలకు సహకరిస్తే 20% కమీషన్ ఇస్తామని ఆశ చూపాడు. అనంతరం, తాము ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డామని, కొంత డబ్బు అవసరమని తెలిపి, గత ఏడాది డిసెంబరు 9న ఖాతాలో నగదు వేయించుకున్నాడు. తర్వాత కూడా అచ్చయ్య నుంచి పలు దఫాలుగా రూ.14.67 లక్షలు బ్యాంకు ఖాతాల్లో వేయించుకున్నాడు. అచ్చయ్య కూడా కమీషన్‌పై ఆశతో అప్పు తెచ్చి మరీ ఇచ్చాడు. అయితే, హైజనస్ చెప్పినట్లు నగదు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి గత నెల 6న పొదిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ వి.శ్రీరాం నేతృత్వంలో ప్రత్యేక బృందం ఢిల్లీ సైబర్ క్రైం పోలీసుల సాయంతో హైజనస్‌తోపాటు, షాహిద్‌ఖాన్, మహ్మద్ యాకోబ్‌లను ఈ నెల 22న అరెస్టు చేశారు. అనంతరం అక్కడి పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు నిందితులకు ట్రాన్సిట్ రిమాండ్ విధించి పోలీసులకు అప్పగించారు.

## విద్యార్థులను దగా చేసిన జగన్

- అడ్డగోలు నిబంధనలతో అర్హులకు అన్యాయం
- జగన్ 'సిట్'ను సోదరే నమ్మడం లేదు
- మహిళలను దూషించిన ఎంపీ సురేశ్‌కు సిగ్గులేదు
- టీడీపీ నేతలు కొమ్మారెడ్డి, అనిత విమర్శ

**20 వేల కోట్లు ఎక్కడ పెట్టారో!**

మంగళగిరి, ఫిబ్రవరి 25: "సీఎం జగన్మోహన్‌రెడ్డి బాధితుల జాబితాలో తాజాగా విద్యార్థులు కూడా చేరారు. రుణమాఫీ పేరుతో రైతులను, అమ్మ ఒడి పేరుతో తల్లులను, వాహన మిత్ర పేరుతో డ్రైవర్లను మోసగించిన జగన్, తాజాగా తన మోసపు వలను విద్యార్థులపైకి విసిరాడు" అని టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేనిఫెస్టో తనకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని చెప్పుకునే సీఎం అందులో చెప్పిన హామీనే గాలికొదిలేశాడన్నారు. రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంటు బకాయిలను చెల్లించకపోవడంతో ఇప్పటికే 30 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయని తెలిపారు. 12 రకాల స్కాలర్‌షిప్‌లను జగన్ సర్కారు నిలిపివేసిందని తెలిపారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్న జగన్ సర్కారు అవి ఎప్పుడు వచ్చాయో? ఎక్కడ పెట్టుబడులు పెట్టారో చెబితే ప్రజలంతా సంతోషిస్తారని పట్టాభి ఎద్దేవా చేశారు. అడ్డమైన నిబంధనల పేరుతో అర్హులైన విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. మహిళలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించడమే కాకుండా, ఇష్టమొచ్చినట్లుగా వారిని దూషించిన ఎంపీ సురేశ్‌కు సిగ్గులేదన్నారు. జేఏసీ మహిళలకు జరిగిన దారుణంపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధమయ్యామని తెలిపారు. సొంత బాబాయి హత్యకేసు విచారణపై జగన్ వేసిన సిట్‌ను ఆయన సోదరే నమ్మలేదన్నారు. ఇక జగన్‌పై ప్రజలకెలా నమ్మకం వస్తుందని అనిత ఎద్దేవా చేశారు.

### 107 జీవోని వెనక్కి తీసుకోవాలి: అనగాని

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): "రాజధాని భూములను ఇళ్ల పట్టాలకు ఇవ్వడం దుర్మార్గం. రాజధాని 29 గ్రామాల పేదలకు టీడీపీ హయాంలో చేపట్టిన 5 వేల ఇళ్లని ఇంత వరకు లబ్ధిదారులకు అందించకుండా కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏముంది?" అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన చేశారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించి, ఆ భూముల్ని వైసీపీ కార్యకర్తలకు ఇచ్చేందుకే జీవో 107 జారీ చేశారని ఆరోపించారు. తక్షణం 107 జీవోని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ నిబంధనలకు విరుద్ధంగా రాజధాని భూమిని వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని అనగాని మండిపడ్డారు.

### దళితుల సాగు భూములపై సర్కార్ కన్ను

- 58 ఎకరాల్లో అధికారుల సర్వే.. 200 మంది దళిత రైతుల ఆందోళన

కొండపల్లి, ఫిబ్రవరి 25: పేదలకు ఇళ్ల స్థలాలివ్వడానికి ప్రభుత్వం దృష్టి.. రైతులు సాగు చేసుకుంటున్న లంకభూములపై పడటంతో కొండపల్లి పరిధిలోని కొటికలపూడి గ్రామానికి చెందిన దళిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 200 మంది దళిత రైతులు 70 ఏళ్ల నుంచి అసైన్డ్‌భూముల్లో సాగు చేసుకుంటున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ వీరికి ఇబ్బందికరంగా మారింది. ఇళ్ల స్థలాల కోసం అధికారులు ఇటీవల కొటికలపూడి గ్రామంలో అధికారులు పర్యటించారు. ఇక్కడ దళిత రైతులు సాగు చేసే 58 ఎకరాల మేర సర్వే చేయించారు. ఈ స్థలం చుట్టూ జెండాలు పాతించిన రెవెన్యూ అధికారులు స్థలం స్వాధీనం చేసుకుంటున్నట్టు రైతులకు సమాచారమిచ్చారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ జీవనాధారమైన భూములు లాక్కోవడం సరికాదంటూ వాపోతున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు.

### 1న హలో మాల.. చలో కాకినాడ

పంజాగుట్ట/హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి ధైర్యముంటే కులాలను రద్దు చేసి, రిజర్వేషన్లను తొలగించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో మార్చి 1న కాకినాడలో "హలో మాల ..చలో కాకినాడ" పేరుతో నిర్వహిస్తున్న మాలల మహా యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## ట్విటర్‌లో టీడీపీ


స్నేహితుడు పీఎస్ మునిరత్నం(ఫొటో పట్టుకున్న వ్యక్తి) తండ్రితో జ్ఞాపకాలు పంచుకుంటున్న చంద్రబాబు

### నాటి స్నేహ జ్ఞాపకాలతో ఉత్సాహం: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): "ప్రజా చైతన్యయాత్రలో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని కంగుంది గ్రామానికి వెళ్లి ఎస్వీ యూనివర్శిటీలో నా సహాధ్యాయి రత్నం కుటుంబాన్ని కలిశాను. నా స్నేహితుడి తండ్రి 98 ఏళ్ల పీఆర్ శ్యామ్‌గారిని కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నాను. రత్నం తన దగ్గర ఉన్న యూనివర్శిటీలో మా బ్యాచ్ ఫోటోలను చూపించారు. ఒక్కసారిగా నా కాలేజీ రోజులు, ఆనాటి స్నేహాలు గుర్తొచ్చాయి. తెలియని ఉత్సాహం వచ్చింది" అని మాజీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ట్వీట్‌కు నాటి ఫొటోలను ఆయన జత చేశారు.

- ఇళ్ల స్థలాలకు మీ ఎస్టేట్‌లు ఇవ్వండి: లోకేశ్

"పేదవాళ్లకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములు లాక్కొని తిరిగి పేదలకు పంచుతా అనడం జగన్ రివర్స్ టెండరింగ్‌కు పరాకాష్ఠ. పథకాల పేరు మార్పు కోసం పేదలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు ఎందుకు లాక్కుంటున్నారు? వేల ఎకరాలతో అక్రమంగా సంపాదించిన మీ ఎస్టేట్‌లు, ప్యాలెస్‌లు ఇవ్వండి. లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు వస్తాయి" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్వీట్ చేశారు.

- చెత్త పనులన్నీ చేసి చించుకోవడం దేనికి?: బుద్దా

"అప్పటి బొక్కలు బయటపడకుండా బ్లాక్ పేపర్‌తో మహామేత అని ఎంత డప్పు కొట్టించినా సీబీఐ, ఈడీ ద్వారా బయటపడ్డాయి. ప్రపంచంలో ఉన్న చెత్త పనులు అన్నీ చేసి ఇప్పుడు కులం, మీడియా అంటూ తుగ్లక్ ప్యాంటు చించుకోవడం ఎందుకు? మూడు రాజధానులు అంటూ విశాఖలో ల్యాండ్ మాఫియాని ల్యాండ్ చేశారు. మూడు ముక్కల రాజధానిని ప్రజలు ఛీ కొట్టడంతో తుగ్లక్ ఉగ్రరూపం దాల్చారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా మ్యాటర్ వీక్ అయింది. ఏం చేయాలో అర్థం కాక వైసీపీ పెయిడ్ బ్యాచ్‌ని రంగంలోకి దింపారు. రాళ్లు వేసే 'బఫూన్ గ్యాంగ్'తో టీడీపీ నేతలను అడ్డుకోమని పంపే దుస్థితికి చేరిపోయాడు తుగ్లక్. పదవిలో ఉన్నప్పుడు జగన్ వెనుక ఉండి మీరు రాసిన దొంగ లెక్కలు, వాటాల చిట్టా, జీవోల వెనకున్న క్విడ్ ప్రో కో అందరూ చేస్తారు అనుకుంటే ఎలా విజయసాయి రెడ్డి"అని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు.

- ఇసుకకూ, వైసీపీకి అక్రమ సంబంధం: కూన

"మీరన్నట్లే వైసీపీకి వరుణ దేవుడికి సంబంధం ఉంది. వానతో పాటు వచ్చిన ఇసుకకూ, మీకూ అక్రమ సంబంధం ఉంది. బీఏలో హెచ్ఈసీ తెలివితేటలు ఇసుక మాఫియాలోనూ వాడి జగన్ వేసిన నిఘాకి చిక్కావు. అది కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబుపైనా, టీడీపీపైనా బుసలు కొడుతున్నారు" అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ట్వీట్ చేశారు.

150 YEARS OF CELEBRATING THE MAHATMA
ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ మౌలికసదుపాయాల అభివృద్ధి

నరేంద్ర మోదీ
ప్రధానమంత్రి
కాకినాడలో 100 పడకల ESI హాస్పిటల్‌కు శంకుస్థాపన
ముఖ్యాంశాలు
● OPD ● వార్డులు ● ల్యాబులు ● అత్యవసర సౌకర్యాలు
● ప్రాజెక్ట్ అంచనావ్యయం రూ.101.54 కోట్లు ● 7.26 ఎకరాల విస్తీర్ణంలో విస్తరణ ● 65 వేల మంది బీమా గల వ్యక్తులకు మరియు వారి కుటుంబాలకు ప్రయోజనం కల్పించుట
సంతోష్ కుమార్ గంగ్వార్
కార్మిక మరియు ఉపాధి శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి
భారత ప్రభుత్వం గారిచే
బుధవారం, ఫిబ్రవరి 26, 2020 న ఉ.11.00 గం.కు
ప్రదేశం: సాంబమూర్తి నగర్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్
ఆంధ్రప్రదేశ్‌లో ESI పథకం
● మొత్తం 13 జిల్లాలలో అమలుపరచబడినది
● 42,880 సంస్థలను కవర్ చేస్తూ 13 లక్షల బీమా గల వ్యక్తులు ● 45 లక్షల మంది లబ్దిదారులు
श्रम एवं रोजगार मंत्रालय Ministry of Labour & Employment भारत सरकार (Government of India) Website: www.labour.gov.in
कर्मचारी राज्य बीमा निगम Employees' State Insurance Corporation www.esic.nic.in, www.esic.in
DAVP23111/13/0017/1920
కాల్ చేయగలరు టోల్ ఫ్రీ నంబర్ 1800 11 2526 మెడికల్ హెల్ప్ లైన్ నం.1800 11 3839

## పర్యటన ఘనం!

అమెరికా అధ్యక్షుడి పర్యటన విజయవంతమైనట్టే. భారత్, అమెరికాల మాట అటుంచితే, అటు డొనాల్డ్ ట్రంప్‌కూ, ఇటు నరేంద్ర మోదీకీ ఇది బాగా ఉపకరించినట్టే. రెండు దేశాలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న వాణిజ్యం ఒప్పందం మీద ఆది నుంచీ ఉన్న అనుమానాలే చివరకు నిజమైనాయి. ట్రంప్‌కు మాత్రం ఆయన విపరీతంగా కలవరించిన ఘనస్వాగతం దక్కింది. డెబ్బయ్‌లక్షల లెక్క కాసింత తగ్గిందేమో కానీ, మొతేరా స్టేడియం వరకూ రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరారు. అమెరికా ఆశ్చర్యపోయే స్థాయిలో క్రిక్కిరిసిన స్టేడియంలో లక్ష మంది జనం ట్రంప్ ప్రతీ మాటకూ జేజేలు కొట్టారు. వాక్యానికీ వాక్యానికీ మధ్య ట్రంప్ తన ఆప్తమిత్రుడిని తలుచుకుంటూ, పొగడ్తలతో ముంచెత్తారు. సందర్శనలు, విందులు, ఫోటోలు తప్ప ఇరుదేశాలకూ ఈ పర్యటన చేకూర్చిన లబ్ధి ఏముందని పెదవి విరిచినవారు ఇది భావసారూప్యతలున్న ఇద్దరు వ్యక్తుల వ్యవహారమని మరిచిపోయినట్టుంది.

అమెరికాలో 'హౌడీ మోడీ', ఇప్పుడు భారత్‌లో 'నమస్తే ట్రంప్' రాజకీయ లక్ష్యాలను అటుంచితే, అద్భుతమైన ఆతిథ్యంతో అమెరికా అధ్యక్షుడిని భారత్ బాగా ప్రభావితం చేసింది. స్వాగతానికి ఆయన ఎంత మురిసిపోయారో ఆయన ప్రశంసలే చెబుతున్నాయి. అమెరికా–భారత్ మైత్రి ప్రభుత్వాలకు అతీతమైనదనీ, ఇది ప్రజల పవిత్ర బంధమని ట్రంప్ అన్నారు. అమెరికా భారత్‌ను అభిమానిస్తుందనీ, గౌరవిస్తుందనీ, ఇండియన్లకు అమెరిన్లు నికార్సయిన స్నేహితులని ట్రంప్ నొక్కివక్కాణించారు. ఇక, తన ముప్పైఆరుగంటల పర్యటనలో మోదీనీ, ఆయన నాయకత్వ పటిమనూ అద్భుతం, అమోఘం అంటూ ట్రంప్ ఎన్నిమార్లు కీర్తించారో లెక్కే లేదు. ఇరుదేశాల మధ్యా గతంలో ఎన్నడూ లేనంత ఘనమైన అనుబంధం ఇప్పుడు నెలకొన్నట్టుగా ట్రంప్ తన పర్యటన యావత్తూ ఒక ఉద్వేగపూరితమైన వాతావరణాన్ని సృష్టించినమాట నిజం. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ భారతదేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. ఇప్పటివరకూ భారత్‌లో పర్యటించిన అమెరికా అధ్యక్షులు ఎనిమిదిమంది మాత్రమే. కానీ, ఆర్థికంగా ఎదిగి, విస్తృతమైన మార్కెట్‌గా మారిన తరువాత భారత్‌కు వరుసకడుతున్నవారిలో ఈయన నాలుగోవాడు. కానీ, ఈ పర్యటన గత అధ్యక్షుల పర్యటనలతో పోల్చితే పూర్తి భిన్నంగా, మరింత వ్యక్తిగతంగా కనిపించడానికి అక్కడా ఇక్కడా సైద్ధాంతిక సారూప్యతలున్న వారు అధికారంలో ఉండటమే కారణం.

ఉద్వేగాలను అటుంచితే, ఈ స్నేహబంధం వల్ల ఒనగూరిన ఆర్థిక లబ్ధి ప్రస్తుతానికి లెక్కకు అందడం లేదు. ట్రంప్‌నోట ప్రతీ మాటలోనూ, వాక్యంలోనూ వినిపించే అద్భుతాలేమీ జరగలేదు. ఆలింగనాల్లో అగుపించిన మైత్రి ఆర్థికలావాదేవీల్లో ప్రతిఫలించలేదు. కుదిరిన ఒప్పందాల్లో భారత్ ఎగిరిగంతేయగలిగేవేమీ లేవు. మూడువందల కోట్ల డాలర్లతో హెలికాప్టర్ల కొనుగోలు మనకు రక్షణ బలాన్నిస్తాయి కానీ, అంతకుమించి విక్రేతకు ఆర్థికలాభాన్ని చేకూరుస్తాయి. బోయింగ్, లాక్‌హీడ్ ఇత్యాది దిగ్గజకం పెనీలకు ట్రంప్ ఈ దెబ్బతో లాభాల పంట పండించారని డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి బెన్నీ శాండర్స్ విమర్శిస్తున్నారు. సహజవాయువు, ఇంధన రంగాల్లో ఒప్పందాలు కూడా అంతే. మాటల్లో ఆత్మీయతను కనబరిచే ట్రంప్ వాణిజ్యంలో మనకు అనాదిగా ఉన్న ప్రాధాన్యతను తొలగించి, రాయితీలన్నీ ఎగరగొట్టేశారు. మన ఎగుమతులను దెబ్బకొట్టిన ఈ నిర్ణయాన్ని పునఃస్సమీక్షించకుండా, మనదేశం అధికసుంకాలు వసూలు చేస్తున్నదంటూ వాపోతున్నారు. గుడ్‌బై చెప్పేముందు కూడా హార్లీడేవిడ్సన్‌ను కలవరించారు. పాకిస్థాన్ పైనా, ఉగ్రవాదంమీదా ఆయన చెప్పిన మాటల నుంచి విశేషంగా తవ్వితీయాల్సిందేమీ లేదు. ఉగ్రవాదంపై సమిష్టి పోరు అని భీకరంగా గర్జించినా, అఫ్ఘాన్ నిష్క్రమణ లక్ష్యం ముందున్నది కనుక పాకిస్థాన్‌తో ఆయన నెయ్యం కొనసాగవలసిందే. పౌరసత్వ అంశం భారత్ వ్యక్తిగతమని అన్నందుకు మన పాలకుల మనసులు ఊరటపడివుండవచ్చును కానీ, మత స్వేచ్ఛ విషయంలో మోదీ తనకు ఎన్నో హామీలు ఇచ్చారనడం ద్వారా తాను ఈ అంశాన్ని ప్రస్తావించినట్టు ట్రంప్ రుజువుచేసుకున్నారు. అమెరికాలో మోదీ విధానాలపై వ్యతిరేకత రేగిన నేపథ్యంలో ట్రంప్‌కు ఇది మరీ అవసరం. మర్యాదలు, ఆలింగనాలు మినహా అమెరికా అధ్యక్షుడి పర్యటనవల్ల మనకు ఒనగూరిన లాభనష్టాలు లెక్కగట్టుకోవడం అనవసరం. ప్రస్తుతం మాటల్లో కనిపించిన ఈ ప్రేమ సమీపభవిష్యత్తులో చేతల్లో ఏమాత్రం ప్రతిఫలించినా సంతోషించాల్సిందే.

# 'పౌర' హింసాగ్నిని రగిలించిందెవరు?

**ఇండియాగేట్**



■ ఎ. కృష్ణారావు

భారతదేశంలో ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, అవలంబిస్తున్న విధానాల పట్ల విమర్శలు, వ్యాఖ్యానాలు చేయడం, రోజుల తరబడి నిరసన ప్రదర్శనలు నిర్వహించడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రాంతానికి వెళితే ఏవో సమస్యలపై ప్రదర్శనలు చేసే వారు కనపడుతూనే ఉంటారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలు వచ్చిన తర్వాత ఇంట్లో కూర్చుని ప్రతి నిమిషానికీ ఒక వ్యాఖ్యానం చేసి మళ్లీ తమలో తాము పంచుకునే ఉద్యమ స్ఫూర్తి కూడా చాలా మందిలో పెరిగిపోతోంది. ఇవి కాక నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు, సభలు జరిపేవారు, పత్రికల్లో వ్యాసాలు రాసే వారు కూడా ఉంటారు. కాని వీటన్నిటి ప్రభావం తిరిగి ప్రభుత్వంపై ఎంత వడుతుందో చెప్పడం కష్టం. మణిపూర్‌లో పోలీసులకు ప్రత్యేకాధికారాలు కల్పించే చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఎ) ఎత్తి వేయాలని అక్కడి మహిళలు రోజుల తరబడి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇరోమ్ షర్మిల దాదాపు ఏడేళ్ల పాటు నిరాహార దీక్ష చేశారు. మనోరమ అనే యువతిని పోలీసులు ఇంటరాగేషన్ పేరుతో తీసుకువెళ్లి అత్యాచారం జరిపి హత్యచేసినప్పుడు అక్కడి మహిళలు నగ్నంగా కూడా ప్రదర్శన జరిపారు. ఆ తర్వాత కొన్ని ప్రాంతాల్లో ఈ చట్టాన్ని ఎత్తివేసినప్పటికీ మణిపూర్‌తో పాటు కొన్ని ఈశాన్య రాష్ట్రాల్లోనూ, కశ్మీర్‌లోనూ కొనసాగిస్తూనే ఉన్నారు.

డిసెంబర్ 15 నుంచీ ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో మహిళలు, పిల్లలు జరుపుతున్న ప్రదర్శన కూడా భారత దేశంలో ఒక రకంగా ప్రజాస్వామ్య హక్కుల్లో ఒకటైన భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకేతంగా నిలిచింది. సాధారణంగా ఇలాంటి ప్రదర్శనలను అనుమతి లేకుండా నిర్వహిస్తే వారిని బలవంతంగా తొలగించేందుకు పోలీసులకు అధికారం ఉన్నది. ఐతే స్థల, కాల, రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీసులు మిన్నకుండిపోయారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ప్రచారం షాహీన్ బాగ్ చుట్టూ తిరిగినా, కొందరు నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా సామాజిక వాతావరణం అంతగా దెబ్బతినలేదు.

నిజానికి పౌరసత్వ చట్టం పట్ల దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ మోదీ ప్రభుత్వం కఠినమైన వైఖరినే ప్రదర్శించింది. ఈ చట్టాన్ని వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదని చెప్పింది. పౌరసత్వ పట్టికను అమలు చేసే ఉద్దేశం లేదని ప్రకటించినప్పటికీ పౌరసత్వ సవరణ చట్టాన్ని మాత్రం అమలు చేసి తీరతామని ప్రకటించింది. ఈ రీత్యా దేశంలో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారి స్వరాలు బలహీనపడతాయని, నిరసన ప్రదర్శనలు సద్దుమణుగుతాయన్న అభిప్రాయం క్రమంగా ఏర్పడసాగింది. నిజానికి మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మతపరమైన అసహనానికి సంబంధించి కొన్ని ఘటనలు జరగడం, కొందరు రచయితలు తమ అవార్డులను తిరిగి ఇవ్వడం వంటివి జరిగాయి. కాని అవేవీ తర్వాతి కాలంలో మోదీ ప్రభుత్వాన్ని రాజకీయంగా పెద్దగా బలహీనపరచలేకపోయాయి. ఇప్పుడు కూడా దేశంలో పరిస్థితి మారిపోతుందని, ప్రభుత్వాధినేతలు, అధికారులు పాలనపై దృష్టి కేంద్రీకరిస్తారని షాహీన్ బాగ్ ప్రదర్శనకారులు తమ నిరసనను ఏదో రోజు ఉపసంహరించుకోక తప్పదని చాలా మంది భావించారు. రోడ్డుకు అడ్డంగా నిరసన ప్రదర్శన చేయకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు షాహీన్‌బాగ్ ప్రదర్శనకారులతో చర్చలు కూడా ప్రారంభించింది. సుప్రీంకోర్టు తరపున సీనియర్ న్యాయవాదులు సాధనా రామచంద్రన్, సంజయ్ హెగ్డే చర్చలు కూడా జరిపి తమ అభిప్రాయాలను సీల్డ్ కవర్‌లో న్యాయమూర్తులకు సమర్పించారు. పరిస్థితి యధాతథంగా మారుతుందని అనుకుంటున్న సమయంలో ఉన్నట్లుండి ఢిల్లీలో ముస్లింలు ఎక్కువగా ఉన్న ఈశాన్య ప్రాంతాల్లో ఘర్షణలు మొదలయి హింసాకాండ ప్రజ్వరిల్లింది.

పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను తన చేతుల్లోకి సుప్రీంకోర్టు తీసుకుంటున్న సమయంలో ఉన్నట్లుండి ఈ అల్లర్లు ఎందుకు ప్రారంభమయ్యాయి? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంలో పర్యటించిన సమయంలోనే అల్లర్లు జరగడం వెనుక ఏదైనా కుట్ర ఉన్నదా? శనివారంనాడు జఫ్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో సిఏఏకు వ్యతిరేకంగా కొందరు నిరసన ప్రదర్శనలు ప్రారంభిస్తూ రోడ్డుకు అడ్డంగా కూర్చోవడమే ఈ పరిణామాలకు దారితీసిందని చెబుతున్నారు. బహుశా ట్రంప్ దృష్టిని ఆకర్షించేందుకు ఢిల్లీలో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల తీవ్రత పెంచాలని, తమ ఆందోళన ప్రపంచం దృష్టిని ఆకర్షించాలని వారు భావించి ఉంటారు. ఆ తర్వాత కొన్ని రాళ్లు రువ్వుడు ఘటనలు జరగడం, ఆదివారం బిజెపి నేత కపిల్ మిశ్రా రంగ ప్రవేశం చేయడం జరిగాయి. ఈ శిబిరాన్ని మూడు రోజుల్లో ఎత్తి వేయకపోతే పోలీసుల మాట కూడా విననని ఆయన హెచ్చరించేందుకు ఎవరు ప్రోద్బలం కలిగించారు? ఢిల్లీ ఎన్నికల ప్రచార సమయంలో కపిల్ మిశ్రా చేసిన 'గోలీ మారో' వంటి వ్యాఖ్యలను తాను ఆమోదించబోనని హోంమంత్రి అమిత్ షా 'టైమ్స్ నౌ' సదస్సులో ప్రకటించిన తర్వాత కూడా కపిల్ శర్మ యధావిధిగా ఎందుకు వ్యవహరించారు? ట్రంప్ భారత్ నుంచి వెళ్లిపోగానే ప్రదర్శనా శిబిరాలను ఎత్తివేస్తామని ఆయన ఎందుకు ప్రకటించారు? ఘర్షణల్లో ఒక కానిస్టేబుల్‌తో పాటు అనేకమంది మరణించడానికి ఎవరు కారణం? కేవలం స్థానికుల మధ్య ఘర్షణ జరిగిందా? లేక బయటనుంచి వ్యక్తులు ప్రవేశించారా?



**షాహీన్‌బాగ్‌లో పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను తన చేతుల్లోకి సుప్రీంకోర్టు తీసుకుంటున్న సమయంలో ఉన్నట్లుండి ఈ అల్లర్లు ఎందుకు ప్రారంభమయ్యాయి? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంలో పర్యటించిన సమయంలోనే అల్లర్లు జరగడం వెనుక ఏదైనా కుట్ర ఉన్నదా? అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్యానికి ఆరాటపడటం కాదు అక్కడి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతులను నేర్చుకోవడం ఎంతైనా అవసరం.**

ఈ మొత్తం ఘర్షణల్లో పోలీసుల అసమర్థత స్పష్టంగా కనిపిస్తోంది. జఫ్రాబాద్, మౌజ్ పూర్ ప్రాంతాల్లో పోలీసులు నిశ్చేష్టగా నిలుచుండగా జనం రాళ్లు విసురుకోవడం, తుపాకుల వంటి మారణాయుధాలను కూడా చేతబూనడం, వాహనాలు, టైర్ల ఫ్యాక్టరీలు దగ్ధం చేయడం, పెట్రోల్ బాంబులతో ఇళ్లపై దాడులు చేయడంవంటి ఘటనలు జరిగాయి. ఆఖరుకు దృశ్యాలు రికార్డు చేస్తున్న జర్నలిస్టుల ఫోన్లు, కెమెరాలు లాక్కోవడం, వారిపై భౌతికంగా కూడా దాడులు చేయడం జరిగింది.

ఒక అగ్రదేశాధినేత మన దేశంలో పర్యటిస్తున్న సమయంలో భద్రతను కట్టుదిట్టం చేయాల్సిన పోలీసులు ఎందుకు అలసత్వం ప్రదర్శించారు? ఇంటెలిజెన్స్ సంస్థలు ఈ ఘటనల గురించి సమాచారం ఇచ్చినప్పటికీ వారెందుకు చర్యలు తీసుకోలేదు? కొత్తగా నిరసన ప్రదర్శనలను ఎందుకు అనుమతించారు? అనుమానిత వ్యక్తుల్ని ఎందుకు అరెస్టు చేయలేదు? నిషేధాజ్ఞలు విధించడం, డ్రోన్‌లను ఉపయోగించడం వంటి చర్యలు ఎందుకు తీసుకోలేదు? జామియా, జెఎన్‌యు వంటి ఘటనలు జరిగిన తర్వాత కూడా ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్ పదవీకాలం గత జనవరిలో పూర్తయినప్పటికీ మరో నెల పాటు ఎందుకు పొడిగించారు? 1984లో సిక్కులకు వ్యతిరేకంగా అల్లర్లు జరిగిన తర్వాత ఢిల్లీలో ఇంతటి తీవ్రమైన ఘటనలు జరగడం ఇదే మొదటి సారి అని ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ విక్రమ్ సింగ్ వ్యాఖ్యానించడం గమనార్హం. 'ఘర్షణలకు పాల్పడేవారంతా ఒకే చోట చేరి తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తించేందుకు పోలీసులు వీలు కల్పించారు' అని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఢిల్లీ పోలీసులు ఒక వైపు సంయమనం పాటిస్తూనే మరో వైపు కఠినంగా వ్యవహరిస్తారు. ఎప్పుడు బారికేడ్లు నిర్మించాలి, ఎక్కడి వరకు ప్రదర్శనకారులను అనుమతించాలి, బాష్పవాయువు, లాఠీ ఛార్జి వంటివి ఎప్పుడు ప్రయోగించాలి అన్న విషయంలో వారు శాస్త్రీయమైన పద్ధతులను అవలంబిస్తారు. అందుకే పార్లమెంట్‌కు అతిసమీపంలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది ధర్నా జరిపేందుకు సిద్ధ పడినా వారు అనుమతిస్తూనే అప్రమత్తంగా ఉండడం కనిపిస్తుంది. కాని ట్రంప్, మోదీ వివిధ ఒప్పందాలపై సంతకాలు చేస్తున్న హైదరాబాద్ హౌజ్‌కు సమీపంలోనే ఘర్షణలు జరగడం, వాటికి సంబంధించిన వీడియోలు క్షణాల్లోనే సోషల్ మీడియాలో వ్యాప్తి కావడం వారి సమర్థతను శంకించేలా చేస్తుంది. ఇది కేవలం పోలీసుల సమర్థతకు సంబంధించిన విషయం కాదు. దేశ రాజధానిలోనే ఇలాంటి ఘర్షణలు జరిగితే న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, గార్డియన్, సిఎన్ఎన్ లాంటి అంతర్జాతీయ మీడియాకు కూడా చేరుతుంది. ఢిల్లీలో చాలా మంది మీడియా ప్రతినిధులు ఘర్షణల గురించి రాయాలా, లేక ట్రంప్ పర్యటన గురించి రాయాలా తేల్చుకోలేకపోయారు. ఈ రెండింటికీ అత్యంత ప్రాధాన్యత ఉన్నదన్న విషయం వారికి తెలుసు. అందువల్ల ఇది దేశంలో ఉన్న పాలనా వ్యవస్థ పనితీరును కూడా ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో పోలీసు యంత్రాంగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లో ఉన్నందువల్ల లేని పోని అనుమానాలు ఆయన మీదకు వెళతాయి. నిజానికి దేశంలో ఒక అగ్రనేత పర్యటిస్తున్నప్పుడు ఇలాంటి ఘర్షణలు జరగాలని ఏ నేత అయినా కోరుకుంటారా? అన్నది సరళమైన ప్రశ్న. పైగా ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు, పౌరసత్వ చట్టం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్న సమయంలో భారత ప్రధానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ఎంతో అవసరం. ఈ మద్దతు అవసరం వల్లే గత ఎనిమిది నెలల్లో ట్రంప్‌ను మోదీ అయిదు సార్లు కలుసుకున్నారు. భారత్ అమెరికాల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న వర్తక వివాదాలు సమసిపోయి ఒకరి మార్కెట్‌కు మరొకరు అందుబాటు పొందేందుకు తీవ్ర యత్నాలు జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన చర్చల్లో ప్రధానంగా 3 బిలియన్ డాలర్ల రక్షణ ఒప్పందం అయితే జరిగింది కాని ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన సమగ్రవాణిజ్య ఒప్పందం ఇంకా ఒక కొలిక్కి వచ్చినట్లు కనపడటం లేదు. ఈ ఒప్పంద వివరాలు బయటపడితే కాని ట్రంప్ పర్యటన వల్ల మనకు వచ్చే ఫలితాలు స్పష్టం కావు. అమెరికా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకే అధ్యక్షుడు ట్రంప్ భారత్ వచ్చారని, మనకు ఒరిగేది ఏమీ లేదని కొందరు నిత్య సంశయవాదులు వ్యాఖ్యానిస్తున్నప్పటికీ వారి సంశయాలు నిజమో కాదో తర్వాతి కాలంలో తెలుస్తుంది.

నిజానికి జరిగింది రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య చర్చలే అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు అత్యంత ప్రజాస్వామికంగా వ్యవహరించారు. భారత దేశంలో గడిపిన సమయం కంటే ఎక్కువ సమయం విమానంలో గడిపి మరీ వచ్చిన ట్రంప్ మన దేశంపై ప్రశంసల వర్షం కురిపించడం సాధారణ విషయం కాదు. తనతో పాటు తన దేశ మీడియాను వెంట తీసుకువచ్చిన ట్రంప్ వ్యాపార ప్రతినిధులతోనూ, మీడియా ప్రతినిధులతోనూ బహిరంగంగా స్పష్టంగా మాట్లాడారు. ఎటువంటి ప్రశ్నలు వేసినా తడుముకోకుండా చెప్పారు. సిఏఏ గురించి మోదీతో మాట్లాడలేదని అంటూనే మతపరమైన స్వేచ్ఛ గురించి లోతుగా చర్చించానని అన్నారు. ఇలాంటి పారదర్శకత, మీడియాతో అరమరికలు లేని ధోరణి మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా అవలంబించి ఉంటే దేశంలో వాతావరణం ఆరోగ్యకరంగా మారే అవకాశాలు ఉండేవి. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడడం కాదు, అక్కడి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతులను కూడా నేర్చుకోవడం కూడా అవసరం.

*(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)*

## చరిత్ర విస్మరిస్తే ఎలా?

వలస పాలన, జాత్యహంకారాన్ని వ్యతిరేకించడం; శాంతి, అలీనత్వాల పట్ల అంకిత భావం స్వతంత్ర భారత దేశ విదేశాంగ విధాన మూల సూత్రాలు. 1870 నాటి నుంచి మన జాతీయోద్యమ నిర్మాతలు శిరసావహించిన ఆదర్శాలు, అనుసరించిన విధానాల నుంచి ఈ విదేశాంగ విధానం రూపుదిద్దుకున్నది. కనుకనే అంతర్జాతీయ సమాజంలో స్వతంత్ర భారతదేశం విశిష్టంగా వెలుగొందింది. దేశ ఆర్థిక పరిస్థితి ఘనంగా ఉండకపోయినా దేశ సమగ్రత, ప్రజల సార్వభౌమాధికారం, జాతి ప్రతిష్ఠల విషయంలో యావత్ప్రపంచానికి, ముఖ్యంగా వలస పాలన నుంచి విముక్తి పొందిన ఆసియా, ఆఫ్రికా దేశాలకు భారత్ ఒక మార్గదర్శకంగా నిలిచింది.

దౌత్యనీతిలో మహోన్నత ఆదర్శాలకు కట్టుబడిన ఘనచరిత్ర భారత్‌కు ఉన్నది. జాతీయోద్యమ వారసులైన మహానాయకులు దేశ పాలకులుగా స్వతంత్ర భారత్‌కు సముపార్జించిన గొప్పదనమది. అటువంటి ఘన గత చరిత్రను విస్మరించి, భారతదేశం ఇప్పుడే ప్రపంచాన్ని ఆకట్టుకోవడం మొదలయిందన్నట్లుగా ప్రచారం జరగడం ఎంత శోచనీయం! ప్రత్యేకించి అమెరికా పర్యటనల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రచార హోరు, ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన సందర్భంగా జరిగిన అర్భాటం ఎంతైనా ఆశ్చర్యం కల్గిస్తున్నాయి. అమెరికా నిస్సందేహంగా ప్రపంచ అగ్రరాజ్యమే. అయినంత మాత్రాన దాన్ని అమితంగా పొగుడుతూ దాసోహమవ్వాలా? ఇది ఒక రకంగా మన దేశ ఘనతను చిన్నబుచ్చడమే కాదా?

1950, 1960 దశకాలలో భారతదేశ పరిస్థితులు ఎలా వుండేవో ఒక సారి గుర్తు చేసుకుందాం. కరువు కాటకాలు కరాళనృత్యం చేసిన రోజులవి. ఆహారోత్పత్తిలో స్వావలంబన లేదు. అమెరికా నుండి దిగుమతి అయ్యే ఆహారధాన్యాల మీద ఆధారపడక తప్పని నిస్సహాయ స్థితి. కశ్మీర్ విషయమై పాకిస్థాన్‌తో ఎడతెగని జగడం. చైనాతో పొలిమేర (యుద్ధంలో) పరాభవం. అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం. అమెరికా విదేశాంగ మంత్రి జాన్ ఫాస్టర్ డలెస్ వర్ధమాన దేశాలను 'హు ఆర్ నాట్ విత్ అజ్, ఆర్ ఎగెనెస్ట్ అజ్' (తెలుగు నుడికారంలో చెప్పాలంటే 'ఈ గట్టున ఉంటావా? ఆ గట్టున వుంటావా? ఆ గట్టున వుంటే మాకు విరోధివే') అని బెదిరించిన కాలమది. అటువంటి విపత్కర పరిస్థితులలో నాటి ప్రధానమంత్రులు జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ అమెరికాతో వ్యవహరించిన తీరు జాతి ఆత్మాభిమానికి ప్రతీక. అమెరికా గోధుమలు లేకుంటే భారత్‌లో పేదవాడి పొయ్యిలో పిల్లి లేవని పరిస్థితి వున్నా వియత్నాంపై అమెరికా సామ్రాజ్యవాద దురహంకార యుద్ధాన్ని విమర్శించిన తెగువ, ఘనత భారత్‌ది.



**ఇప్పుడు భారత్ ఆర్థికంగా ఒక శక్తిమంతమైన దేశం. భారతీయ మార్కెట్ వైపు అమెరికా ఆశగా చూడడం సహజమే. మరి మన దేశం ఆహార ధాన్యాలకు సైతం అమెరికా పై ఆధారపడిన కాలంలో ఆ దేశ పాలకులు, ప్రజలు మన ప్రధాన మంత్రులకు ఇచ్చిన గౌరవాదరాలను మరచిపోతే ఎలా?**

1966లో ప్రధానమంత్రిగా తన ప్రథమ అమెరికా పర్యటనలో ఇందిరా గాంధీ అనేక సంక్లిష్ట సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొన్నారు. కశ్మీర్ వివాదం మొదలైన అంశాలపై భారత వైఖరిని గట్టిగా సమర్థించారు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు లిండన్ బి.జాన్సన్ దౌత్య సంప్రదాయాలకు భిన్నంగా, స్వయంగా వాషింగ్టన్‌లోని భారత రాయబారి నివాసానికి వచ్చి ఇందిరతో సమావేశమయ్యారు. ఇది, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టం. ఆ మరుసటి రోజు శ్వేత సౌధంలో జరిగిన విందు సందర్భంగా ఇందిరా గాంధీతో కలిసి నృత్యం చేయడానికి జాన్సన్ ఉవ్విళ్ళూరారు. అయితే ఆయన అభ్యర్థనను ఇందిర సున్నితంగా తిరస్కరించారు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటం సందర్భంగా పాకిస్థాన్ సేనలకు మద్దతుగా బంగాళా ఖాతంలో తమ సప్తమ నౌకాదళాన్ని మొహరించిన అమెరికా అధ్యక్షుడు నిక్సన్‌ను సైతం ఇందిరా గాంధీ ఏ మాత్రం ఖాతరు చేయలేదు ('అతడు నిక్సనుడు, ఆమె జయేందిర' అని ఇందిర నాయకత్వాన్ని కవిసమ్రాట్ విశ్వనాథ ప్రశంసించారు). అమెరికా పర్యటన సందర్భంగా నిక్సన్‌తో సమావేశం కావడానికి ఇందిర ముప్పావు గంట నిరీక్షించవల్సి వచ్చింది. నిక్సన్, భారత పర్యటనకు వచ్చినప్పుడు ఇందిర అదే తీరులో ఆయనకు మర్యాద చేశారు.

జవహర్ లాల్ నెహ్రూ 1949, 1956, 1961 సంవత్సరాలలో జరిపిన అమెరికా పర్యటన విశేషాలను తెలుసుకుంటే ఆ దేశ ప్రజలు, పాలకులు మన ప్రధానమంత్రిని ఎంతగా గౌరవించేవారో విశదమవుతుంది. సామ్యవాది, అలీనోద్యమానికి ఆద్యుడయిన నెహ్రూ 1956లో అమెరికా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు ఐసెన్ హోవర్‌తో జరిపిన చర్చల ఫలితంగానే ఆ దేశం నుంచి మనకు ఆహార ధాన్యాల సరఫరా ప్రారంభమైంది. 1949లో అధ్యక్షుడు హ్యారీ ఎస్ ట్రూమన్, 1961లో జాన్.ఎఫ్. కెనడీ అంతర్జాతీయ వ్యవహారాలపై నెహ్రూ అభిప్రాయాలకు అమిత ప్రాధాన్యమిచ్చారు. ఆసియాలో గొప్ప ప్రజాస్వామ్య దార్శనికుడుగా నెహ్రూను వారు గౌరవించారు. దేశ ప్రయోజనాల విషయంలో గానీ, అంతర్జాతీయ వ్యవహారాలలో గానీ నాటి మన ప్రధాన మంత్రులు అమెరికా పెత్తందారీ ధోరణులకు భయపడలేదు. విలక్షణ రాజనీతిజ్ఞతతో వ్యవహరించి ప్రపంచ ప్రజల ప్రశంసలు పొందారు. అమెరికా పాలకులు భారత్ ప్రాధాన్యాన్ని విస్మరించలేని పరిస్థితులు కల్పించారు. అదే ఆత్మాభిమానం, పట్టుదలతో ఆహారధాన్యాల ఉత్పత్తిలో సంపూర్ణ స్వావలంబనను సాధించారు. ఈ హరిత విప్లవ విజయంతోనే బంగ్లాదేశ్ యుద్ధం సందర్భంగా తమకు అమెరికా ఆహార సహాయం అవసరం లేదని పార్లమెంటులో ప్రధాని ఇందిర ప్రకటించారు.

సమాచార సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని ఆ కాలంలో దేశాధినేతల విదేశీ పర్యటనల విశేషాలు సామాన్య ప్రజానీకానికి అంతగా తెలిసేవి కావు. సమాచార విప్లవం అద్భుతంగా వర్ధిల్లుతున్న ఈ కాలంలో, అందునా అధునాతన సామాజిక మధ్యమాల వాడకం విరివిగా ఉన్న తరుణమిది. అయితే మోదీ దౌత్య విధానాలే భారత్‌కు మొదటిసారిగా ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సాధిస్తున్నట్లుగా అధికార పక్షం వారు ప్రచారం చేయడం సబబేనా? మీడియా సైతం ఈ ప్రచారంలో భాగస్వామి కావడంతో, నేటి తరం ఇదంతా మోదీ నాయకత్వ మహత్యమని విశ్వసిస్తున్నట్టు కన్పిస్తోంది. చరిత్ర గర్హనీయంగా విస్మరణకు గురవ్వడం దేశానికి శ్రేయస్కరమేనా? ఇప్పుడు భారత్ ఆర్థికంగా ఒక శక్తిమంతమైన దేశం. భారతీయ మార్కెట్ వైపు అమెరికా ఆశగా చూడడం సహజమే. అయితే మన దేశం ఆహార ధాన్యాలకు సైతం అమెరికాపై ఆధారపడిన కాలంలో ఆ దేశ పాలకులు, ప్రజలు మన ప్రధాన మంత్రులకు ఇచ్చిన గౌరవాదరాలను మరచిపోతే ఎలా?

**– మొహమ్మద్ ఇర్ఫాన్**

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

## గోడల్ని కూలగొడుతాం

వాళ్లు
మనుషులకు మనుషులకు మధ్య
ఉన్నోళ్లు లేనోళ్ల పేరున
అడ్డుగోడల్ని కడుతుంటారు

ఇప్పటికీ
కులాలకు కులాలకు నడుమ
మతాలకు మతాలకు భేదంగా
అగ్రవర్ణం ఆధిపత్యం చాటున
పాపపుణ్యాల స్వర్గ నరకాల పేరున
దుర్భేద్య కుడ్యాల్ని నిర్మిస్తుంటారు

ఇంకా నీకు చినిగిన బతుకు మాసికల
దుస్తుల్ని కనిపించకుండా
చీకటి మకిలి జీవితాల్ని అగుపించకుండా
కుదుపుల అలుపు నీకు తెలియకుండా
రోడ్లన్నీ నున్నగా చేసి అడ్డంగా గోడను
లేపుతున్నారు

అతీగతీ లేనివారికి ఉచిత వైపై కల్పించి
అవసరం ఉన్నా లేకున్నా ఇసిరేలను
కొనిపిస్తుంటారు

నువ్వు అపురూప అతిథివి కదా
భూమి మీద ఓడల్ని నడిపే కిలాడివి కదా
నువ్వు ప్రపంచానికి అధిపతివి కదా
మాకు అతిథివి కదా

మాదకద్రవ్య రాత్రుల్ని నిద్ర పుచ్చుతుంటే
మేము ఉత్తేజ ఉదయాల్ని లేపుకు వస్తుంటాం

అంతటా అన్నిటా గొడవల గోడల్ని
లేపుతుంటే
మా అశాంతి మీకు శాంతిభద్రతల సమస్య
అవుతుంది

లేపిన గోడల్ని కూలగొట్టే పనిలో
గడ్డపారను పారను తట్టను
సిద్ధం చేస్తుంటాం

– జూకంటి జగన్నాథం

# రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు న్యాయమేనా?

"ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు కింద రాదు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారాలు కిందికి వస్తుందని" సుప్రీం కోర్టు "ఫుల్ బెంచ్" ఇటీవల తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా బలహీనవర్గాల ప్రజలలో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. స్వాతంత్ర్యం నాటి నుంచి కోర్టులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తునే ఉన్నాయి. ఒకటి రెండు సందర్భాలలో తప్ప వందలాది కేసులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్ల పట్ల న్యాయ వ్యవస్థ వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నాయి. వెంటనే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లులు తెచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రయోజనాలు కాపాడుతుంది.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు కాదనడానికి సుప్రీంకోర్టు ఏ ప్రాతిపదిక మీద తీర్పుచెప్పిందో తలపండిన న్యాయ నిపుణులకు అర్థం కూడా కావడం లేదు. రాజ్యాంగంలోని 15 (4), 16 (4A) ఆర్టికల్ ద్వారా ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెడుతున్నారన్న విషయం తెలియదా! రాజ్యాంగంలోని 14వ ఆర్టికల్స్ నుంచి 30వ ఆర్టికల్ వరకు ప్రాథమిక హక్కుల క్రిందకు వస్తాయి. అలాంటప్పుడు 15(4) 16 (4A) ఆర్టికల్స్ ప్రాథమిక హక్కు క్రిందకు ఎందుకు రావు? పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కల్పించే ప్రతి రాయితీ రాజ్యాంగ బద్ధమే!

ప్రమోషన్లలో రిజర్వేషన్లను వ్యతిరేకించే సందర్భంగా రిజర్వేషన్ వ్యతిరేకుల వాదన విచిత్రంగా ఉంటుంది. నియామకాలలో, విద్యా సంస్థల అడ్మిషన్లలో రిజర్వేషన్లు పెట్టండి! కానీ ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడం అన్యాయమని వ్యతిరేకిస్తారు. పోనీ విద్యాసంస్థల అడ్మిషన్లలో, ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్లు పెడితే అప్పుడు సమర్థిస్తారా! అంటే అక్కడ కూడా వ్యతిరేకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పెట్టడం వలన విద్యా సంస్థల మెరిట్ దెబ్బతింటుందని, ఉద్యోగ నియామకాలలో సమర్థత–ప్రతిభ దెబ్బతింటుందని వాదిస్తారు. ఇంకా ముందుకు వెళ్ళి రిజర్వేషన్ వలన కులతత్వం పెరుగుతుందని సంఘసంస్కర్తలలాగా హితవచనాలు పలుకుతారు. కులాల వారిగా రిజర్వేషన్లు ఇవ్వడం దేశ సమైక్యతకు భంగమని ఎక్కడలేని దేశభక్తి ఒలకబోస్తారు. అలాగే రిజర్వేషన్లను సమర్థిస్తున్నట్లు నటిస్తూ, రిజర్వేషన్లు ఈ కులాలులోని పేద వారికి అందడం లేదని పరోక్షంగా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇలా ఏదో రూపంలో రిజర్వేషన్ల పట్ల వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తున్నారు.




జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో ఉంది. 50% సీలింగ్ రాజ్యాంగంలో లేదు. కాని 50% సీలింగ్ పేరుమీద దశాబ్దాలుగా రిజర్వేషన్ల విధానాన్ని కొనసాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అన్యాయం చేస్తున్నారు. 77వ రాజ్యాంగ సవరణ ద్వారా జనాభా నిష్పత్తి ఏయే క్యాడర్లో లేకుంటే ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని మార్పు చేశారు. జనాభా నిష్పత్తిలో లేనప్పుడు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇస్తే తప్పేంటి? రాజ్యాంగ సవరణ చేసిన తర్వాతకూడా ప్రమోషన్లలో రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ అనేక కేసులు వేశారు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాలపై నాలుగు సార్లు 77వ రాజ్యాంగ సవరణతో పాటు 85, 94, 97వ రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టింది.

రిజర్వేషన్ కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అంటూ ఇటీవల సుప్రీంకోర్టులో జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, హేమంత్ గుప్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇలా చెప్పింది: "ఆర్టికల్ 16 (4), 16(4ఎ) అధికారం కల్పించే స్వభావంతో కూడిన చేసినట్లు నిబంధనలు. అది పరిస్థితులు తప్పనిసరి చేసినట్లయితే రిజర్వేషన్ కల్పనను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, విచక్షణాధికారం వస్తున్నాయి. "ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించజాలమన్నది స్థిరపడిన చట్టం. అదే విధంగా, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు ప్రమోషన్ విషయాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రంపై లేదు". ఈ రూలింగ్ సామాజిక న్యాయ ప్రయోజ నానికి పెద్ద దెబ్బ. అసలు రిజర్వేషన్ విధానం కొనసాగింపుపైనే అది అనిశ్చితి సృష్టించింది. వాస్తవానికి, ఆర్టికల్ 16(4) ఇలా చెబుతున్నది: "ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం అభిప్రాయపడితే ఏ వెనుకబడిన తరగతి పౌరులకు అనుకూలంగానైనా నియామకాలు లేక పోస్టుల్లో రిజర్వేషన్ కల్పించేటటువంటి నిబంధనను రూపొందించకుండా ఈ ఆర్టికల్‌లో ఉన్నదేదీ ప్రభుత్వాన్ని నిరోధించలేదు". సర్వీసుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు తగినంత ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం భావించినట్లయితే, అట్టి ఉద్యోగులకు ప్రమోషన్ విషయాల్లో రిజర్వేషన్లు కల్పించే నిబంధనలు రూపొందించటానికి ఆర్టికల్ 16(4)కు చేసిన 77వ రాజ్యాంగ సవరణ రాజ్యానికి అధికారమిచ్చింది. దాని మూలంగానే రాజ్యాంగంలో 16(4ఎ) ఆర్టికల్ వచ్చింది.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన వెంటనే తమిళనాడుకు చెందిన చంపకం దొరై రిజర్వేషన్ల కేసులో సుప్రీంకోర్టు ఈ వర్గాలకు వ్యతిరేకంగా తీర్పు చెప్పింది దీనితో 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ప్రారంభమయింది. ఆతర్వాత కేరళ స్టేట్ వర్సెస్ దామాస్ కేసు, బాలాజీ వర్సస్ మైసూర్ స్టేట్, చిత్రలేఖ వర్సెస్ మైసూర్ స్టేట్, రాజేంద్రన్ వర్సెస్ మద్రాస్, జానకి రామ్ వర్సెస్ జమ్మూ కాశ్మీర్ స్టేట్, ఉత్తర ప్రదేశ్ వర్సెస్ ప్రదీప్ టాండన్, జయశ్రీ వర్సెస్ కేరళ స్టేట్ నుంచి మండల్ కేసు వరకు – అలాగే ఇప్పటి ఉత్తర ఖండ్ కేసు వరకు సుప్రీంకోర్టు సామాజిక న్యాయం కేసుల విషయంలో సరియైన విధంగా స్పందించడం లేదని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. రిజర్వేషన్ల విషయంలో ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవలిసిన సమయం ఆసన్నమైంది.

రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకాలు కాదు. ఆర్థిక అభివృద్ధి పథకం అంతకంటే కాదు. పేద కులాలకు అధికార దండం ఇచ్చినప్పుడే కులవివక్ష పోతుంది. ఆస్తి, సంపద ఉన్నా చిన్న కులాలకు అగ్రకులాలుకాని, సమాజం కాని గౌరవం ఇవ్వవు. అధికారం ఉన్నప్పుడు మాత్రమే గౌరవం ఇస్తాయి. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగం ఉద్యోగం ద్వారా అధికారం అధికారం ద్వారా పేద కులాల గౌరవం పెరుగుతుంది. సామాజిక వివక్ష, కుల వివక్ష తొలగిపోతుంది.

**ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడం రాజ్యాంగ బద్ధమైన హక్కు కాదనడానికి సుప్రీంకోర్టు ఏ ప్రాతిపదిక మీద తీర్పు చెప్పిందో తలపండిన న్యాయ నిపుణులకు అర్థం కూడా కావడం లేదు. రాజ్యాంగంలోని 15 (4), 16 (4A) ఆర్టికల్ ద్వారా ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెడుతున్నారన్న విషయం తెలియదా! రాజ్యాంగంలోని 14వ ఆర్టికల్స్ నుంచి 30వ ఆర్టికల్ వరకు ప్రాథమిక హక్కుల క్రిందకు వస్తాయి. అలాంటప్పుడు 15(4) 16 (4A) ఆర్టికల్స్ ప్రాథమిక హక్కు క్రిందకు ఎందుకు రావు?**

విద్య, ఉద్యోగ రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, రాజకీయ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. బీసీలకు రాజకీయ రంగంలో కల్పించలేదు. మిగతా దేశ సంపదలో గాని, ప్రైవేటు రంగంలో కానీ, న్యాయవ్యవస్థలో గాని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు లేవు. నామినేటెడ్ పోస్టులలో, రాజ్యసభలో, కౌన్సిళ్లలో రిజర్వేషన్లు లేవు. బ్యాంకు రుణాలలో వాటా లేదు. అప్పులలో వాటా ఉంది. కానీ ఆస్తిలో దేశ సంపదలో వాటా ఏది?

కుల వివక్ష ఎదుర్కోని అగ్రకులాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం కాదా! వాటిపై కోర్టులు ఎందుకు మౌనంగా ఉన్నాయి. తెలంగాణ అగ్ర కులాల జనాభాలో 9% తమిళనాడులో 4 శాతం ఉన్న అగ్ర కుల 10 శాతం రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన ఇస్తారు. దీనిపై సుప్రీం కోర్టు ఎందుకు స్టే ఇవ్వలేదు. రాజ్యాంగబద్ధమైన మండల కమిషన్ సిఫార్సు ప్రకారం 56 శాతం జనాభా గల బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు పెడితే సుప్రీం కోర్టు దాన్ని మూడు సంవత్సరాలు స్టే ద్వారా ఆపింది. ఆ తరువాత అనేక షరతులతో క్రిమిలేయర్ నిబంధనలు విధించి కొన్ని ప్రభుత్వ శాఖలకే పరిమితం చేసి జీవో జారీ చేశారు. కానీ రాజ్యాంగబద్ధత లేని అగ్రకులాలకు లోక్ సభ రాజ్యసభలో ఒక్కరోజులో రాజ్యాంగ సవరణ బిల్లు పాస్ చేసి మూడవరోజు రాష్ట్రపతి సంతకం చేసి జీవో జారీ చేసి అమలు చేసి, అగ్రకుల అనుకూల వైఖరిని తేటతెల్లం చేశారు.

దేశ అప్పులలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వాటా ఉంది. దేశ సంపదలో వాటా ఇవ్వరా! ఒట్లేయడంలో వాటా ఉంది. అధికారంలో వాటా వద్దా! ఇదేనా ప్రజాస్వామ్యం!

◆ **ఆర్. కృష్ణయ్య**

అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం



# ప్రథమ మహిళ హ్యాపీనెస్!

అమెరికా ప్రథమ మహిళ మెలానియా మంగళవారం ఢిల్లీలోని దక్షిణ మోతీబాగ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. దక్షిణ మోతీబాగ్‌లో ఉన్న సర్వోదయ కో ఎడ్యుకేషన్ సీనియర్ సెకండరీ స్కూలులో పిల్లలు ఆమెకు నుదుట బొట్టు పెట్టి, సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం పలికారు. అక్కడ మెలానియా విద్యార్థులతో ముచ్చటించి, వారితో పాటు 'హ్యాపీనెస్' క్లాసులకు హాజరయ్యారు.

**'హ్యాపీనెస్' క్లాసులంటే...**

చదువు, హోమ్‌వర్క్, పరీక్షలు... అంటూ బడి పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న విషయం తెలిసిందే. ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో టీచర్లు పిల్లలను 'చదువు... చదువు' అంటూ ఒత్తిడి చేస్తుంటారు. అయితే ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్టు 2018' ప్రకారం 155 దేశాల గ్లోబల్ ర్యాకింగ్‌లో మనదేశం 133 ర్యాంకులో ఉంది. ఇది గమనించిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలు 2018 జూలై నుంచి 1000 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త పాఠ్యప్రణాళికను అమలు చేశారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 'హ్యాపీనెస్' క్లాసులను నిర్వహిస్తున్నారు. ఈ క్లాసుల వల్ల పిల్లల్లో స్వీయ అవగాహన పెరిగి... ఎలాంటి క్లిష్ట సమస్యలు ఎదురైనా, ఒత్తిడికి లోను కాకుండా పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఈ ప్రణాళికను నర్సరీ నుంచి, ఎనిమిదో తరగతి దాకా అమలు చేస్తున్నారు. 'హ్యాపీనెస్' క్లాసుల్లో ఏముంటుందంటే...

మనసును ప్రశాంతంగా మార్చుకునేందుకు కొంతసేపు యోగా చేస్తారు. రెండు చేతులను కళ్లపై పెట్టుకుని నిశ్శబ్దంగా తమ శరీరంలో, చుట్టూ (ప్రకృతిలో) జరిగే మార్పులు గమనిస్తారు. శ్వాస మీద ధ్యాస పెట్టడం వల్ల పిల్లల్లో పరిశీలన శక్తి, ఆలోచన శక్తి పెరుగుతుంది. అదేవిధంగా మదిలే మెదిలే భావాలు, అనుభూతులను కాగితం మీద పెడతారు. అది రచన కావొచ్చు, బొమ్మ కావొచ్చు. దీనివల్ల సృజనాత్మక శక్తి అలవడుతుంది. 'హ్యాపీనెస్' క్లాసులో పిల్లలు ఎలాంటి జంకు లేకుండా స్నేహితులతో సరదాగా మాట్లాడతారు. ఆయా విషయాలపై చర్చించుకుంటారు. కథలు చెబుతారు, డాన్సులు వేస్తారు... ఇలా తమలోని టాలెంట్‌కు పదును పెట్టుకునే అవకాశం ఉంటుంది. మొత్తంగా ఈ 'హ్యాపీనెస్' క్లాసులు విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి, పలు విషయాల గురించి అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. గ్రూప్ డిస్కషన్స్ ద్వారా నాయకత్వ లక్షణాలు, భావాన్ని వెల్లడించే ధైర్యం పెరగడమేగాక... క్రిటికల్ థింకింగ్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్ అబ్బుతాయి. ఏకాగ్రత, సమస్య పరిష్కారం వంటి విషయాలు చిన్నతనం నుంచే విద్యార్థులకు అలవడుతాయి. ఈ కారణంగానే ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి, అమెరికా ప్రథమ మహిళ మెలానియా కూడా సందర్శించేలా చేశాయి.





ఆమె కథలో...

# లీనమై రాశా!

**కొందరు వ్యక్తులకు పరిచయాలు అవసరం లేదు. ఆ కోవలోకే వస్తారు ప్రముఖ కథా రచయిత్రి పి.సత్యవతి. ఆమె అనువదించిన 'ఒక హిజ్రా ఆత్మకథ' పుస్తకానికి అనువాద విభాగంలో 2019కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా ఆమెను 'నవ్య' పలకరించింది.**

" 'ఒక హిజ్రా ఆత్మకథ' కు అనువాద విభాగంలో సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం నిజంగా నాకెంతో ఆనందంగా ఉంది. ఇది నా తొలి సాహిత్య అకాడమీ అవార్డు. దీని మూల రచయిత్రి రేవతి. ఆమె నిన్న రాత్రే నాకు ఫోను చేసి తన పుస్తకానికి దక్కిన అపూర్వ గౌరవానికి, గుర్తింపునకు ఎంతో ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఈ పుస్తకం ఆమె స్వీయ జీవితం...ఆమె స్వానుభవాల అక్షరగుచ్ఛం. రేవతికి తెలుగు రాదు. నాకు తమిళం రాదు. కానీ ఇద్దరం ఫోనులో వచ్చీరాని హిందీలో ఎన్నో మాట్లాడుకున్నాం. భావోద్వేగాలకు గురయ్యాం. దీన్నే హృదయభాష అంటారేమో.

**ఊహించలేదు...**

నిజం చెప్పాలంటే ఈ అనువాదానికి సాహిత్య అకాడమీ అవార్డు వస్తుందని ఊహించలేదు. ఇందులో ఒరిజినల్ రచయిత్రి రేవతి హిజ్రాగా ఆమె ఎదుర్కొన్న అవమానాలు, చీదరింపులు, బతకుపోరాటం, సమాజంలో, కుటుంబంలో ఎన్నిరకాలుగా ఆమె దోపిడీకి, అవమానాలకు గురయిందన్న విషయాలను ఎంతో నిజాయతీగా గుండె విప్పి చెప్పారు. ఆ పుస్తకం చదివిన తర్వాత గుండె ఎంతగా చెమ్మగిల్లుతుందో మాటల్లో చెప్పలేం. ఈ పుస్తకం చదివిన వాళ్లు వీధిలోకి వెళ్లినపుడు ఎవరినైనా హిజ్రాని చూస్తే వెంటనే తనను కూడా సాటి మనిషిగా చూస్తారని గట్టిగా చెప్పగలను. ఎందుకంటే ఈ పుస్తక ప్రభావం అలా ఉంటుంది. నేను ఈ పుస్తకం అనువదించేటప్పుడు ఎంతో కలతచెందాను. రేవతి ఆత్మకథ అనువదించేటప్పుడు నేనే తను అన్నంతగా లీనమై పోయా. నేనే కాదు ఈ పని చేపట్టిన ఎవరైనా ఇలాగే మానసికంగా ఇన్వాల్వ్ అయిపోతారు. నేను కూడా అలాగే రకకాల భావోద్వేగాలతో ఆమె పుస్తక అనువాద సమయంలో జీవించానని చెప్పాలి. రేవతి గతంలో దొరస్వామి. తనే హిజ్రాగా మారి రేవతి అని పేరు పెట్టుకుంది. ఈ క్రమంలో ఎన్నో సర్జరీలు చేయించుకోవలసి వస్తుంది. ఇక ఇలాంటి వారిపై దోపిడీకి, దౌర్జన్యాలకు పాల్పడే వాళ్లు సమాజంలో ఎందరో. ముష్టెత్తుతూ కొనసాగిస్తున్న వాళ్ల జీవితం... ఇవన్నీ తలచుకున్నప్పుడల్లా గుండె చెరువవుతుంది. ఇలాంటి వారు ఏదైనా ఉద్యోగం చేసుకుందామంటే ఆ అవకాశాలూ ఇవ్వరు.

**ఏదీ దాచలేదు...**

రేవతి తన ఆత్మకథలో రాసిన ప్రతీ అక్షరం అక్షర సత్యం. ఆమె చూపిన ఆ ధైర్యం ఎందరో పాఠకులను ఆశ్చర్యచకితులను చేసింది. హిజ్రాలు బస్సెక్కితే వారి పక్కన కూర్చోడానికి చాలామంది ఇష్టపడరు. వాళ్లని చులకనగా చూస్తారు. కానీ.... మేము కూడా మనుషులమే. మాకూ జీవించే హక్కుతోపాటు అన్ని హక్కులూ ఉన్నాయని తన ఆత్మకథ ద్వారా గళం విప్పింది రేవతి. 'ఓ హిజ్రా ఆత్మకథ' లాంటి పుస్తకాలు రావాలనే నేను ఈ అనువాదాన్ని చేపట్టా. ఎందుకంటే ఇలాంటి రచనలు ఎందరికో ప్రేరణ ఇస్తాయి.

**మంచి సమీక్షలొచ్చాయి...**

తమిళంలో, తెలుగులో ఈ పుస్తకంపై ఎన్నో మంచి సమీక్షలు వచ్చాయి. రేవతి తన ఆత్మకథను సూటిగా చెప్పారు ఇది సాహసంతో కూడినది. ఆమె తన కమ్యూనిటీ హక్కులు, గౌరవంగా జీవించే హక్కు, పౌరహక్కుల కోసం తన కమ్యూనిటీకి చెందిన ఒక ఎన్జీవోలో ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నారు. రేవతిలా తన జీవితాన్ని అందరి ముందూ పరిచిపెట్టడమంటే ఎంతో పోరాటం చేయాలి. నాకు సాహిత్య అకాడమీ అవార్డు ఇదే ప్రథమం. అందులోనూ అనువాదానికి రావడం కొంచెం ఆశ్చర్యంగా ఉంది. ఆనందంగానూ ఉంది. ప్రధానంగా నేను కథా రచయిత్రిని కాబట్టి చాలామంది సాహిత్య పాఠకులు ఆమె కథారచయిత్రి కదా అంటున్నారు. నా కథలు నన్ను ప్రాచుర్యంలోకి తేవడం వల్ల చాలామందికి అలాగే నేను తెలుసు (నవ్వుతూ). ఇప్పుడు నేను కొత్త రచనలేమీ చేయడం లేదు. కానీ నేను రాసిన కథలలో 40 కథలను మాత్రం ఎంపిక చేసి పెద్ద పుస్తకంగా తెచ్చా."

రచయిత్రిగా చాలామంది నన్ను స్త్రీవాదిగానే గుర్తిస్తారు. నేను కూడా అలాగే చెప్పుకుంటా. ఎన్నడూ కాదనలేదు కూడా. ఫెమినిజం ఒక ఫిలాసఫీ. అందులోనే మానవతావాదం, ప్రజాస్వామ్యం ఇలా ఎన్నో స్ఫూర్తివంతమైన ఇజాలు దాగున్నాయి..

● నాగసుందరి












## ఎందరికో కళ్ళు తెరిపించిన పుస్తకం ఇది!

"మా హైదరాబాద్ బుక్ ట్రస్ట్ చేసిన అనువాదాలకు అవార్డు రావడం ఇది నాలుగోసారి అనుకుంటా. గతంలో 'ఇంట్లో ప్రేమ్‌చంద్' (అనువాదం - శాంతసుందరి), 'దళిత చరిత్ర' (మందార ప్రభాకర్) లాంటి పుస్తకాలకు కూడా వచ్చాయి. అయితే, హిజ్రా ఆత్మకథగా వచ్చిన ఈ పుస్తకం వాటికన్నా భిన్నమైనది. ఇవాళ్టికీ సమాజంలో హిజ్రాలంటే ఎంతో చిన్నచూపు, దురభిప్రాయం ఉంది. ఆడవాళ్ళు వాళ్ళను దగ్గరకు రానివ్వరు. మగవాళ్ళేమో వారి నుంచి మరేదో ఆశిస్తూ ఉంటారు. ఆ పరిస్థితుల్లో తమిళనాడుకు చెందిన రేవతి అనే హిజ్రా ఆత్మకథ ఈ పుస్తకం. ఆమె కుటుంబ జీవితం మొత్తాన్నీ వివరించే ఈ ఆత్మకథ మొదట ఇంగ్లీషులో 'ది ట్రూత్ ఎబౌట్ మి - ఎ హిజ్రా లైఫ్ స్టోరీ' పేరిట వచ్చింది. ఫెమినిస్ట్ చరిత్రకారిణి వి. గీత దాన్ని వెలువరించారు. అది ఆదరణ పొందాక, తమిళంలో 'వెల్లై మొళి' పేరిట అనువదించారు. పెంగ్విన్ వాళ్ళు వేసిన ఇంగ్లీషు పుస్తకం చదివా. అనుకోకుండా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో రేవతిని కలిశా. ఆమె సహాయంతో, పెంగ్విన్ వాళ్ళ అనుమతితో 2014లో తెలుగులో 'ఒక హిజ్రా ఆత్మకథ' తీసుకొచ్చాం. స్త్రీవాదులు సైతం ఆడవాళ్ళమైన మేమే ఎన్నో కష్టాలు పడుతుంటే, వీళ్ళెందుకు ఆడవాళ్ళుగా మారాలని అనుకుంటున్నారని వ్యాఖ్యానించే రోజుల్లో ఈ పుస్తకం వచ్చింది. అప్పట్లో రేవతిని కూడా హైదరాబాద్ రప్పించి, రెండు మూడు సాహితీ సమావేశాలు పెట్టాం. మొదట్లో ఈ పుస్తకానికి అంత స్పందన రాలేదు. కానీ, క్రమంగా ఎంతోమందిని ఆకట్టుకుంది. ఎంతోమంది కళ్ళు తెరిపించి, హిజ్రాల పట్ల అభిప్రాయాలు మార్చుకొనేలా చేసింది. అలా ఈ పుస్తకం ఒక మార్గదర్శి అయింది.

**సత్యవతికి ఎప్పుడో ఇవ్వాల్సింది!**

ఈ పుస్తకానికి ఇంగ్లీషు నుంచి తెలుగులోకి పి. సత్యవతి చేసిన అనువాదం చాలా బాగుంటుంది. అలా పాపులరైన ఈ అనువాదం ఎన్నో ముద్రణలు పొందింది. ఇగో లేకుండా, అడిగినది ఏదీ కాదనకుండా మన్నించే రచయిత్రిగా సత్యవతి అంటే నాకు వ్యక్తిగతంగా కూడా చాలా ఇష్టం. రజనీకాంత్ 'కాలా' చిత్రంలో కనిపించే ప్రసిద్ధ రచన వై.బి. సత్యనారాయణ 'మా నాయిన బాలయ్య', కేరళ గిరిజన లీడర్ సి.కె. జాను రచన 'అడవితల్లి', క్యారెన్ ఆమ్‌స్ట్రాంగ్ 'ముహమ్మద్ ప్రవక్త జీవితం', 'ఇస్మత్ చుగ్తాయ్ కథలు', తాజాగా 'మెనీ రామాయణాస్' తెలుగు అనువాదం 'అనేక రామాయణాలు' - ఇలా అనేక పుస్తకాలు సత్యవతి మాకు అనువాదం చేశారు. నిజానికి, సొంతంగా ఎన్నో కథలు, నవలలు రాసిన మంచి సృజనాత్మక వచన రచయిత్రి సత్యవతి. 'ఇల్లలకగానే...', 'మంత్రనగరి' లాంటి ఆమె కథాసంపుటాలు చాలా బాగుంటాయి. ఆమె కథలను 'హియర్ అయామ్' పేరిట ఆంగ్లంలోకి అనువాదం చేయించి ప్రచురింపజేశాం. సృజనాత్మక రచనలోనే ఆమెకు ఎప్పుడో సాహిత్య అకాడమీ అవార్డు రావాల్సింది. ఆలస్యమైంది. ఇప్పుడు అనువాదంలో అవార్డు ఇవ్వడం ఆశ్చర్యమనిపించింది. అయితే, ఇప్పటికైనా గుర్తింపు ఇవ్వడం సంతోషం."

**- గీతా రామస్వామి,** ప్రచురణకర్త, హైదరాబాద్ బుక్ ట్రస్ట్




బెటర్ లైఫ్

మా ఇంటికి పెళ్లి సంబంధం కోసం వచ్చిన అబ్బాయి 'మీతో ఒకసారి ఏకాంతంగా మాట్లాడాలనుకుంటున్నాను' అన్నాడు. అందుకు మా పెద్దలు 'సరే'నన్నారు. ఓ హోటల్‌కు వెళితే కాసేపు మాట్లాడి చివరిగా 'మా ఊరిలో కొంతమంది నాకు ఒక అమ్మాయితో ఎఫైర్ ఉందంటూ తప్పుడు ప్రచారం చేశారు. అది ఏదో ఒక రోజున మీ చెవిన పడకుండా పోదు. ఒకవేళ మీరు కూడా నమ్మితే మీ ఇష్టం. దానికి నేనేమీ చేయలేను. అయితే అందులో ఏమాత్రం నిజం లేదని నా మనస్సాక్షిగా చెబుతున్నా. సారీ ఫర్ ద ట్రబుల్' అన్నాడు. అతడు చెప్పినది విన్న తర్వాత 'దానిదేముందండీ. చాలామంది విషయాల్లో అలాంటి దుష్ప్రచారాలు జరుగుతూ ఉంటాయి. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అన్నాను. అతడు సంతోషం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత పది రోజులకు అతను నాకు ఫోన్ చేసి 'ఏమండీ... నా మీద ఒక దుష్ప్రచారం ఉందని ఆ రోజు మీకు చెప్పాను కదా! ఒకవేళ అది దుష్ప్రచారం కాదు... వాస్తవమేనంటే మీరెలా స్పందిస్తారు?' అన్నాడు. ఆ మాటలు విని 'రేపు మాట్లాడతానం'టూ దాట వేశాను. ఆ మరుసటి రోజే మళ్లీ నాకు ఫోన్ చేసి 'చూడండి... ఆరోపణ ఆరోపణే అవుతుంది కానీ, అది నిజమెలా అవుతుంది? అలాంటి సందర్భాలేవైనా ఎదురైనప్పుడు మీ ఫీలింగ్స్ ఎలా ఉంటాయో తెలుసుకుందామనే అలా చెప్పాను కానీ మరో ఉద్దేశం లేదు. మీ మనసులోంచి ఆ విషయాన్ని పూర్తిగా తీసేయండి' అంటూ ఫోన్ పెట్టేశాడు. ఇంతకీ అతన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక పిచ్చెక్కిపోతోంది. ఈ విషయంలో ఏ నిర్ణయానికి రావాలో సలహా ఇవ్వండి.

**- కె.సౌమ్య,** ఆదిలాబాద్

పరస్పర విరుద్ధమైన నాలుగు విషయాల్ని ఎవరికైనా, వెంట వెంటనే చెప్పినప్పుడు ఏమవుతుంది? వినేవారిలో ఒక అయోమయం మొదలవుతుంది. ఆ అయోమయం కొన్ని రోజులు అలాగే కొనసాగితే, ఆ నాలుగూ వాటి తీవ్రతను కోల్పోతాయి. అది కేవలం ఒక ఆరోపణే అని ఒకసారి... ఆరోపణే నిజమని తేలితే ఏం చేస్తారని ఒకసారి... అదంతా

# అతన్ని ఎలా అర్థం చేసుకోవాలి?



ఉత్తదే, కావాలనే అలా చెప్పానని ఒకసారి... ఇలా పొంతనలేని విషయాలన్నీ వరుసగా మీ పైన గుప్పించడం ద్వారా అతడు మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో మనసు బాగా అలసిపోతుంది. కలగాపులగమైన విషయాలతో అలసిపోయిన మనసు హేతుబద్ధంగా ఆలోచించలేక స్తబ్దంగా ఉండిపోతుంది. సమాధానంగా ఏమీ చెప్పలేని పరిస్థితిలో పడిపోతుంది. ఆ స్థితితో ఎటుతోస్తే అటుపడిపోతారు. అతడు కోరుకుంటున్నది కూడా అదే!

మొత్తంగా చూస్తే చాలా తెలివిగా అతడు మిమ్మల్ని తనవైపు అడుగులు వేసేలా చేస్తున్నాడు. ఈ స్థితిలో కొంతకాలం మౌనంగా ఉండిపోండి. తొందరపడి అతడు విసిరే ఉచ్చులో పడితే ఇక అంతే! అతని మాటలను గమనిస్తే, ఒక ఎఫైర్ ఉందనే విషయం స్పష్టం అవుతూనే ఉంది. కాకపోతే, తానుగా దాన్ని బయటపెట్టడానికి సాహసించడం లేదు. 'వంద అబద్ధాలు చెప్పయినా సరే, ఒక పెళ్లి చేయాల'ని అంటుంటారు. కానీ అబద్ధాలతో కుదిరిన పెళ్లి ఆ అబద్ధాలకే బలైపోతుందని తెలిసినా, వాస్తవాన్ని వారు దాచేశారు. అయినా అబద్ధాలు చెప్పడం వేరు... నిజాల్ని దాచేయడం వేరు. ఇతడు నిజాల్ని దాచే ప్రయత్నం చేస్తున్నాడు. ఈరోజు వాటిని దాచిపెట్టినా ఏదో ఒక రోజున అవి బయటపడకుండా ఉండవు కదా! పైగా అతడు ఆ ఎఫైర్‌ను అంతటితో ముగించే ఉద్దేశంతో ఉన్నాడా? పెళ్లి తర్వాత కూడా కొనసాగించాలనుకుంటున్నాడా? అన్నది మరో పెద్ద విషయం. ఒకవేళ దాన్ని కొనసాగించాలనుకుంటే అది మరీ ప్రమాదం. ఇదంతా కాదు గానీ, వివాహ బంధానికి అతడు ఏ రకంగా యోగ్యుడు కాడనేది వాస్తవం. అందువల్ల ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలేయడం శ్రేయస్కరం.

**● డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి**
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్




# స్కిన్‌కేర్ ఎలా ఉండాలంటే...

బ్యూటీ



చర్మం తాజాగా, కాంతిమంతంగా కనిపించేందుకు పలు రకాల సౌందర్య ఉత్పత్తులు ఉన్నాయి. అయితే 'ఒకటి లేదా రెండు రకాల బ్యూటీ ప్రొడక్ట్స్ వాడినా కూడా మెరుగైన ఫలితం ఉంటుంది' అంటున్నారు చర్మనిపుణులు. స్కిన్‌కేర్‌పై అవగాహనతో అందాన్ని పెంచుకోవడం సులువే అంటున్నారు.

❖ ఏ సౌందర్య సాధనం అయినా వెంటనే ఫలితం ఇవ్వదు. దాంతో చాలామంది వెంటవెంటనే బ్యూటీ క్రీమ్స్ మారుస్తూనే ఉంటారు. అయితే చర్మం బ్యూటీ ప్రొడక్ట్స్‌కు నెల తరవాత స్పందించడం మొదలెడుతుంది అందువల్ల మూడు నెలల పాటు ఒకే స్కిన్‌కేర్ పాటించాలి. ఈ సమయంలో చర్మం మూడు పొరల మీద బ్యూటీ క్రీమ్ ప్రభావం ఏ మేర ఉంటుందో తెలుస్తుంది. అప్పటికీ ఏ మార్పు లేకపోతే వేరే క్రీమ్ వాడాలని సూచిస్తున్నారు చర్మ, సౌందర్య నిపుణులు.

❖ డల్‌నెస్ తగ్గేందుకు, హైడ్రేషన్, మృదువైన చర్మం కోసం వాడే బ్యూటీ ఉత్పత్తులు తక్కువ సమయంలోనే ఫలితాన్నిస్తాయి. అయితే చర్మం మీది ముడతలు, గీతలు, మొటిమల మచ్చలు తొలగేందుకు ఎక్కువ సమయం పడుతుంది.

❖ రకరకాల చర్మ సౌందర్య సాధనాలు వాడే బదులు ఒకటి లేదా రెండు ఉత్పత్తులు వాడితే మెరుగైన ఫలితం ఉంటుంది. కొత్త రకం క్రీమ్ వాడే ముందు అది చర్మతత్వానికి సరిపోతుందో లేదో తెలుసుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు చర్మ నిపుణులు.

## లిటిల్స్



విశేషం

## సరస్సు అడుగున సెల్ఫీ!



సెలబ్రిటీలు, సినీతారలు, రాజకీయ ప్రముఖులకు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు ఉండడం తెలిసిందే. కానీ ఒక చిన్న సరస్సుకు ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఉండడం చిన్న విషయం కాదు. ఇంతకీ ఈ సరస్సు ఎక్కడ ఉంది, దీని ప్రత్యేకత ఏమిటి అంటే.... ఇండోనేషియాలో మధ్య జావా ప్రాంతంలో ఉంది 'ఉంబుల్ పొంగ్గాక్' అనే సరస్సు. 40 మంచి నీటి ఊటల నుంచి సెకనుకు 800 లీటర్ల నీరు ఈ సరస్సులోకి ప్రవహిస్తుంది. దాంతో ఇందులోని నీరంతా తేటగా, స్వచ్ఛంగా ఉంటుంది. నీటి లోపల నుంచి చూస్తే ఈ సరస్సు అందాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. అరుదైన చేపలను ఇక్కడ చూడొచ్చు. కొంత ఫీజు చెల్లిస్తే డైవింగ్ మాస్క్, బ్రీతింగ్ ట్యూబ్ ఇస్తారు నిర్వాహకులు. కొలను అడుగున బైక్, కుర్చీల మీద కూర్చొని 'అండర్ వాటర్ సెల్ఫీ' దిగుతూ కొత్త ప్రపంచాన్ని ఆస్వాదించేందుకు సందర్శకులు ఆసక్తి చూపించడంతో ఈ సరస్సు పర్యాటక ప్రాంతంగా మారింది. ఒకప్పుడు కలుషితంగా ఉన్న ఈ లేక్‌ను గ్రామస్థులు తలో చేయి వేసి శుభ్రం చేశారు.

### పట్టికలో పదాలు కనిపెట్టండి



| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| B | Z | Q | H | O | R | S | E | H | Z | K |
| S | F | A | R | G | D | N | K | M | R | L |
| T | R | Y | O | V | Q | D | U | C | K | O |
| X | O | Z | B | T | I | X | F | S | P | J |
| P | O | C | Y | S | H | E | E | P | W | S |
| R | S | P | B | D | N | T | H | I | V | C |
| D | T | X | G | W | U | E | C | W | K | O |
| W | E | D | R | E | C | U | A | G | G | W |
| Y | R | G | A | O | Q | N | T | J | M | L |
| S | A | E | T | F | P | F | X | U | H | V |
| D | O | G | M | C | I | L | Q | Z | Y | J |
| T | B | H | A | V | G | U | M | K | I | M |

### చుక్కలు కలిపి రంగులు వేయండి



### 5 తేడాలు గుర్తించండి





### డైలీ సుడోకు - 291

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 2 | 3 | | | 7 |
| | | | 7 | | | 1 | | |
| | | | 9 | 5 | | | 6 | |
| 8 | 9 | | 4 | | | | 1 | |
| 6 | 2 | | 1 | | 8 | | 3 | 5 |
| | 7 | | | | 5 | | 4 | 8 |
| | 3 | | | 7 | 9 | | | |
| | | 9 | | | 2 | | | |
| 7 | | | 8 | 1 | | | | |

**సుడోకు- 290 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 6 | 5 | 7 | 2 | 1 | 9 | 4 |
| 1 | 9 | 5 | 3 | 4 | 6 | 2 | 8 | 7 |
| 4 | 2 | 7 | 1 | 8 | 9 | 5 | 3 | 6 |
| 6 | 5 | 3 | 4 | 2 | 8 | 7 | 1 | 9 |
| 2 | 4 | 8 | 9 | 1 | 7 | 3 | 6 | 5 |
| 9 | 7 | 1 | 6 | 5 | 3 | 8 | 4 | 2 |
| 8 | 3 | 4 | 7 | 6 | 5 | 9 | 2 | 1 |
| 5 | 6 | 2 | 8 | 9 | 1 | 4 | 7 | 3 |
| 7 | 1 | 9 | 2 | 3 | 4 | 6 | 5 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ వరుసలోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

## టెక్నికల్ అసిస్టెంట్

ఖాళీలు 495

నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టుల వారీగా ఖాళీలు: సైంటిస్ట్ - 288, సైంటిఫిక్ / టెక్నికల్ అసిస్టెంట్ - 207
- ★ అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్ / ఎంఎస్సీ / ఎంఎస్ / ఎంసీఏ.
- ★ వయసు: 30 ఏళ్లు మించకూడదు (మార్చి 26 నాటికి).
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 26, 2020.
- ★ వెబ్‌సైట్: http://nielit.gov.in/

## ఆపరేటర్

ఖాళీలు 307

నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ భర్తీ చేసే పోస్టులు: డ్రాగ్‌లైన్ ఆపరేటర్, డోజర్ ఆపరేటర్, గ్రేడర్ ఆపరేటర్, డ్రిల్ ఆపరేటర్.
- ★ అర్హత: పదో తరగతి, ఐటీఐ, హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ ఉండాలి.
- ★ ఎంపిక: రాతపరీక్ష, టెక్నికల్ టెస్ట్ ఆధారంగా.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 30, 2020.
- ★ వెబ్‌సైట్: http://nclcil.in/

## సైంటిస్ట్

ఖాళీలు 41

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టుల వారీగా ఖాళీలు: జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ - 2, సైంటిస్ట్ - 38, ఎకనమిస్ట్ - 1.
- ★ అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- ★ ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 12, 2020.
- ★ వెబ్‌సైట్: www.upsc.gov.in

## టెక్నీషియన్

ఖాళీలు 30

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) - మేఘాలయ, పలు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టుల వారీగా ఖాళీలు: టెక్నికల్ అసిస్టెంట్ - 9, టెక్నీషియన్ - 17, ల్యాబొరేటరీ అటెండెంట్ - 4.
- ★ అర్హత: పోస్టును అనుసరించి సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్, బీఈ / బీటెక్ / ఎంసీఏ.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్.
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 6, 2020.
- ★ దరఖాస్తు హార్డ్‌కాపీలను పంపడానికి చివరి తేదీ: ఏప్రిల్ 20, 2020.
- ★ వెబ్‌సైట్: www.nitmeghalaya.in



## అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

ఖాళీలు 218

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వివిధ కేటగిరీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టుల వారీగా ఖాళీలు: అసిస్టెంట్ ఇంజనీర్ -50, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ - 168
- ★ విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్, సీఏ, యాక్చూరియల్, లీగల్, రాజ్‌భాష, ఐటీ.
- ★ అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈ / బీటెక్, బీఆర్క్, ఎంఈ / ఎంటెక్, పీజీ.
- ★ వయసు: 21 - 30 ఏళ్ల మధ్య ఉండాలి (ఫిబ్రవరి 1 నాటికి).
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 15, 2020.
- ★ వెబ్‌సైట్: https://licindia.in/

## ప్రైమరీ టీచర్

హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌కి చెందిన భారతీయ విద్యాభవన్స్ విద్యాశ్రమం ప్రైమరీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ సబ్జెక్టులు: ఇంగ్లీష్, తెలుగు, ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ సైన్స్.
- ★ అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ / పీజీతో పాటు బీఈడీ / ఎంఈడీ, టెట్ / సీటెట్‌లో అర్హత, అనుభవం.
- ★ దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2020.
- ★ వెబ్‌సైట్: www.bhavansnird.com/

## షిప్ డిజైన్ అసిస్టెంట్

ఖాళీలు 30

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన షిప్ డిజైన్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మెకానికల్ - 9, ఎలక్ట్రికల్ - 21
- ★ అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, అనుభవం.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 4, 2020.
- ★ వెబ్‌సైట్: cochinshipyard.com/

## యాంత్రిక్

ఖాళీలు 37

ఇండియన్ కోస్ట్‌గార్డ్ యాంత్రిక్ (మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టుల వారీగా ఖాళీలు: యాంత్రిక్ టెక్నికల్ (మెకానికల్) - 19, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రికల్) - 3, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్) - 15
- ★ వయసు: 1 ఆగస్టు 1998 - 31 జూలై 2002 మధ్య జన్మించి ఉండాలి.
- ★ ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ★ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: మార్చి 16, 2020.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 22, 2020.
- ★ వెబ్‌సైట్: www.joinindiancoastguard.gov.in/

## గ్రాడ్యుయేట్ ట్రెయినీ

ఖాళీలు 36

భారత ప్రభుత్వ మినీ రత్న కంపెనీ మ్యాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) గ్రాడ్యుయేట్ ట్రెయినీ / మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ★ గ్రాడ్యుయేట్ / మేనేజ్‌మెంట్ ట్రెయినీ - 36.
- ★ విభాగాల వారీగా ఖాళీలు: మైనింగ్- 10, సిబ్బంది-6, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్- 6, మార్కెటింగ్- 2, మెటీరియల్స్- 2, ప్రాసెస్ (కెమికల్, మెటలర్జీ, మినరల్ ప్రాసెసింగ్)- 6, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్- 4.
- ★ అర్హత: సంబంధిత విభాగంలో బీఈ / బీటెక్ / ఎంటెక్, ఎంబీఏ / సోషల్ వర్క్‌లో పీజీ / సీఏ/ సీడబ్ల్యుఏ/ సీఎంఏ.
- ★ ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
- ★ చివరి తేదీ: 9 మార్చి 2020
- ★ కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్: 29 మార్చి 2020
- ★ వెబ్‌సైట్: moil.nic.in

## అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు 17

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - నాగ్‌పూర్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు: 11, నాన్ టీచింగ్: 6
- ★ అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగాలు: సీఎస్ఈ, ఈసీఈ, మ్యాథమెటిక్స్, హ్యూమానిటీస్.
- ★ నాన్ టీచింగ్ పోస్టులు: జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ ఇంజనీర్, ల్యాబొరేటరీ అసిస్టెంట్.
- ★ దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 11, 2020.
- ★ వెబ్‌సైట్: https://iiitn.ac.in/

## ప్రాజెక్టు ఇంజనీర్లు

ఖాళీలు 132

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్, నోయిడా) కాంట్రాక్టు పద్ధతిలో ప్రాజెక్టు మేనేజర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ★ ఖాళీలు: అప్లికేషన్ పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ / డేటా సెంటర్ ఆపరేషన్స్ - 2, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీస్ - 1, సాఫ్ట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ - 7, డీబీఏ / బిగ్ డేటా/ సెక్యూరిటీ అనలిస్ట్ మొదలైనవి - 12, సాఫ్ట్‌వేర్ క్వాలిటీ అనలిస్ట్ - 1, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలపర్ - 99, ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ - 4, ఫ్యాకల్టీ / డిజిటల్ మార్కెటింగ్ - 2, మొబైల్ అప్లికేషన్ డెవలపర్ - 4.
- ★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- ★ చివరి తేది: 11 మార్చి 2020
- ★ వెబ్‌సైట్: www.cdac.in

## నాన్ టీచింగ్

ఖాళీలు 167

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) పలు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- ★ టీచింగ్ ఖాళీలు: 88, నాన్ టీచింగ్: 79
- ★ విభాగాలు: ఫార్మకాలజీ - టాక్సికాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్, అడ్మినిస్ట్రేషన్, ఎగ్జామినేషన్, లైబ్రరీ తదితరాలు.
- ★ అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, అనుభవం.
- ★ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 19, 2020.
- ★ వెబ్‌సైట్: hajipurrecruitment.niperkolkata.edu.in

# కొలువు వచ్చిన కొత్తలో..

*జీవితంలో విజయం సాధించడం తేలికే. దాన్ని నిలబెట్టుకోవడమే కష్టం. ఉద్యోగాన్వేషణలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. గతంతో పోల్చితే ప్రస్తుతం చాలా అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆ అవకాశాలను హైస్పీడ్ వేగంతో నేటి యువత అందుకుంటోంది. అయితే ఆ సక్సెస్‌ను నిలబెట్టుకోవాలంటే అంతకు మించి శ్రమించాల్సి ఉంటుంది. వర్క్‌ప్లేస్‌లో మనకంటూ ఒక ప్రత్యేక స్థానం, గౌరవం ఉంటేనే ఇది సాధ్యం. క్లాస్ రూమ్‌కు, కాలేజ్ క్యాంపస్‌కు పూర్తిగా భిన్నమైన ఆఫీస్ అనే ప్రపంచంలోకి అడుగిడిన కొత్తలో అంతా ఉత్సాహంగా ఉంటుంది. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ వర్క్‌ప్లేస్‌లో మనకంటూ ఒక గుర్తింపును ఏర్పరచుకోవాలి. దీనికి ఏంచేయాలో తెలుసుకుందాం.*



బాధ్యతలు, విధుల నిర్వహణకు సంబంధించి ప్రతి సంస్థకు ప్రత్యేకమైన పని సంస్కృతి, విధానాలు ఉంటాయి. కాబట్టి మీరు ఎటువంటి నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ కూడా సదరు సంస్థకు సొంతమైన పని విధానంలో ఇమిడిపోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా విధి నిర్వహణ, ఉపయోగించే భాష, ఫైల్ ఎగ్జిక్యూషన్ తదితరాలన్నీ కూడా ఆ సంస్థకు ఆమోదయోగ్యమైన రీతిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కెరీర్ ప్రారంభ దశలో ఇటువంటి వాటిని ఎదగడానికి దోహదపడే పాఠాలుగా భావించాలి.

### ఏమి కోరుకుంటున్నారు?

మరో కీలక అంశం.. సహోద్యోగులు మీ నుంచి ఏమి కోరుకుంటున్నారు. ఎందుకంటే వారు ఆశిస్తున్న విధంగా బాధ్యతలు నిర్వర్తిస్తే మీ పట్ల గౌరవంతో పాటు కృతజ్ఞత భావన కూడా ఏర్పడుతుంది. ఈ క్రమంలో సహోద్యోగులతో బాధ్యతల గురించి తరచుగా సంభాషిస్తూ ఉండాలి. విధులు, బాధ్యతల నిర్వహణలో వారి అవసరాలను తెలుసుకొని కావల్సిన సహాయ సహకారాలను అందించడానికి ప్రయత్నించాలి.

### అభిప్రాయాలను గౌరవించాలి

మన చుట్టూ ఉండే సహోద్యోగులు, మేనేజర్లు, కస్టమర్లు ఇలా ఎవరైనా సరే వారి అభిప్రాయాలను గౌరవించడం నేర్చుకోవాలి. మీ గురించి వారు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను శ్రద్ధగా వినాలి. వాటిల్లో ఉండే నిర్మాణాత్మక సూచనలను పాటించడానికి ప్రయత్నించాలి.

### ప్రొఫెషనల్ డ్రెస్ కోడ్

బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ప్రొఫెషనల్ లుక్ వచ్చేలా వస్త్రధారణ ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో మీకు సౌకర్యవంతంగా ఉండే ఎటువంటి డ్రెస్ అయినా ధరించవచ్చు. కాకపోతే అందులో స్మార్ట్‌గా, కూల్‌గా, నీట్‌గా కనిపించాలి. డ్రెస్సింగ్ విషయంలో సంస్థలో అందరికీ ఆదర్శంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

### మెచ్చుకునే వ్యక్తిత్వం

అన్నింటికంటే కీలకమైంది వ్యక్తిత్వం. ఉద్యోగంలో చేరినప్పుడు మీరు ఎటువంటి సిద్ధాంతాలు, వైఖరులు కలిగి ఉంటారో వాటికే కట్టుబడి ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే స్వతహాగా మీరు ఎలాంటి వారో అలాగే ఉండాలి. వేరేవారి కోసం మీ వ్యక్తిత్వం మార్చుకోవద్దు. ఇటువంటి ఆటిట్యూడ్ సంస్థలో మీ పట్ల గౌరవం పెరగడానికి దోహదం చేస్తుంది. సహోద్యోగులు కూడా ఈ వైఖరిని ఆమోదిస్తారు. అయితే ఈ వైఖరి అహంకార ధోరణికి దారితీయకుండా అందరూ మెచ్చుకునే విధంగా ఉండాలి.

### ఈజీ గోయింగ్

ఈజీ గోయింగ్ పర్సనాలిటీ కూడా గుర్తింపును పెంచుకోవడానికి దోహదపడుతుంది. అప్పగించిన పనిని చురుగ్గా, సకాలంలో పూర్తి చేసే స్వభావం ఉన్న ఉద్యోగులను సంస్థలు విలువైన ఆస్తిగా భావిస్తాయి. కాబట్టి ఇచ్చిన బాధ్యతను సహోద్యోగులను సమన్వయం చేసుకుంటూ అనుకున్న సమయానికి ముందే పూర్తి చేయాలి. తద్వారా ఎటువంటి పనిని అప్పగించినా చేయగల ఈజీ గోయింగ్ పర్సన్ అనే పేరు స్థిరపడిపోతుంది. ఇది ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదపడుతుంది. అయితే దీని కారణంగా మీలో ఎటువంటి అహంభావం, అహంకారం వంటి లక్షణాలకు చోటు ఇవ్వకూడదు. ఈజీ గోయింగ్ పర్సనాలిటీ అనే ట్యాగ్‌ను ఎదిగే క్రమంలో ఒక సానుకూల వైఖరిగానే స్వీకరించాలి.

చిరంజీవి, మహేశ్‌బాబు మధ్య మంచి అనుబంధం ఉంది. ఇటీవల 'సరిలేరు నీకెవ్వరు' ప్రీ-రిలీజ్ వేడుకకు చిరంజీవి అతిథిగా వచ్చారు. మహేశ్ గురించి గొప్పగా మాట్లాడారు. తనకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తుల్లో చిరంజీవి ఒకరని ఒకానొక సందర్భంలో మహేశ్ చెప్పారు. 'ఒక్కడు', 'భరత్ అనే నేను', 'మహర్షి'... తాను మంచి చిత్రాలు చేసిన ప్రతిసారీ చిరంజీవి ప్రశంసిస్తూ వచ్చారని, ప్రోత్సహించారని


మహేశ్‌బాబు, చిరంజీవి

# చిరంజీవి చిత్రంలో మహేశ్

ఆయన పేర్కొన్నారు. ఇన్నాళ్లూ సినిమా వేడుకల్లో, ఇతర వేదికలపై కలిసి కనిపించిన వీరిద్దరూ త్వరలో వెండితెరపై ఒకే చిత్రంలో కనిపించనున్నారు. నిజమే... కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రంలో మహేశ్‌బాబు కూడా నటిస్తున్నారు. ఇటీవల కథ, అందులో తన పాత్రకు సంబంధించిన వివరాలు విన్న మహేశ్... 'ఎస్' చెప్పారట. ఈ చిత్రానికి ఆయన 30 రోజులు డేట్స్ కేటాయించారనీ, జూన్ నుండి చిత్రీకరణలో పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఆగస్టులో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇంతకు ముందు కొరటాల శివ దర్శకత్వంలో మహేశ్ 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' చిత్రాలు చేసిన సంగతి తెలిసిందే.


బాలకృష్ణ

# మార్చిలో మొదలు

నందమూరి బాలకృష్ణ ఈ మధ్య కొత్తగా కనిపిస్తున్నారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా గుండుతో... కాస్త బరువు తగ్గి స్లిమ్‌గా, సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో స్టైలిష్‌గా ఉన్నారు. 'సింహా', 'లెజెండ్' చిత్రాల తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో ముచ్చటగా మూడోసారి కథానాయకుడిగా నటించనున్న సినిమా కోసం ఆ లుక్‌లోకి వచ్చారు. త్వరలో అదే లుక్‌తో సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నారు. మార్చి రెండో తారీఖు నుండి బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో మూడో సినిమా చిత్రీకరణలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో బాలకృష్ణ రెండు కోణాలున్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. అఘోరాల నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు రొమాంచిత అనుభూతి ఇస్తాయట! ఈ చిత్రంలో బాలకృష్ణకు జంటగా అంజలిని ఎంపిక చేసినట్టు తెలిసింది.

# ఈ విజయం చాలామందికి జవాబు

- నితిన్


'దిల్' రాజు, రష్మిక, నితిన్, మహతి, సూర్యదేవర నాగవంశీ, వెంకీ

"నితిన్ నవ్వించాడనీ, బాగా చేశాడని చెబుతుంటే సంతోషంగా ఉంది. నేను చేసిందల్లా వెంకీని కాపీ కొట్టడమే. దర్శకుడు చెప్పింది చేశాను కాబట్టే నా నటన బావుందంటున్నారు. మా చిత్రబృందమంతా ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న విజయమిది. నాకు నాలుగేళ్ల తర్వాత విజయం వచ్చింది. 'భీష్మ' కోసం వెంకీ చాలా కష్టపడ్డాడు. ఈ విజయంతో చాలామందికి అతను జవాబు చెప్పాడు" అని నితిన్ అన్నారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, రష్మిక జంటగా సూర్యదేవర నాగవంశీ నిర్మించిన 'భీష్మ' ఈ నెల 21న విడుదలైంది. హైదరాబాద్‌లో మంగళవారం విజయోత్సవం నిర్వహించారు. చిత్రాన్ని పంపిణీ చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ "నితిన్‌తో 'శ్రీనివాస కల్యాణం' చేశాం. విజయం అందుకోవాలనుకున్నాం. కానీ, కుదరలేదు. చిత్రంలో మంచి వినోదం, బలమైన కథాంశం ఉంటే ప్రేక్షకులు విజయం అందిస్తారని 'ప్రతిరోజూ పండగే', 'సరిలేరు నీకెవ్వరు', 'అల... వైకుంఠపురములో', ఇప్పుడు 'భీష్మ' నిరూపించాయి. 'ఛలో', 'భీష్మ' విజయాలతో వెంకీ కుడుముల హ్యాట్రిక్‌కి సిద్ధమవుతున్నాడు. హీరోలతో పోటీ పడుతూ రష్మిక డ్యాన్స్ చేస్తోంది. చక్కగా నటిస్తోంది. యువత చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నారు" అన్నారు. వెంకీ కుడుముల మాట్లాడుతూ "మా నిర్మాతలు చినబాబు, వంశీ, హీరో నితిన్ నా కథను నమ్మి ఈ చిత్రం చేసే అవకాశం ఇచ్చారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో చిత్రాన్ని అనుకున్నట్టు తీయగలిగా" అన్నారు. నితిన్ మాట్లాడుతూ "మహతీ స్వరసాగర్ నేపథ్య సంగీతం చిత్రానికి పెద్ద బలం. కాసర్ల శ్యామ్, శ్రీమణి మంచి పాటలిచ్చారు. 'ఛలో'తో వెంకీకి, ఈ చిత్రంతో నాకు రష్మిక బ్రేక్ ఇచ్చింది. తనతో కంటే సంపత్ రాజ్‌తో నా కెమిస్ట్రీ బావుందని చాలామంది చెప్పారు. 'అ ఆ'తో నాకు భారీ విజయం అందించిన సంస్థలో మరో విజయం వచ్చింది. ఈ నిర్మాతలతో మరెన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు మహతీ స్వరసాగర్, నటులు 'శుభలేఖ' సుధాకర్, సంపత్‌రాజ్, ఛాయాగ్రాహకుడు సాయిశ్రీరామ్, కళా దర్శకుడు సాహి సురేశ్, గేయ రచయితలు కాసర్ల శ్యామ్, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ హీరోలను అప్రోచ్ అవుతా

- సుబ్బు వేదుల



"స్టార్స్‌తో సినిమా చేయాలని ప్రతి దర్శకుడికీ ఉంటుంది. మొదట దర్శకుడిగా ప్రూవ్ చేసుకుని ఆ తర్వాత స్టార్ హీరోలను నా కథలతో అప్రోచ్ అవుతా" అని సుబ్బు వేదుల అన్నారు. అభిరామ్ వర్మ, కృతిగార్గ్ జంటగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'రాహు'. ఎ.వి.ఆర్ స్వామి, శ్రీశక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మాతలు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ ద్వారా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. "నా స్వస్థలం విశాఖపట్నం. న్యూయార్క్ యూనివర్సిటీలో ఫిల్మ్ కోర్స్ చేశా. కోన వెంకట్‌తో సాన్నిహిత్యం ఉంది. కొన్ని కారణాల వల్ల మా కాంబినేషన్‌లో 'గీతాంజలి 2' ప్రారంభం కాలేదు. కానీ నా ప్రయత్నాలు ఆపలేదు. దర్శకుడిగా 'రాహు' నా తొలి సినిమా. ఒక అమ్మాయికి రక్తం చూసినప్పుడు షాక్‌కి గురై, ఒత్తిడికి లోనవుతుంది. అలాంటి అమ్మాయి జీవితంలో రాహు ప్రవేశిస్తే ఏం జరిగింది. అన్నది థ్రిల్లింగ్‌గా చెబుతున్నాం. న్యూ ఏజ్ స్టోరీ ఇది. కథ మీద నమ్మకంతో నేను కూడా నిర్మాణంలో భాగస్వామినయ్యా. కృతి గార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్, చలాకీ చంటి, గిరిధర్, సత్యం రాజేష్ పాత్రలు ఆకట్టుకుంటాయి. డెఫినెట్‌గా మంచి సినిమా అవుతుంది. చంద్రశేఖర్ ఏలేటి నా అభిమాన దర్శకుడు. ఓ స్టార్ హీరో కోసం 'మృగం' అనే స్క్రిప్ట్ సిద్ధం చేశా" అని సుబ్బు తెలిపారు.


సంధ్యారాణి, మోహన్ కందా, రమణాచారి, రావి కొండలరావు

# ఇది నాకెంతో సంతోషం

- రావి కొండలరావు

నాలుగు వందలకుపైగా చిత్రాలలో పాత్ర పోషణ చేసిన నటుడిగా, పత్రికా సంపాదకుడిగా, రచయితగా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు రావి కొండలరావు. ఆయనపై 'ప్రత్యేక పోస్టల్ కవర్' తాజాగా విడుదలైంది. మంగళవారం హైదరాబాద్ అబిడ్స్ తపాలా కార్యాలయంలో ఆ కవర్‌ను తెలంగాణా సర్కిల్ ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ సంధ్యారాణి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు కె.వి.రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావి కొండలరావు మాట్లాడుతూ "మా నాన్న తపాలాశాఖలో పనిచేశారు. నేను ఆడిన నాటకాలు ఆయన చూసేవారు. కానీ ఆ సమయంలో నేను ఎంచుకున్న దారి ఆయనకు నచ్చేది కాదు. ఓసారి మా ఊళ్లో నాటకం ఆడుతుంటే అందులో నన్ను గుర్తించక 'ఈ కుర్రాడు ఎవరో బాగా చేస్తున్నాడు' అని స్నేహితుడితో అన్నారట. 'మీ కొండలరావే' అని ఆయన చెప్పగా స్టేజ్ మీదకు వచ్చి తల మీద మొట్టికాయలు వేస్తూ ఇంటికి తీసుకెళ్లారు. నాపై ఇవాళ ఓ ప్రత్యేక తపాలా కవర్ రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని భావోద్వేగంతో అన్నారు. తెలంగాణా సర్కిల్ ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ సంధ్యారాణి మాట్లాడుతూ "రావి కొండల రావుగారి తండ్రి చిదంబరం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి 1940లో రిటైర్ అయ్యారు. కొండలరావు మా తపాలా కుటుంబ సభ్యుడే" అని చెప్పారు. "రావి కొండలరావు నాటకాలు చూసి స్ఫూర్తి పొందేవాణ్ణి. ఆయన రాసిన ఎన్నో కథలు చదివా. ఆయన రచనా శైలి ఎంతోమందికి స్ఫూర్తి. ఏ రంగంలో అయినా ఉత్తమ ప్రతిభ కనబర్చినవారికి బతికుండగా అవార్డులు ఇస్తే వారి ఆయుర్దాయం పెరుగుతుంది" అని .రమణాచారి అన్నారు. "భార్యాభర్తలు కలిసి సినిమాల్లో నటించడం అరుదుగా జరుగుతుంది. రావి కొండలరావు దంపతులు నిజ జీవితంలో కలిసి జీవిస్తూ, సినిమాల్లో కూడా నటించి అలరించారు. ఆయనపై మిత్రులు ఓ ప్రత్యేక కవర్ రూపొందించి, తపాలా శాఖ ద్వారా విడుదల చేయడం ఆనందంగా వుంది" అని విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా కొనియాడారు. రావికొండలరావు స్నేహితులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి, అబిడ్స్















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,281.20 | 11,797.90 | 42,808 | 48,055 | 71.85 | 56.09 |
| 82.03 | 31.50 | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) 782 | 980 | (13 పైసలు) | |



# 'కరోనా' కొనసాగితే ఏం చేయలేం!

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ముడి ఔషధ నిల్వలు 3-4 నెలలకు సరిపోవచ్చు
- ఇప్పుడే చర్యలు చేపట్టి నిల్వలు కాపాడుకోవాలి
- బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా

కరోనా వైరస్ కొనసాగితే ప్రపంచానికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఔషధాలు, ఏపీఐ, ఇంటర్మీడియట్స్ లభ్యతపై ప్రభుత్వం స్పష్టమైన విధాన చర్యలు తీసుకోవాలి. లేదంటే భారత్‌కు సంక్షోభ పరిస్థితులు తప్పవని బయోకాన్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ మజుందార్ షా హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బంది లేదని, కంపెనీల వద్ద యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియెంట్లు (ఏపీఐ), ఇంటర్మీడియట్స్ నిల్వలు ఉన్నాయని.. అవి నిండుకునే వరకూ వేచి చూడొద్దన్నారు. దేశీయంగా ఔషధాల కొరత రాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలన్నారు. బయో ఏషియా సదస్సుకు విచ్చేసిన ఆమె 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో మాట్లాడారు. అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ఔషధ రంగానికి ఊతమివ్వడానికి ఫార్మాస్యూటికల్ విధానాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆమె ఏమన్నారంటే..

**కరోనా ప్రభావం కొనసాగితే.. దేశీయంగా ఔషధాలకు కొరత ఏర్పడే అవకాశం ఉందా?**

దేశంలోని దాదాపు అన్ని ఔషధ కంపెనీలు 70 శాతం వరకూ చైనా నుంచి ఏపీఐలు, ఇంటర్మీడియట్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. ముడి ఔషధాలకు మనం భారీగా చైనాపై ఆధారపడి ఉన్నాం. చైనాకు ఎగుమతులు, దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. చైనాలో పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయి. ప్రస్తుతానికి దేశీయంగా ఔషధాలకు కొరత లేదు. అయితే, ముడి ఔషధాలకు కొరత ఏర్పడితే ఎదురయ్యే పరిణామాలను అధిగమించడానికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకోకపోతే, ఔషధాల తయారీలో సంక్షోభం ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయి. నిల్వలు, అవసరాలు, సామర్థ్యాలపై డేటాను సమకూర్చుకోవాలి. ఏపీఐలు, ఇంటర్మీడియట్స్‌పై ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వద్ద డేటా ఉంది. కొద్దోగొప్పో ఫార్మాగ్జిల్ డేటాను అందించగలదు. డేటాను విశ్లేషించాలి. ఎదురవుతున్న నిజమైన రిస్క్‌ను అంచనా వేయాలి.

**ప్రాణాధార ఔషధాల ఎగుమతులపై నిషేధం విధించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిపై ఏమంటారు?**

ఎగుమతుల నిషేధం వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు డేటాను బాగా విశ్లేషించడం మంచిది. క్లోరాంఫినికాల్, నియోమైసిన్ వంటి యాంటీబయోటిక్స్, కొన్ని విటమిన్లు, హార్మోన్లు తదితర 12 రకాల ప్రాణాధార ఔషధాల ఎగుమతులపై నిషేధించాలన్న యోచన ఉంది. వీటిలో కొన్నింటి ఉత్పత్తిలో పరిశ్రమ సమగ్ర ఉత్పత్తి వ్యవస్థను కలిగి ఉంది. రిస్క్‌ను కచ్చితంగా అంచనా వేసి నిజంగా దేశీయంగా కొరత ఏర్పడుతుందనుకుంటే ఎగుమతులను నిషేధించడంలో తప్పులేదు. నిజానికి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎగుమతులను, సామర్థ్యాలను పెంచి చైనాకు పోటీ ఇవ్వాలి.

**కంపెనీల వద్ద ఉన్న ఏపీఐ, ఇంటర్మీడియట్స్ నిల్వలు ఎన్ని రోజులకు సరిపోతాయి?**

కంపెనీల వద్ద ఉన్న ముడి ఔషధాల నిల్వలు 3-4 నెలలకు వచ్చే వీలుంది. నిల్వలు అయిపోయే వరకూ వేచి చూడకూడదు. 3-4 నెలల్లో అంతా సద్దుమణుగుతుందన్న సానుకూల ధోరణిలో ఉండడం మంచిది కాదు. ప్రమాదం ముంచుకొస్తే.. అప్పుడు ఏం చేయలేని పరిస్థితి ఉంటుంది. కరోనా వైరస్ కొనసాగితే.. ప్రపంచానికి సంక్షోభం తప్పదు. ప్రభుత్వం నుంచి విధానపర మద్దతు అవసరం. ఈ పరిస్థితులను ఒక అవకాశంగా తీసుకుని చైనాకు మనం కోల్పోయిన మార్కెట్‌ను మళ్లీ చేజిక్కించుకోవాలి.

**ఔషధ పరిశ్రమ ఎలాంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది?**

ధరల నియంత్రణ, అరకొర సబ్సిడీలనే పొందడం వంటి అనేక ప్రతికూల పరిస్థితులను దేశీయ ఔషధ పరిశ్రమ ఎదుర్కొంటోంది. దీర్ఘకాలంగా ఔషధ పరిశ్రమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భారీగా ఉద్యోగావకాశాల కల్పన, పెట్టుబడులకు అవకాశం ఉన్న పరిశ్రమ, ఎగుమతులను పెంచడంతోపాటు దిగుమతులకు ప్రత్యామ్నాయాలను తయారు చేయగల సామర్థ్యాలున్న రంగం. వీటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. పరిశ్రమను బలోపేతం చేయాలి. ప్రపంచానికి భారత్‌ను నిజమైన ఫార్మసీగా తీర్చిదిద్దాలి. పరిశ్రమ సవాళ్లను పరిష్కరించి వృద్ధి, విస్తరణకు మార్గం సుగమం చేయాలి. చైనాకు పోటీగా ముడి ఔషధాలను తయారు చేయడానికి చాలా కాలం నుంచి పరిశ్రమ సబ్సిడీలను కోరుతోంది. ప్రభుత్వం మాత్రం సహజసిద్ధంగా పోటీపడాలని చెబుతోంది. రెండు దేశాల మధ్య వ్యయపరంగా వ్యత్యాసాలు ఉన్నాయి. వీటిని అధిగమించడం అవసరం. ప్రభుత్వం ఫార్మాస్యూటికల్ విధానాన్ని పునఃపరిశీలించాలి.

*- హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)*

**ఏపీఐలకు కొరత రాకుండా ఏం చేయాలి?**

*ప్రాణాధారమైన ఇంటర్మీడియేట్లను తయారు చేసే అనేక యూనిట్లు పర్యావరణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు లేక ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్లాంట్లు తిరిగి ఉత్పత్తి ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏపీఐ, ఇంటర్మీడియట్స్‌ను తయారు చేయగల సామర్థ్యం మనకు ఉంది. ఎంత త్వరగా ఉత్పత్తిని ప్రారంభించి ఏపీఐలు, ఇంటర్మీడియట్స్‌ను తయారు చేస్తామన్నది ముఖ్యం. లేదంటే చైనా దిగుమతులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఔషధ కంపెనీలు దీన్ని అవకాశంగా తీసుకునే వీలుంది.*



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత పారిశ్రామిక దిగ్గజాలు

# అమెరికాలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి..

## నిబంధనలను మరింత సడలిస్తాం.. భారత కార్పొరేట్లకు ట్రంప్ హామీ

న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారత పారిశ్రామిక ప్రతినిధులను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. వారి ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే విదేశీ పెట్టుబడులకు నిబంధనలను మరింత సడలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. "మీ అందరికీ నా ధన్యవాదాలు. మీరు సాధించిన విజయాలకు నా అభినందనలు. మీరంతా అమెరికా మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెడతారని ఆశిస్తున్నా. నేను వాటిని పెట్టుబడులుగా కాకుండా మా మార్కెట్లో మీరు కల్పించబోయే ఉద్యోగాలుగా చూస్తా"నని ట్రంప్ పేర్కొన్నారు. ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయంలో మంగళవారం ట్రంప్‌తో భారత కార్పొరేట్ సారథుల ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

అమెరికా మార్కెట్లో తమ కంపెనీలు కొనసాగిస్తున్న వ్యాపారాలు, ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులపై భారత కార్పొరేట్ ప్రముఖులు ఈ సందర్భంగా ట్రంప్‌కు తెలియజేశారు. అయితే, నియంత్రణపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తపరిచారు. ఇందుకు ట్రంప్ స్పందిస్తూ.. "చట్టబద్ధమైన ప్రక్రియలో భాగంగా మీరు కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. అయితే, చాలా నిబంధనలను సడలిస్తున్నాం. త్వరలోనే మీరు మార్పు గమనిస్తారు. పరిస్థితి మరింత మెరుగుపడనుంద"న్నారు. అమెరికా, భారత కంపెనీలు ఒకరి దేశంలో మరొకరు పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని ట్రంప్ అన్నారు.

**అంబానీ.. భేష్!**

రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీని ట్రంప్ ప్రశంసించారు. 4జీ సేవలతో భారత టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులకు తెరలేపడంతోపాటు అమెరికా ఇంధన రంగంలో వ్యూహాత్మక పెట్టుబడులకు గాను ఆయన్ని అభినందించారు. "మీరు గొప్ప పని చేశారు. ధన్యవాదాలు" అని ట్రంప్ పేర్కొన్నారు. వారి దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరారు. ట్రంప్, అంబానీ మధ్య పలు అంశాలపై జరిగిన సంభాషణ..

**అంబానీ:** అమెరికా ఇంధన రంగంలో ఇప్పటి వరకు 700 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాం.

**ట్రంప్:** 700 కోట్ల డాలర్లంటే చాలా పెద్ద మొత్తం.

**ట్రంప్:** ప్రస్తుతం 4జీ సేవలందిస్తున్నారు. మరి 5జీ సేవలూ అందిస్తారా..?

**అంబానీ:** చైనా యంత్ర పరికరాల తయారీదారు సాయం లేకుండా ప్రపంచంలో టెలికాం సేవలందిస్తున్న ఏకైక సంస్థ రిలయన్స్ జియోనే.

**ట్రంప్:** మంచిది. అలాగే కొనసాగించండి.

**అంబానీ:** మీరు పన్నులు తగ్గించడంతో అమెరికా పెట్టుబడులకు మరింత ఆకర్షణీయంగా మారింది. మీ విధానాల ప్రభావంతో మా దేశంలోనూ కార్పొరేట్ పన్ను తగ్గించారు.

**ట్రంప్:** ఈ విషయంలో భారత్ అమెరికా బాటను అనుసరించింది.

**పరిమిత వాణిజ్య ఒప్పందానికి తుది రూపం: గోయల్**

అమెరికా- భారత్ మధ్య పరిమిత వాణిజ్య ఒప్పందం తుది రూపం దిద్దుకుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మున్ముందు సమగ్ర వాణిజ్య ఒప్పందంపై ఇరు వర్గాలు కసరత్తు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## 2022 నాటికి శ్రీసిటీ ప్లాంట్ పూర్తి

» బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్

చెన్నై : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో కొత్త ప్లాంట్‌పై తొలిదశలో రూ.120 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బీ.త్యాగరాజన్ తెలిపారు. మూడు దశల్లో ఈ ప్లాంట్‌ను 2022 నాటికి పూర్తి చేయనున్నట్టు చెబుతూ స్థానికంగా అందుబాటులో ఉన్న పన్ను ప్రయోజనాలు పొందడానికి శ్రీసిటీ భాగస్వామ్యంలో ఒక అనుబంధ సంస్థ ఏర్పాటు చేసే ఆస్కారం ఉందన్నారు. దీని ఉత్పత్తి సామర్థ్యం 5 లక్షల యూనిట్లుంటుందని చెప్పారు. ఇది దక్షిణాది రాష్ట్రాల అవసరాలు తీర్చుతుందంటూ దీనివల్ల లాజిస్టిక్ వ్యయాలు నాలుగు శాతం మేరకు ఆదా చేసుకోగలుగుతామని ఆయన తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ డి, క్యు, వై శ్రేణికి చెందిన కొత్త ఎయిర్ కండిషనర్లు మార్కెట్‌లోకి విడుదల చేశారు. వీటి ధర రూ.31,990 నుంచి ప్రారంభం కానుంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)

| | |
|---|---|
| 25వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 310 |
| 26వ తేదీకి.. | |
| చిత్తూరు | 383 |
| గోదావరి | 330 |
| విజయవాడ | 330 |
| విశాఖపట్నం | 375 |
| వరంగల్ | 313 |
| డజను గుడ్లు రూ. 60 | |

**ఫామ్‌గేట్ ధర** (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 50 | విజయవాడ | 55 |
| వరంగల్ | 50 | గుంటూరు | 55 |
| మహబూబ్‌నగర్ | 50 | ఒంగోలు | 55 |
| కరీంనగర్ | 50 | చిత్తూరు | 50 |
| కర్నూలు | 50 | నెల్లూరు | 50 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 51 |
| గోదావరి | 44 | | |

**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 43,070 | 43,200 | 44,040 | 43,150 | 42,970 |
| క్రితం ముగింపు | 43,130 | 44,000 | 44,910 | 43,800 | 43,740 |
| 22 క్యారెట్లు | 41,000 | 40,000 | 40,510 | 39,820 | 40,920 |
| క్రితం ముగింపు | 41,020 | 40,750 | 41,310 | 40,000 | 41,660 |
| వెండి (కిలో) | 47,900 | 49,500 | 49,200 | 48,900 | 52,400 |
| క్రితం ముగింపు | 48,900 | 51,000 | 50,500 | 49,400 | 53,300 |



ప్రపంచబ్యాంకు ప్రతినిధి షెర్‌బర్న్ బెంజ్‌ను సత్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

» ఆరోగ్యం, విద్యా రంగాల్లో మీ చర్యలు స్ఫూర్తిదాయకం

» ప్రపంచబ్యాంకు ప్రతినిధుల ప్రశంస

# అమరావతిలో సౌకర్యాల్లేవు

## ఎకరా అభివృద్ధికి కోట్లు ఖర్చు
## విశాఖ నంబర్ వన్ సిటీ: ముఖ్యమంత్రి

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అన్ని ప్రాంతాలకూ సమ న్యాయం కోసం పాలన వికేంద్రీకరణకు నిర్ణయించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారమిక్కడ సచివాలయంలో ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందం ఆయనతో సమావేశమైంది. అమరావతి ప్రాంతం అటు విజయవాడకూ, ఇటు గుంటూరుకూ దూరంగా ఉందని.. పైగా ఇక్కడ డ్రైనేజీ, కరెంటు లాంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడానికే కనీసం రూ.2 కోట్లు ఎకరాకు ఖర్చవుతుందని, మౌలిక సదుపాయాల కోసం రూ.1.09 లక్షల కోట్లు వ్యయమవుతాయని గత ప్రభుత్వమే అంచనా వేసిందని సీఎం ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీసుకున్న పాలనాపరమైన నిర్ణయాలను ఆయన వివరించారు. 'రాజధానికి గత ఐదేళ్ల కాలంలో రూ.5,674 కోట్లే ఖర్చు చేశారు. మరో రూ.3 వేల కోట్ల బిల్లులను బకాయిపెట్టారు. ఏటా రూ.6-7 వేల కోట్లే ఖర్చుపెడితే రాజధాని ఎప్పటికి పూర్తవుతుంది? ఖర్చు చేయాల్సిన రూ.1.09 లక్షల కోట్లలో ఇది సముద్రంలో నీటి బిందువే. రాష్ట్రంలో విశాఖపట్నం నంబర్ వన్ సిటీ. ఇప్పటికే అన్ని మౌలిక సదుపాయాలూ ఉన్నాయి. అక్కడ పెట్టే ప్రతి రూపాయి ఆ నగర స్థాయిని మరింత పెంచుతుంది. దీని వల్ల పెట్టుబడులు పెట్టేవారు ఆసక్తి చూపిస్తారు. భవిష్యత్‌లో పెద్ద నగరాలతో పోటీ పడే స్థాయికి చేరుకుంటాం' అని తెలిపారు.

**మంచి చదువులతోనే పేదరికం దూరం**

రాష్ట్రంలో సామాజిక అసమానతలను ఏరకంగా అధిగమిస్తారు.. ఇందుకోసం చేస్తున్న ఆలోచనలు ఏమిటని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అడిగారు. పేదరికం నుంచి బయటకు రావాలంటే అది మంచి చదువులు ద్వారానే సాధ్యమని సీఎం పునరుద్ఘాటించారు. కాలేజీలకు వెళ్లకుండా డ్రాప్ అవుట్ అవుతున్న 77 శాతం మంది విద్యార్థులను చైతన్య పరచడం చాలా కీలకమన్నారు. వీరు చదువులు కొనసాగించేందుకు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, విద్యావసతి, నాడు-నేడు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని.. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడుతున్నామని తెలిపారు. సీఎం మాటల్లో, ఆయన ఆలోచనల్లో తమకు పాదయాత్ర ప్రభావం కనిపిస్తోందని ప్రపంచ బ్యాంకు బృందం ఈ సందర్భంగా పేర్కొంది. ఆరోగ్యం, విద్య సహా పలు రంగాల్లో ఆయన తీసుకుంటున్న చర్యలు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించింది. కోట్ల మంది ప్రజలను కలుసుకుని, క్షేత్ర స్థాయిలో చూసిన అనేక సమస్యలకు పరిష్కారంగా తన పరిపాలనలో అనేక మార్పులు తీసుకొచ్చారన్న విషయాన్ని తాము తెలుసుకున్నామని తెలిపింది.

**చివరి ఏడాదిలో లెర్న్ టు లెర్న్!**

చివరి ఏడాదిలో లెర్న్ టు లెర్న్ కార్యక్రమం చేపట్టాలని యోచిస్తున్నట్లు సీఎం ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు తెలిపారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తామని, ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పిస్తామని, డిజిటల్ క్లాసులతో వాటిని అనుసంధానం చేస్తామని.. వారు నేర్చుకోవడమే కాకుండా తమ తల్లిదండ్రులకు వ్యవసాయం సహా ఇతర అంశాల్లో అవసరమైన విజ్ఞానాన్ని పంచడానికి వీటిని వినియోగిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్య కేంద్రాల గురించీ వివరించారు. నైపుణ్య యూనివర్సిటీ పరిధిలో ఈ కేంద్రాలు ఉంటాయన్నారు. అలాగే హైఎండ్ స్కిల్స్ కోసం విశాఖలో ఒకటి, మధ్యాంధ్రలో ఒకటి, రాయలసీమ జిల్లాల్లో ఒక కేంద్రాన్ని మొత్తంగా మూడు సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో టైర్-1 సిటీ లేదని.. ఈ నైపుణ్యాలు అభివృద్ధి చెంది టైర్-1 సిటీతో పోటీపడే పరిస్థితి వస్తుందన్నారు. లేకపోతే కాల్‌సెంటర్లలాంటి వాటికే పరిమితం కావలసి ఉంటుందని తెలిపారు. పాఠ్యప్రణాళికలో తీసుకొస్తున్న మార్పులను, అప్రెంటిస్‌షిప్‌ను తప్పనిసరి చేస్తున్న వైనాన్నీ వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రతినిధులు ప్రశంసించారు. ఒకే చోట కాకుండా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కాలేజీలు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని.. దీని వల్ల, పరిశ్రమలకు హైఎండ్‌స్కిల్స్ కోసం ఏర్పాటు చేస్తున్న సంస్థల వల్ల మరింత మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ భేటీలో ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా హ్యూమన్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ షెర్‌బర్న్ బెంజ్, బ్యాంకు హెల్త్, న్యూట్రిషన్ పాపులేషన్ లీడ్ ఎకనమిస్ట్ డాక్టర్ అజయ్ టాండన్, లీడ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ మోహినీ కక్, సీనియర్ స్పెషలిస్ట్ కార్తీక్ పెంటల్, సీనియర్ స్పెషలిస్ట్ ప్రవేశ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, ఉన్నతాధికారులు ప్రవీణ్ ప్రకాశ్, పీవీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ ప్రయోజనం అందరికీ: సత్య నాదెళ్ల

బెంగళూరు: టెక్నాలజీ ప్రయోజనాలు అందరికీ అందుబాటులో ఉండాలని, అందుకోసం డెవలపర్లు నైతిక విలువలు, విశ్వాస నిర్మాణంపై దృష్టి సారించాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. అలాగే డెవలపర్లు భిన్నత్వం గల టీమ్‌లతో కలిసి పని చేయాలని, అలా చేయడం వల్ల వారు తయారుచేసే కృత్రిమ మేథ నమూనాల్లో తెలియకుండానే ఏదో ఒక మొగ్గు లేకుండా నివారించుకోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సర్వవ్యాప్తం అవుతున్నదని, ప్రజల జీవితాల్లోకి చొచ్చుకుపోతున్నదని, దానికి తోడు కొంత బాధ్యతను కూడా మన మీద పెట్టిందని ఫ్యూచర్ డీకోడెడ్ పేరిట ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. మైక్రోసాఫ్ట్ గణాంకాల ప్రకారం భారత్‌లో 42 లక్షల మంది డెవలపర్లున్నారని, రానున్న కాలంలో అలాంటి మేధస్సు ఉన్న వారికి ఏకైక గమ్యంగా మారనుందన్నారు. ఏదైనా యాప్ రూపొందించుకునే ప్రతీ ఒక్క బ్యాంకు విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి, కస్టమర్ల డేటా పరిరక్షించాలని ఆయన సూచించారు.

## జీఎస్‌టీ ఎగ్గొట్టే వారిని గుర్తించాం..!

» ఆదాయ పన్ను శాఖ సమీక్షలో మంత్రి నారాయణస్వామి

అమరావతి(ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున వ్యాపారం చేస్తూ జీఎస్‌టీని ఎగవేస్తున్న కొంతమంది వ్యాపారులను వాణిజ్య పన్నులశాఖ గుర్తించిందని ఉప ముఖ్యమంత్రి, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి కె నారాయణస్వామి వెల్లడించారు. విజయవాడలోని కమర్షియల్ టాక్స్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జీఎస్‌టీ చట్ట ప్రకారం వైజాగ్‌లో వ్యాపారిపై ఇటీవల కేసు నమోదు చేశామని తెలిపారు. రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ రూ.లక్షల్లో మాత్రమే జీఎస్‌టీ చెల్లిస్తూ వాణిజ్య పన్నుల శాఖను మోసం చేస్తున్న పలువురు వ్యాపారులను అధికారులు గుర్తించినట్లు వివరించారు. వాణిజ్య పన్నులశాఖ అధికారులను విస్తృత తనిఖీలు చేయాలని, విభిన్న కోణాల్లో దర్యాప్తు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2019 మార్చిలో జీఎస్‌టీ ద్వారా రూ.1,800 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది మార్చిలో నెలలో దీనికి అదనంగా రూ.1,000 కోట్ల రెవెన్యూ ఆర్జించాలని అధికారులను ఆదేశించామన్నారు. రిటర్న్స్ ఫైల్ చేయని వారి మీద, టాక్స్‌లను సరిగా కట్టని వారి మీద చర్యలు తీసుకోవటం ద్వారా రూ.100 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించామన్నారు. 2020 జనవరి నెలాఖరి వరకు రూ.36,000 కోట్ల రెవెన్యూ సాధించారన్నారు.

## మళ్లీ నష్టాలే..! సెన్సెక్స్ 82 పాయింట్లు డౌన్

ముంబై: మరిన్ని దేశాల్లో కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటం ఈక్విటీ ట్రేడర్లను కలవర పెడుతోంది. దాంతో మూడోరోజూ దేశీయ స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. మంగళవారం బీఎ స్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ మరో 82.03 పాయింట్లు కోల్పోయి 40,281.20 వద్దకు జారుకుంది. ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ నిఫ్టీ 31.50 పాయింట్లు నష్టపోయి 11,797.90 వద్ద స్థిరపడింది. బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

**ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ ధర రూ.750-755**

ఎస్‌బీఐ కార్డ్స్ తన ఐపీఓ ధరను ప్రకటించింది. ఒక్కో షేరును రూ.750-755 శ్రేణిలో జారీ చేయనుంది. ఈ ఇష్యూ వచ్చే నెల 2న ప్రారంభమై 4న ముగుస్తుంది.

**మాస్టర్ కార్డ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా అజయ్ బంగా**

న్యూయార్క్: మాస్టర్‌కార్డ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా అజయ్ బంగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన సీఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న రిచర్డ్ హెత్నర్‌వెయిట్ త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈయన స్థానంలో బంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## విశాఖ నుంచి స్పైస్‌జెట్ కార్గో సేవలు

విశాఖపట్నం: స్పైస్‌జెట్ విశాఖపట్నం నుంచి సరుకు రవాణా (కార్గో) కోసం ప్రత్యేక విమాన సర్వీసును ప్రారంభించింది. మంగళవారం చెన్నై నుంచి విశాఖకు వచ్చిన స్పైస్‌జెట్ కార్గో విమాన సర్వీస్‌కు వాటర్‌కేనర్ ద్వారా స్వాగతం పలికారు. చెన్నై నుంచి విశాఖ మీదుగా సూరత్, కోల్‌కతాకు ఈ కార్గో సర్వీసును స్పైస్‌జెట్ నడపనుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో చెన్నై నుంచి ఉదయం 11.50 గంటలకు విశాఖ చేరుకుని, మధ్యాహ్నం 1.05 గంటలకు బయలుదేరి సూరత్ మీదుగా తిరిగి చెన్నై వెళ్లనుంది. మంగళ, గురు, శనివారాల్లో చెన్నై నుంచి ఉదయం 11.50 గంటలకు విశాఖ చేరుకుని మధ్యాహ్నం 1.05 గంటలకు బయలుదేరి కోల్‌కతా మీదుగా చెన్నై వెళ్లనుంది. కాగా మెరైన్ కృషి ఉడాన్ పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ విమాన సర్వీసును ప్రారంభించారు.

## గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్

**టెక్ వ్యూ**

నిఫ్టీ ప్రారంభంలో రికవరీ సాధించి 11880 వరకు వెళ్లినా గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్ సాధించి తిరిగి కరెక్షన్‌లో పడింది. 11900 వద్ద విఫలం కావడం వల్ల తక్షణ అప్‌ట్రెండ్‌ను ధ్రువీకరించలేకపోయింది. ఈ పుల్‌బ్యాక్ రికవరీలో నిలదొక్కుకోలేకపోవడం అప్రమత్త సంకేతం. 11800 వద్ద చివరిలో మైనర్ రికవరీ సాధించినా దాని వల్ల చెప్పుకోదగ్గ సూచన ఏమీ లేదు.

**బుధవారం స్థాయిలివే...**

**నిరోధం :** 11870 **మద్దతు :** 11780

- ఇంట్రాడే నిరోధం 11870. సానుకూలత కోసం అంతకన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11930. అలాగే సానుకూల సంకేతం కోసం 11900 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మొత్తం మీద ట్రెండ్‌లో స్పష్టత వచ్చేందుకు మరికొన్ని రోజుల పాటు కన్సాలిడేషన్ అవసరం.
- మైనర్ మద్దతు స్థాయి 11780. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది.

■ వి.సుందర్ రాజా

## మిడ్ సెషన్ నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఫాల్గుణ శుక్ల తదియ
**నక్షత్రం :** ఉత్తరాభాద్ర
**అప్రమత్తం :** మృగశిర, చిత్త, ధనిష్ట నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 3.21**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 12 గంటల వరకు నిలకడగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 2 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి చివరి వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 12 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11840, 11875**

**మద్దతు స్థాయిలు : 11760, 11725**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

## సుప్రీంకోర్టులో ఆరుగురు
# జడ్జీలకు స్వైన్ ఫ్లూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: సుప్రీంకోర్టులోని ఆరుగురు న్యాయమూర్తులకు స్వైన్ ఫ్లూ సోకింది. ఈ విషయాన్ని జస్టిస్ డీవై చంద్రచూడ్ స్వయంగా కోర్టులో చెప్పారు. దీంతో కేసుల విచారణకు ఆటంకం కలిగింది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్ బోబ్డే మంగళవారం ఉదయం సుప్రీం కోర్టు జడ్జీలందరితో ఓ సమావేశం నిర్వహించారు. న్యాయవాదుల సంఘం ప్రతినిధులతోనూ ఈ విషయమై మాట్లాడారు. నివారణ చర్యలపై చర్చించారు. కోర్టు ఆవరణలో అత్యవసరంగా ఓ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని, కోర్టుకు వచ్చే ప్రతి ఒక్కరికీ వాక్సినేషన్ చేయించాలని నిర్ణయించారు. ఒక్కో వ్యాక్సిన్‌కూ రూ 1200 ఖర్చవుతుందనీ, నిధుల కొరత రాకుండా వెంటనే రూ 10లక్షలను ఇందునిమిత్తం కేటాయించారనీ బార్ అధ్యక్షుడు దుష్యంత్ దవే చెప్పారు. ఆరోగ్యం సరిగా లేని వారు, అవసరం లేనివారు సుప్రీంకోర్టుకు రావొద్దని జస్టిస్ అరుణ్ మిశ్రా విజ్ఞప్తి చేశారు. బుధవారంనాడు ఆరోగ్య శాఖ ప్రతినిధులు సుప్రీంకోర్టును సందర్శించి గురువారం నాడు తాత్కాలిక డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తారు. కోర్టు వర్గాల సమాచారం ప్రకారం- కోర్ట్ నెంబర్ 3లో ఉండే రాజ్యాంగ ధర్మాసనంలో ఒకరైన జస్టిస్ ఇందిరా బెనర్జీ గైర్హాజరయ్యారు.

## ప్యాకింగ్ లేని స్వీట్లపైనా గడువు తేదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ప్యాకింగ్ లేని స్వీట్లపై ఈ జూన్ 1 నుంచి మిఠాయి దుకాణ దారులు గడువు తేదీ, ఆ స్వీట్లు తయారైన తేదీని ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ మేరకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసింది.

## టికెట్ రద్దు చార్జీల ద్వారా రైల్వేకు 9వేల కోట్లు

కోట(రాజస్థాన్), ఫిబ్రవరి 25: టికెట్ రద్దు చార్జీలు, వెయిటింగ్ లిస్టులో ఉండి రద్దు కాని టికెట్ల ద్వారా రైల్వేశాఖ 2017-20 మధ్య రూ.9 వేల కోట్లు ఆర్జించింది. కోటకు చెందిన ఆర్టీఐ కార్యకర్త సుజిత్ స్వామి చేసుకున్న దరఖాస్తు మేరకు రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ వివరాలు వెల్లడించింది.

## సజీవంగా తగులబెట్టేస్తాం.. జడ్జికి బెదిరింపు

కొచ్చి, ఫిబ్రవరి 25: సజీవంగా తగులబెట్టేస్తామంటూ కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ సురేశ్‌కుమార్‌కు బెదిరింపు లేఖ వచ్చింది. ఓ చర్చి వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అధికారులకు ఆయన తగిన ఆదేశాలు ఇచ్చినందుకే ఈ లేఖ వచ్చినట్లు అనుమానిస్తున్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

- తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురి మృతి

రాంనగర్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డాలస్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన దంపతులు, ఏపీకి చెందిన వారి స్నేహితుడు మృతిచెందారు. గవిని రాజా, దివ్య దంపతులు తమ కుమార్తెను డ్యాన్స్ క్లాస్‌లో వదిలిపెట్టి, వారు కట్టుకుంటున్న ఇంటిని చూసి తిరిగి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రాజా స్నేహితుడు ప్రేమ్‌నాథ్ కూడా ప్రమాదంలో మరణించారు. వీరి కారును పదహారేళ్ల కుర్రాడు నడుపుతున్న వాహనం ఢీకొట్టింది. రాజా, దివ్య, ప్రేమ్‌నాథ్ ముగ్గురూ ఘటనా స్థలంలోనే మృతిచెందినట్లు సమాచారం. పుట్టినరోజు నాడే దివ్యను మృత్యువు మింగేసింది. రాజా, దివ్యలకు రియా అనే కుమార్తె(7) ఉంది. ప్రేమ్‌నాథ్ ఏపీలోని గుంటూరుకు చెందినవారు. హైదరాబాద్ గాంధీనగర్‌లో నివసిస్తున్న దివ్య తండ్రి ఆవుల గౌతమ్‌బుద్ధ, మేనమామ తుమ్మల రాఘవరావుల సమాచారం మేరకు... 2007లో రాజా, దివ్యల వివాహం జరిగింది. అనంతరం అమెరికా వెళ్లిపోయారు. దివ్య డాలస్‌లోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో, రాజా ప్రముఖ సంస్థ వెల్స్ ఫార్గోలో పనిచేస్తున్నారు. డాలస్‌లోనే వారు ఇల్లు కట్టుకుంటున్నారు. దీంతో అదే నగరంలో ఉంటున్న ప్రేమ్‌నాథ్ ఇంట్లో ఉంటున్నారు. ఆయన ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7-8 గంటల ప్రాంతంలో వారు ముగ్గురూ కలిసి రియాను డ్యాన్స్ క్లాస్ వద్ద దింపారు. కారును దివ్య నడుపుతున్నారు. ఈ క్రమంలో స్కూల్ జోన్ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న ఫోర్డ్ 150 ట్రక్ ఢీకొంది.

# బండి, పెన్నాకు సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ తెలుగు రచయిత బండి నారాయణస్వామి మంగళవారం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. రాయలసీమ జీవితాలపై ఆయన రచించిన 'శప్తభూమి' నవలకు 2019కి గాను గత డిసెంబరులో అకాడమీ అవార్డు ప్రకటించిన సంగతి తెలిసిందే. సంస్కృత విభాగంలో "ప్రజ్ఞాచక్షుసం" కావ్య రచనకు అవార్డును రచయిత పెన్నా మధుసూదన్ స్వీకరించారు. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబారా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. అవార్డు కింద తామ్రపత్రం, రూ. లక్ష నగదును అందజేశారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన నారాయణస్వామి 40కుపైగా రచనలు చేశారు. ఆయన రచించిన "మీరాజ్యం మీరేలండి", 'రెండు కలల దేశమ్', 'గద్దలాడ తండాయి' నవలలు ప్రాచుర్యం పొందాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన పెన్నా మధుసూదన్.. రవ్వా శ్రీహరి, పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి ప్రముఖుల వద్ద శిష్యరికం చేశారు. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని కవికులగురు కాళిదాస్ సంస్కృత వర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

### సీమ అస్తిత్వం కోసమే శప్తభూమి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉంది. రాయలసీమకూ తనకంటూ ఒక భాష, యాస, చరిత్ర ఉన్నదన్న విషయాలను తెలియజేయాలన్న ఉద్దేశంతో ఇది రాశాను.

- నారాయణస్వామి

### ప్రోత్సాహమిచ్చిన అవార్డు

"ప్రజ్ఞాచక్షుసం" కావ్యంలో మహారాష్ట్రంలోని నిర్ధీర కుటుంబంలో జన్మించిన ఒక గొప్ప మహాత్ముని జీవితాన్ని 850 శ్లోకాల్లో రచించాను. ఈ అవార్డుతో నాకెంతో ప్రోత్సాహం లభించింది.

- పెన్నా



అవార్డు అందుకుంటున్న బండి నారాయణస్వామి; పురస్కారం అందుకుంటున్న పెన్నా మధుసూదన్



ఢిల్లీలో రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు



ఓ వ్యక్తిని చుట్టుముట్టి చితకబాదుతున్న దృశ్యం (న్యూయార్క్ టైమ్స్ చిత్రం)



జఫ్రాబాద్‌లో శాంతియాత్ర చేస్తున్న మసీదు ఇమామ్, శాంతి కమిటీ సభ్యులు

# రాజధానిలో రణరంగం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: రోడ్లపై ఎక్కడ చూసినా దట్టమైన పొగ! గుంపులు గుంపులుగా యువకులు! రాళ్లు విసిరేవాళ్లు కొందరు! గాజు సీసాలు విసిరేవాళ్లు మరికొందరు! షాపులను ధ్వంసం చేశారు! రోడ్లపక్కన నిలిపి ఉంచిన కార్లు, ద్విచక్ర వాహనాలను తగులబెట్టారు! చంపేస్తామంటూ స్థానికులను హెచ్చరించారు! పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఈశాన్య ఢిల్లీలో మంగళవారం కూడా హింస కొనసాగింది. ఈ ఆందోళనల్లో మృతుల సంఖ్య 13కు పెరిగింది. సోమవారం జరిగిన హింసలో కానిస్టేబుల్ సహా నలుగురు మరణించగా.. మంగళవారం మరో తొమ్మిది మంది చనిపోయారు. వీరిలో నలుగురు ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే చనిపోయారని జీటీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. గత 24 గంటల్లో మొత్తం 200 మందికిపైగా క్షతగాత్రులు ఆస్పత్రిలో చేరారని వివరించారు. వీరిలో సగం మందికి బుల్లెట్ గాయాలయ్యాయని చెప్పారు. వీరిలో 56 మంది పోలీసులు ఉన్నారు. ఇక, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపైనా ఆందోళనకారులు పిడిగుద్దులు కురిపించారు. పలువురు జర్నలిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. కొందరి పరిస్థితి విషమంగా ఉంది. హింసాత్మక అల్లర్ల కారణంగా ఈశాన్య ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆందోళనకారులు గోకుల్‌పురిలో రెండు అగ్నిమాపక శకటాలను ధ్వంసం చేశారు. విద్వేష వ్యాఖ్యలు చేశారు. మౌజాపూర్‌లో వాహనాలను తగులబెట్టారు. పాదచారులపై రాళ్లు విసిరారు. ఈ-రిక్షాలు, ఇతర వాహనాలను ధ్వంసం చేశారు. వీధుల్లో ఎక్కడ చూసినా రాళ్లు, ఇటుకలు, కాల్చిన టైర్లు కనిపించాయి. కొన్ని దశాబ్దాలుగా దేశ రాజధానిలో కనిపించని ఘటనలు సోమ, మంగళవారాల్లో చోటు చేసుకున్నాయి. ఆగ్రహావేశాలతో ఊగిపోయిన యువకులు చేతుల్లో కర్రలు, రాడ్‌లు, రాళ్లు పట్టుకుని వీరంగం చేశారు. చాంద్‌బాగ్‌లో మంగళవారం సాయంత్రం కూడా హింస చెలరేగింది. ఆందోళనకారులు షాపులను తగులబెట్టారు. ఓ బేకరీ, పండ్ల దుకాణాలకు నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి పారా మిలటరీ బలగాలను మోహరించారు. పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించినా ఉపయోగం లేకపోయింది. మౌజ్‌పూర్-బాబార్‌పూర్ మెట్రో స్టేషన్ రణరంగాన్ని తలపించింది. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు రాళ్ళు, పెట్రోలు బాంబులు విసురుకున్నారు. పరస్పరం కాల్పులు జరుపుకొన్నారు. కారావాల్ నగర్‌లో ఇళ్లపై నుంచి పారా మిలటరీ బలగాలపై యాసిడ్ దాడులు చేశారు. దాంతో, మౌజాపూర్, జఫ్రాబాద్, చాంద్‌బాగ్, కారావాల్ నగర్ తదితర ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. యమునా విహార్లో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, బయటకు రావద్దని స్పీకర్లలో హెచ్చరికలు జారీ చేశారు. ఈశాన్య ఢిల్లీకి వెళ్లే మూడు సరిహద్దులను పోలీసులు సీల్ చేశారు. జఫ్రాబాద్ రోడ్లను ఖాళీ చేయించారు. పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించారు. ఈశాన్య ఢిల్లీ నుంచి ఘజియాబాద్ వెళ్లే రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బుధవారం కూడా సెలవు ప్రకటించారు.

### రెచ్చగొట్టే వ్యాఖ్యలొద్దు

#### అమిత్ షా సమావేశంలో తీర్మానం

ఈశాన్య ఢిల్లీలో హింస కొనసాగుతుండడంతో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్, ఢిల్లీ పోలీసు చీఫ్ అమూల్య పట్నాయక్ తదితరులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. తమకు తగినంత మంది బలగాలు లేవని, హింస పెరగడానికి ఇదే కారణమని అమిత్ షాకు అమూల్య పట్నాయక్ తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో శాంతిని పునరుద్ధరించడానికి రాజకీయ పార్టీల నేతలు చేతులు కలపాలని సమావేశంలో తీర్మానించారు. కాగా, పార్టీలకతీతంగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని, సంయమనం పాటించాలని అమిత్ షా పిలుపునిచ్చారు. రెచ్చగొట్టే ప్రకటనలు, ప్రసంగాలు మానుకోవాలని కోరారు. రెచ్చగొట్టే ఘటనలను ప్రసారం చేయవద్దని చానళ్లకు కేంద్రం సూచించింది.

### కపిల్ మిశ్రా వ్యాఖ్యలే..

సీఏఏపై జరుగుతున్న హింసను తూర్పు ఢిల్లీ బీజేపీ ఎంపీ గౌతం గంభీర్ ఖండించారు. తమ పార్టీ నేత కపిల్ మిశ్రా సహా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక, కపిల్ మిశ్రా వ్యాఖ్యలే హింసకు కారణమంటూ సీపీఎం నేత బృందా కరత్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు.



విజయవాడలో అమరావతి జేఏసీ ర్యాలీ



మందడంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్రపటాలతో అమరావతిని రక్షించాలంటూ నినాదాలు చేస్తున్న మహిళలు



రాజధానిలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల కాపీలను దహనం చేస్తున్న మందడం మహిళలు

# ఇంత ఏకపక్ష నిర్ణయమా?

- భూములిచ్చిన మాతో చర్చించరా?
- న్యాయం అడిగితే కేసులు పెడతారా
- నినదించిన రైతులు, మహిళలు
- 70వ రోజుకు చేరుకున్న ఆందోళనలు
- 'ప్లీజ్ ట్రంప్, సేవ్ అమరావతి' ప్లకార్డులతో వినూత్న నిరసనలు

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): "రాజధానికోసం భూమిలిచ్చి త్యాగంచేసిన మాతో కనీసం సంప్రదించకుండానే ఏకపక్షంగా మూడు రాజధానులపై నిర్ణయం తీసుకుంటారా? ఇదేమిటని ప్రశ్నిస్తే కేసులు పెడతారా? గుండెలు మండుతున్నాయ్! ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి. చివరి రక్తపు బొట్టువరకు అమరావతి కోసం పోరాడుతాం" అంటూ రాజధాని రైతులు, మహిళలు నినదించారు. అమరావతిని కొనసాగించాలనే డిమాండ్‌తో రైతులు చేస్తున్న ఆందోళనలు మంగళవారం 70వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించగా, వెలగపూడి, కృష్ణాయపాలెం తదితర ప్రాంతాల్లో రైతులు ధర్నాలు, 24 గంటల రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఎన్ని కుట్రలు చేసినా తమలో చీలిక తేలేరని దళిత మహాసేన నేతలు తేల్చి చెప్పారు. మందడంలోని ప్రధాన రహదారిలోని మసీదు ఎదురుగా ఏర్పాటు చేసి దీక్షా శిబిరాన్ని మార్చుచేసి పాత శిబిరం వద్దకు చేర్చారు. సీఎం సచివాలయానికి వచ్చి వెళ్లే సమయంలో సెక్యూరిటీ సమస్య ఉందని కొత్త శిబిరంలో నిరసనలు వ్యక్తం చేయరాదని పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో పాత శిబిరంలోనే నిరసనలు కొనసాగించారు. అధికారులు తీరు మార్చుకొని తమకు న్యాయం చేయాలని రాయపూడి రైతులు, మహిళలు మోకాళ్లపై నిలబడి వేడుకున్నారు.

### ప్లీజ్ ట్రంప్, సేవ్ అమరావతి!

ట్రంప్ భారత్ పర్యటన నేపథ్యంలో రైతులు, మహిళలు ట్రంప్ ఫొటోతో కూడిన ప్లకార్డులను పెట్టుకొని అమరావతికి మద్దతు ఇవ్వాలని నినాదాలు చేశారు. 'ప్లీజ్ ట్రంప్ సేవ్ అమరావతి' అని నినదించారు. సీఎం జగన్ ఆర్థిక ఉన్మాదిలా వ్యవహిస్తున్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. మందడంలో మహిళలు, రైతులు చేస్తున్న దీక్షకు సంఘీభావం ప్రకటించారు. సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి మహిళలు రూ.15,000, తెనాలి మండలం కూచిపూడి గ్రామ రైతులు రూ.10,000 విరాళం అందజేశారు. నెల్లూరు జిల్లా కావలి మండలం ముసునూరు గ్రామం తాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీహరి నాయుడు, గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. మందడం, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో రైతు రిలేనిరాహార దీక్షలను ఒంగోలుకు చెందిన ఆచార్య రంగా కిసాన్ సంస్థ రైతు ప్రతినిధుల బృందం సందర్శించి సంఘీభావం తెలిపింది. సంస్థ తరపున రూ.20 వేలను విరాళంగా ఇచ్చారు. రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు వృధా కావని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాన్‌పట్నం రామకృష్ణ పేర్కొన్నారు.





### తుళ్లూరులో నిషేధాజ్ఞలు

#### రూరల్ ఎస్పీ విజయరావు వెల్లడి

గుంటూరు: రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలంలో 144వ సెక్షన్, 30 పోలీస్ యాక్టు విధిస్తున్నట్లు రూరల్ ఎస్పీ విజయరావు మంగళవారం తెలిపారు. కేబినెట్, బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వీవీఐపీ, ప్రజా ప్రతినిధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీటిని అమలు చేస్తున్నామన్నారు. పోలీసు అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేడు విజయవాడలో 24 గంటల నిరాహార దీక్ష

విజయవాడ వన్‌టౌన్: "రాజధాని తరలింపు పేరుతో సీఎం జగన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారు. మూడు రాజధానులపై వెనక్కి తగ్గాలి. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు" అని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ హెచ్చరించారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. బుధవారం విజయవాడ ధర్నాచౌక్‌లో 24 గంటల నిరాహార దీక్ష చేపడతామని జేఏసీ తెలిపింది.

### నేడు హైదరాబాద్‌లో సదస్సు

హైదరాబాద్: అమరావతి రాజధాని రైతుల పోరాటానికి మద్దతుగా బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని రైతాంగ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ తన్నీరు వెంకటేశ్వర్లు మంగళవారం మీడియాకు తెలిపారు.

### రాజధానిలో రైతు అరెస్టు

వేమూరు: తుళ్లూరులో రైతుల ధర్నాను చిత్రీకరిస్తున్న కానిస్టేబుల్‌పై దాడిచేసిన కేసులో ఓ రైతును మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 20 వ తేదీన తుళ్లూరులో జరుగుతున్న రైతుల ధర్నాను కానిస్టేబుల్ నాగూర్‌వలి డ్రోన్ ద్వారా చిత్రీకరిస్తున్నారు. ఆయనపై ఆలూరి వెంకటేశ్వరరావు దాడి చేశారని కేసు పెట్టారు.

#### నా భర్త ఆచూకీ చెప్పండి

"మంగళవారం తెల్లవారుజామున పోలీసులు వచ్చి మా ఇంట్లో సోదా చేశారు. వెంకటేశ్వరరావు ఎక్కడని ఆరా తీసారు. లేరనడంతో వెళ్లిపోయారు. కొద్దిసేపటికే నా భర్తను పోలీసులు తీసుకువెళ్లినట్టు స్థానికులు నాకు చెప్పారు. నోటీసు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారు? ఆయన ఆచూకీ చెప్పండి"

- వెంకటేశ్వరరావు భార్య సరోజినీదేవి

## అమరావతి అంగుళం కదలదు

- స్వామి కమలానంద భారతి



తుళ్లూరు, ఫిబ్రవరి 25: "పార్లమెంటు నుంచి మట్టి, నీరు వచ్చింది. అమరావతి రాజధాని అంగుళం కూడా కదలదు" అని స్వామి కమలానంద భారతి అన్నారు. మందడం, వెలగపూడి రాయపూడి, తుళ్లూరు, పెదపరిమి గ్రామాల్లో జరిగిన ధర్నా కార్యక్రమాల్లో ఆయన మంగళవారం పాల్గొని రైతులు, రైతు కూలీలకు సంఘీభావం తెలిపారు. 'ప్రధాని మోదీ పార్లమెంటు నుంచి నీరు, మట్టి తెచ్చారు. ఆయనే స్వయంగా శంకుస్థాపన చేశారు. ఎవరూ అధైర్యపడొద్దు. పార్టీల గురించి మాకు అవసరంలేదు. మేం సమాజం గురించే మాట్లాడతాం' అని పేర్కొన్నారు. 'అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 13జిల్లాల ప్రజలు కోరుతున్నారు. దేశానికి రెండో రాజధాని అవుతుందనుకుంటే, అలా జరుగుతుందా అని కళ్లు కుట్టి అమరావతి ఇలా అయ్యింది. లాఠీతో కొట్టి, పోలీసులు ఇంటికెళ్లి బాధపడతారు. వారూ మనుషులే, డ్యూటీలో పైవారు చెప్పినట్టు నడుచుకోవాలి. పోలీసు ఉన్నతాధికారులు ఆ పాపం తొలగిపోవటానికి హోమాలు చేసుకుంటున్నారు.' అని కమలానంద అన్నారు.

## మంగళగిరి తరలిన ఉన్నత విద్యామండలి

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా తాడేపల్లిలో కొనసాగుతున్న ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కొత్త భవనంలోకి తరలిపోయింది. బుధవారం నుంచి మంగళగిరి 6వ బెటాలియన్ రోడ్డు(శ్రీరామ్‌నగర్-ఆత్మకూరు గ్రామం)లోని నీలాద్రి టవర్-3,4,5 అంతస్థుల్లో మండలి కార్యకలాపాలు నడుస్తాయి. లీజు ఒప్పందం మేరకు దాదాపు రూ.25లక్షలు అద్దెకింద అడ్వాన్స్ గా చెల్లించిన మండలి, గత డిసెంబరులోనే కొత్తభవనంలోకి తరలించాల్సి ఉంది. రాజధాని తరలింపు నిర్ణయం నేపథ్యంలో కొంత ఊగిసలాడినప్పటికీ ఎట్టకేలకు కొత్త భవనంలోకి మార్చారు.

## బురద చల్లేందుకే యాత్ర

- అది అట్టర్ ఫ్లాప్: మంత్రి కన్నబాబు



సర్పవరం జంక్షన్, గుజరాతీపేట, ఫిబ్రవరి 25: 'సీఎం జగన్ ప్రభుత్వ పాలన చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లేందుకే ప్రజా చైతన్య యాత్ర. ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ఆయనకు పట్టవు. స్వప్రయోజనాల కోసమే యాత్ర. ఇది అట్టర్ ఫ్లాప్ అయింది. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ పనితీరుపై చర్చకు రావాలి' అని మంత్రి కురసాల కన్నబాబు సవాల్ చేశారు. కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలు నమ్మేందుకు ప్రజలెవరూ సిద్ధంగా లేరన్నారు. కుప్పంలో జరిగిన యాత్రలో పట్టుమని పదిమంది లేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నరకాసురుడి పాలన సాగుతుందని చంద్రబాబు పేర్కొనడంపై మండిపడ్డారు. చంద్రబాబువి ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్టు చెప్పే మాటలని అన్నారు. ప్రజలు చైతన్యవంతులుగా మారి టీడీపీని కూకటివేళ్లతో పెకలించి, వైసీపీకి అత్యధిక స్థానాలు అప్పగించిన విషయాన్ని చంద్రబాబు మరచిపోరాదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళంలో మాట్లాడారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని అనుకుంటే ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విశాఖలో రాజధాని ఏర్పాటుచేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఏడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు అన్యాయానికి గురవుతునే ఉన్నారని ధర్మాన అన్నారు.

## జాస్తి కృష్ణకిశోర్
# సస్పెన్షన్ రద్దు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐఆర్ఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు (ఈడీబీ) మాజీ సీఈవో, ఆదాయ పన్ను శాఖ (ఐటీ) కమిషనర్ జాస్తి కృష్ణకిశోర్ విషయంలో జగన్ ప్రభుత్వానికి గట్టి షాక్ తగిలింది. ఆయన సస్పెన్షన్‌ను కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) రద్దు చేసింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తప్పుబట్టింది. అవి చట్టవిరుద్ధమంటూ కొట్టివేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై ఉన్న కృష్ణకిశోర్‌ను వెంటనే ఆదాయ పన్ను శాఖలో చేర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు క్యాట్ చైర్మన్ జస్టిస్ లింగాల నరసింహారెడ్డి, సభ్యులు (పరిపాలన) బీవీ సుధాకర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చింది. అయితే కృష్ణకిశోర్‌పై ఉన్న కేసుల్లో చట్టప్రకారం దర్యాప్తు కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును వాయిదావేసిన సంగతి తెలిసిందే. తన నిర్ణయాన్ని మంగళవారం వెలువరించింది.

### ఒకే వ్యక్తికి ఎన్ని శిక్షలు?

ఈడీబీ సీఈవోగా కృష్ణకిశోర్‌ను తొలగించాక.. మళ్లీ సస్పెండ్ చేసి వేధింపులకు గురిచేయడం ఎందుకని ట్రైబ్యునల్ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని గతంలో విచారణ సందర్భంగా ప్రశ్నించింది కూడా. 'పదోన్నతి వచ్చిందని, మాతృ సంస్థకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్న ఆయన అభ్యర్థనను అంగీకరిస్తే వచ్చే నష్టమేంటి? ఆయన్ను ఇక్కడే ఉంచాల్సిన అవసరం ఏముంది? ఏపీఈడీబీ సీఈవోగా ఆయన్ను ఇప్పటికే తొలగించారు. ఏదో తప్పు జరిగిందనుకుంటే ఆ శిక్ష చాలు. అలాకాకుండా సస్పెండ్ చేశారు. మాతృసంస్థకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఇంతలా ఎందుకు వేధింపులకు గురిచేస్తున్నారు? అధికారం ఉంది కాబట్టి చెలాయిస్తామంటే చట్టం అనుమతించదు. సీఈవోగా డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు వచ్చిన కేంద్ర సర్వీసులకు చెందిన అధికారిని ఎక్స్‌అఫీషియో కార్యదర్శి/డిప్యూటీ సెక్రటరీగా రాష్ట్ర సర్వీసుల్లోకి ఎలా బదిలీ చేస్తారు? ఈ తరహా చట్టవిరుద్ధమైన చర్య తీసుకోవడానికి ఎంత ధైర్యం? సీఈవోగా ఉంటే చర్యలు తీసుకోలేరు కాబట్టి... కక్షసాధించడానికే జీఏడీకి మార్చినట్లున్నారు. అయినా పీవీ రమేశ్(సీఎం కార్యాలయంలో అదనపు సీఎస్) ఎవరు? ఆయనకున్న అధికారాలేంటి? మండలి సీఈవోపై చర్య తీసుకునేందుకు ఆయనెవరు? ఇదేం పరిపాలన! కృష్ణకిశోర్ తప్పుచేశాడని చెబుతున్నారు? ఏంతప్పు చేశారు? సస్పెండ్ చేసి ఏసీబీ/సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాల్సినంత పెద్ద తప్పా అది? ఆయనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి.. ఆయన మాతృసంస్థ ఆదాయ పన్ను శాఖకు సమాచారమిచ్చారా' అని చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని నిలదీశారు కూడా.

### నేపథ్యమిదీ..

జగన్ అక్రమాస్తుల కేసుల్లో.. జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడులకు సంబంధించి.. ఆ సంస్థ ఆస్తులను మదింపు చేసిన అధికారికి కృష్ణకిశోర్ పర్యవేక్షణ అధికారిగా పనిచేశారు. జగతి ఆస్తుల విలువ వారు చెబుతున్నంతగా లేదని నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా సీబీఐ చార్జిషీటు దాఖలుచేసింది. ఆ కక్షతోనే కృష్ణకిశోర్‌పై జగన్ ప్రభుత్వం కత్తిగట్టిందన్న ఆరోపణలొచ్చాయి. వైసీపీ అధికారంలోకి రాగానే.. తనను మాతృసంసకు పంపాలని విజ్ఞప్తి చేసినా రిలీవ్ చేయకుండా.. ఈడీబీ సీఈవోగా తప్పించి.. ఎలాంటి పోస్టింగూ ఇవ్వకుండా.. మే నెల నుంచి వేతనం కూడా చెల్లించకుండా.. చివరకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సీఈవోగా ఉన్నప్పుడు నిధులు దుర్వినియోగం చేశారంటూ కేసులు నమోదుచేయించింది. సీఐడీ, ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించింది. దీనిపై ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. వేతనాలు చెల్లించాలని ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ట్రైబ్యునల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. సీఎస్‌ను తమ ముందుకు పిలిపిస్తామని హెచ్చరించడంతో 2గంటల వ్యవధిలో ప్రభుత్వం వేతనాలు చెల్లించింది.

## ట్రంప్‌కు అనుకూల పవనాలు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో విజయావకాశాలు మెరుగవుతున్నాయి. ఆయనకు అనుకూలంగా పవనాలు వీస్తున్నాయని తాను నిర్వహించిన సర్వేలో తేలిందని గాలప్ నేషనల్ పోల్ అనే సంస్థ తెలిపింది. ఆయనే మళ్లీ అధ్యక్షుడు కావాలని 49 శాతం మంది కోరుకోగా, ఆయనకు వ్యతిరేకంగా 48 శాతం మంది ఓటు వేశారు. గత ఏడాది నిర్వహించిన సర్వేలో ట్రంప్ ఆమోద రేటింగ్ మైనస్ 12 పాయింట్లు ఉండగా.. ఇప్పుడది మైనస్ 6 పాయింట్లకు చేరుకొంది. ఆయనను ఓడించడం డెమొక్రాట్లకు అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.




## భారతదేశమా? అదెక్కడుంది?

▸▸ గూగుల్‌లో సెర్చ్ చేసిన అమెరికన్లు

విమానాశ్రయం నుంచి 22 కిలోమీటర్ల రోడ్‌షో.. రోడ్డుకు ఇరువైపులా లక్షలాది మంది స్వాగతం.. లక్షా పదివేల మంది ఉన్న స్టేడియంలో సభ.. ఇలా ఘనంగా సాగుతున్న ట్రంప్ భారత పర్యటనను అమెరికా పత్రికలు విస్తృతంగా కవర్ చేయడంతో అమెరికన్లలో చాలా మందికి భారత్‌పై ఆసక్తి పుట్టింది! ఇంకేముంది.. గూగులమ్మను ఆశ్రయించారు. 'భారతదేశం అంటే ఏమిటి? భారతదేశం ఎక్కడుంది అంటూ గూగుల్‌లో అన్వేషించారు. ఈ దెబ్బకు అమెరికాలో గూగుల్ ట్రెండ్స్‌లో ఈ రెండు ప్రశ్నలే అగ్రస్థానంలో నిలిచాయి. ట్రంప్ పర్యటన ఖరారైన జనవరి 28 నుంచే 'వాటీజ్ ఇండియా' సెర్చ్ గూగుల్ ట్రెండ్స్‌లో ఊపందుకుంది. ఫిబ్రవరి 13 నుంచి 'వేరీజ్ ఇండియా' దాన్ని అధిగమించింది. ట్రంప్ భారత్‌కు చేరుకున్నాక ఈ 2 ప్రశ్నలకు సమాధానాన్ని అన్వేషించేవారి సంఖ్య పెరిగిపోయింది.



## అమెరికా అధ్యక్షుడి కుమారుడైనా సాధారణ జీవితమే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నో రాజభోగాలు అనుభవిస్తారు. ఆయన భార్య మెలానియా, కూతురు ఇవాంకా కూడా విలాస జీవితాన్ని అనుభవించే వ్యక్తులే. కానీ ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్ మాత్రం ఇందుకు మినహాయింపు. సాదాసీదా జీవితాన్ని గడిపేందుకే ఆయన ఇష్టపడతారు. తాను అమెరికా అధ్యక్షుడి కుమారుడైనప్పటికీ మామూలు మనిషినేనని, తానేమీ ఉన్నత వర్గానికి చెందిన వాడిని కానని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జూనియర్ పేర్కొన్నారు. చేపలు పట్టడం, వేటాడటం, ఎర్రమాంసం, ట్రక్కులు, తుపాకులంటే తనకు ఇష్టమని తెలిపారు. ఇటీవలే ఆయన లాస్‌వేగాస్ నుంచి ఫీనిక్స్‌కు విమానంలో ప్రయాణించారు. ఫ్లైట్‌లో ఎకానమీ క్లాస్‌లో సాధారణ ప్రయాణికుల మధ్య కూర్చున్నారు. ఓ ప్రయాణికుడు జూనియర్‌తో సెల్ఫీ తీసుకుని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఆ సెల్ఫీని జూనియర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

## ట్రంప్‌కు 'సిల్వర్ కీ' ఇవ్వలేకపోయాం

▸▸ సెక్యూరిటీ వల్ల ఆయన వద్దకు వెళ్లలేకపోయాం: ఆగ్రా మేయర్



ఆగ్రా, ఫిబ్రవరి 25: తాజ్‌మహల్‌ను సందర్శించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 'సిల్వర్ కీ' ఇవ్వలేకపోయినందుకు బాధగా ఉందని ఆగ్రా మేయర్ నవీన్ జైన్ అన్నారు. భద్రతా కారణాల వల్ల ఎయిర్ బేస్ వద్ద ట్రంప్‌కు స్వాగతం పలికే అవకాశం తనకు రాలేదని తెలిపారు. ట్రంప్‌కు కానుకగా ఇవ్వాలని 12 అంగుళాల పొడవు, 600 గ్రాముల బరువుతో వెండి తాళంచెవిని తయారు చేయించినట్లు, దానిపై తాజ్‌మహల్ చిత్రంతోపాటు, నగరం పేరును చెక్కించినట్లు పేర్కొన్నారు. తాజ్‌మహల్‌ను సందర్శించే ప్రముఖులకు ఇలాంటి తాళంచెవిని కానుకగా ఇస్తుంటామన్నారు. 2000 సంవత్సరంలో ఆగ్రాకు వచ్చిన అమెరికా అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు కూడా సిల్వర్ కీని కానుకగా ఇచ్చారని తెలిపారు.

## లక్షను కోటి చేయమని.. రాజమౌళిని అడగండి

▸▸ ట్రంప్‌పై రామ్‌గోపాల్‌వర్మ విసుర్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో సెటైర్లు వేశారు. భారత పర్యటనకు ముందు.. తనకు అహ్మదాబాద్‌లో 70 లక్షల మంది స్వాగతం పలుకుతారని ఓసారి, కోటిమంది ఆహ్వానిస్తారని మరోసారి ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే, అహ్మదాబాద్ మొతేరా స్టేడియంలో 'నమస్తే ట్రంప్' కార్యక్రమంలో పాల్గొన్నవారితో లెక్కేసినా ఈ సంఖ్య లక్షపైన మాత్రమే ఉండటంతో వర్మ విమర్శలకు దిగారు. 'రియల్ డొనాల్డ్ ట్రంప్.. అహ్మదాబాద్‌లో హాజరైన లక్షమందిని తన కంప్యూటర్ గ్రాఫిక్స్ మాయాజాలం ఉపయోగించి కోటిమందిగా చూపించమని ఎస్ఎస్ రాజమౌళిని అడగండి' అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఆ వీడియోను ట్రంప్‌కే బహుమతిగా ఇవ్వాలని సూచించారు.

# మత స్వేచ్ఛపై మోదీతో చర్చించా



(మొదటిపేజీ తరువాయి)

ముచ్చటించారు. అన్ని సందర్భాల్లో తనదైన శైలిలో పలు అంశాలను ప్రస్తావించారు. ఆత్మీయ, ప్రత్యేక మిత్రుడు మోదీకి 'మత స్వేచ్ఛ' గురించి ప్రత్యేక సూచనలు చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమవుతున్న పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ప్రస్తావించలేదంటూనే... దాని సారాంశమైన మత స్వేచ్ఛ, సమానత్వంపై మోదీతో వివరంగా చర్చించినట్లు ట్రంప్ తెలిపారు. భారత్‌లో ముస్లింలపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలపై మోదీతో చర్చించారా? అని ప్రశ్నించగా... "ఔను. మత స్వేచ్ఛపై మోదీతో మాట్లాడాను. ముస్లింలతో మిళితమై పని చేయాలని ఆయన భావిస్తున్నారు. మనం గతాన్ని పరిశీలిస్తే మత స్వేచ్ఛను కాపాడేందుకు భారత్ ఎంతగానో కృషి చేసిందని స్పష్టమవుతుంది" అని చెప్పారు. ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన సీఏఏ గురించి మోదీతో మాట్లాడారా అనే ప్రశ్నకు... 'లేదు' అని సూటిగా జవాబిచ్చారు. "సీఏఏ గురించి నేను చెప్పేందుకేమీ లేదు. అది భారత్‌కు సంబంధించిన విషయం. తన ప్రజల కోసం సరైన నిర్ణయమే తీసుకుంటుందని భావిస్తున్నాను" అని ట్రంప్ చెప్పారు. ఢిల్లీలో జరిగిన హింస గురించి కూడా మోదీతో మాట్లాడలేదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'ఇది భారత్‌కు సంబంధించిన అంశం' అన్నారు.

### కశ్మీర్.. పెద్ద అంశం!

కశ్మీర్‌పై 'మధ్యవర్తిత్వం' నిర్వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ పునరుద్ఘాటించారు. "కశ్మీర్ చాలా పెద్ద అంశం. ఇరువైపులా అనేక మందిని ముల్లులా గుచ్చుకుంటోంది. ఈ విషయంలో కుదిరితే, చేయగలిగితే మధ్యవర్తిత్వం చేస్తాను" అని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుపై మధ్యవర్తిత్వం చేస్తానని తాను ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ గురించి, ఉగ్రవాదం గురించీ మోదీ, తానూ చాలా మాట్లాడుకున్నామన్నారు. అదే సమయంలో.. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో తనకు మంచి సంబంధాలు (ఈక్వేషన్) ఉన్నాయని తెలిపారు. "పాకిస్థాన్ గడ్డ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా ఆ దేశంతో నిర్మాణాత్మక చర్చలు జరుపుతున్నాం. సీమాంతర ఉగ్రవాదాన్ని నియంత్రించే దిశగా పాక్ కృషి చేస్తోంది" అని ప్రశంసించారు. ఇస్లామిక్ ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకోవాలని మోదీ, తానూ తీర్మానించుకున్నామన్నారు.

### 'టెర్రిఫిక్' లీడర్!

భారత్‌లో మత స్వేచ్ఛ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'మోదీ టెర్రిఫిక్ లీడర్' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉగ్రవాదం అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు.. "మోదీలో ఆధ్యాత్మికత ఎక్కువ. ప్రశాంతంగా ఉంటారు. కానీ, నిజానికి ఆయన బలమైన, ఎవరికీ లొంగని నాయకుడు. ఆయన రంగంలోకి దిగితే ఎలా ఉంటుందో చూశాను. ఉగ్రవాదం పీచమణచడమే ఆయన ప్రాధాన్యాల్లో మొదటిది. ఆ సంగతి ఆయన చూసుకుంటారు" అని చెప్పారు. భారత్ 'ట్రెమండస్' (చాలా గొప్ప) దేశమని ప్రశంసించారు. "ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల పరిరక్షణ.. ఇలాంటి విలువలను పాటించే దేశాలు మనవి. భారత్‌తో భాగస్వామ్యం పెంచుకునే ముందు ఈ ఉమ్మడి లక్షణాలను గుర్తుచేసుకుంటాం" అని చెప్పారు.

### ఆ ఒక్కటీ అడక్కు!

"రెండు రోజుల పర్యటనకోసం మరో రెండు రోజులు ప్రయాణించి వచ్చాను. ఎవరో ఒక ప్రశ్న అడుగుతారు. దానికి ఏదో ఒకటి చెబితే అంతా తుస్సుమంటుంది. అందుకే ఆచితూచి సమాధానాలు చెబుతాను" అంటూ ముందుగానే పాత్రికేయుల ముందరి కాళ్లకు బంధం వేసేశారు. ట్రంప్ అంతకుముందు మీడియాతో మాట్లాడినప్పుడు.. "ఇప్పుడు ప్రశ్నలేవీ అడగొద్దు. సాయంత్రం మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడతాను. అప్పుడు ఎన్ని ప్రశ్నలైనా అడగండి" అని చెప్పారు.

### అమ్మో... అంత సుంకమా?

వివిధ రంగాల్లో ఇరుదేశాల పరస్పర ప్రయోజనాలే ప్రాతిపదికగా, స్పష్టంగా చర్చలు జరిగాయని ట్రంప్ తెలిపారు. అదే సమయంలో భారత్ తమ ఉత్పత్తులపై భారీ సుంకాలు విధిస్తోందని ఆక్షేపించారు. "హార్లీ డేవిడ్‌సన్ బైకులపై అత్యధిక సుంకం విధిస్తున్నది ఇండియానే. అమెరికా ఉత్పత్తుల విషయంలో న్యాయబద్ధంగా వ్యవహరించాలి" అని భారత్‌కు హితవు పలికారు. "సమగ్రమైన వాణిజ్య ఒప్పందంపై మా బృందాలు కసరత్తు చేస్తున్నాయి. ఇది త్వరలోనే కొలిక్కి వస్తుందనే నమ్మకముంది" అని ట్రంప్ తెలిపారు. త్వరలోనే 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఆర్థిక సంస్థ' శాశ్వత కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. "నేను అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌కు అమెరికా ఎగుమతులు 60% పెరిగాయి. ఇంధనరంగంలో ఎగుమతులు ఏకంగా 500% పెరిగాయి" అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య రంగాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తున్న కరోనాపైనా ట్రంప్ మాట్లాడారు. "కరోనా వైరస్ సృష్టిస్తున్న కల్లోలం అతి త్వరలోనే సద్దుమణుగుతుంది. ఇందుకు చైనా ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది." అని తెలిపారు. భారత్‌లో 'ఇంటర్నెట్ స్వేచ్ఛ'ను కాపాడాలని మోదీని కోరినట్లు ట్రంప్ చెప్పారు.

### మరోసారి హైదరాబాద్ ప్రస్తావన

భారత్‌లో మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికోసం అమెరికా కృషి చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఇందులో భాగంగానే తన కుమార్తె గత ఏడాది హైదరాబాద్‌కు వచ్చారని... మహిళల ఆర్థిక సాధికారతను చాటిచెప్పేందుకే గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సదస్సులో పాల్గొన్నారని తెలిపారు. 'థ్యాంక్యూ వెరీమచ్ ఇవాంకా' అని కుమార్తెకు ధన్యవాదాలు తెలిపారు. కోల్‌కతా, ఢిల్లీల్లో మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే ప్రాజెక్టులను అమలు చేస్తున్నామన్నారు.

### నేను మళ్లీ గెలవకుంటే పతనమే!: ట్రంప్

ఈ ఏడాది నవంబరులో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తనను తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ట్రంప్ నొక్కి చెప్పారు. "నేను గెలవకపోతే గతంలో ఎన్నడూ లేనంతగా స్టాక్ మార్కెట్ కుప్పకూలుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడాలంటే నన్ను మళ్లీ ఎన్నుకోవాలి. అది అమెరికాకు వరంగా మారుతుంది" అని వ్యాఖ్యానించారు. తన ప్రత్యర్థిగా డెమొక్రాట్ నేత శాండర్స్ నిలిచినా స్టాక్ మార్కెట్ తాత్కాలికంగా క్షీణిస్తుందని చెప్పారు.



### థ్యాంక్స్... ధన్యవాదాలు

భారత పర్యటనకు వచ్చిన ట్రంప్‌కు మోదీ మీడియా సమక్షంలో ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు ప్రతిగా... తమకు అద్భుతమైన ఆతిథ్యమిచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. "ఇది నాకు లభించిన గౌరవం. ఇది అసాధారణ పర్యటన. మరీ ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని మొతేరా స్టేడియంలో 1.25 లక్షల మంది నా ముందున్నారు. నాకంటే వారే (ప్రజలు) మీకు ముఖ్యమని ఊహించగలను. మీ పేరు ప్రస్తావించిన ప్రతిసారీ జనం జేజేలు కొట్టారు. వారు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు" అని మోదీని ప్రశంసల్లో ముంచెత్తారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమ సందర్శన, ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళిని గుర్తు చేసుకున్నారు. "ప్రపంచ ప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్‌ను చూశాం. అబ్బురపరిచే భారత సాంస్కృతిక సౌరభాలను ఆస్వాదించాం" అని చెప్పారు.

# వీసాల సంగతేంటి?

## ట్రంప్‌తో చర్చల్లో లేవనెత్తిన ప్రధాని?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: అమెరికా అనుసరిస్తున్న కఠినమైన వలసవాద విధానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ఏకాంత చర్చల్లో ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. నిర్దిష్టంగా హెచ్1బీ, హెచ్-4వీసాల గురించే అని కాకుండా భారతీయులు ఎదుర్కొంటున్న అంశాలను ఆయన దృష్టికి తీసికెళ్లినట్లు సమాచారం. దీనిపై విదేశాంగ శాఖ ప్రకటన ఏమీ వెల్లడించకపోయినప్పటికీ సంయుక్త మీడియా సమావేశంలో మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ విషయాన్ని సంకేతప్రాయంగా వెల్లడించాయి. "రెండు దేశాల మధ్య సంబంధాలకు ప్రజా సంబంధాలే ఆయువుపట్టు. అది విద్యార్థులు కావొచ్చు, వృత్తి నిపుణులు కావొచ్చు. అమెరికాలో ఉన్న భారతీయ సంతతి ప్రజలు ఈ సంబంధాలను ఇనుమడింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరే మా రాయబారులు. తమ ప్రతిభా పాటవాలు, కష్టపడే తత్వం ద్వారా వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతో తోడ్పడుతున్నారు. అంతేకాక ప్రజాస్వామ్య విలువలు, ఘన సంస్కృతి ద్వారా అమెరికన్ సమాజాన్ని కూడా శక్తిమంతం చేస్తున్నారు. భారతీయ నిపుణుల, విద్యార్థుల కృషిని గుర్తించాల్సిందిగా నేను ట్రంప్‌ను కోరాను. సామాజిక భద్రత కల్పించమన్నాను. వారిని కూడా టోటలైజేషన్ ఒప్పందాల్లో (సామాజిక భద్రత పథకాల్లో పన్ను మినహాయింపు, ఇతర రాయితీల వర్తింపు) వర్తించే విషయాన్ని పరిశీలించాల్సిందిగా కోరాను. ఇది రెండు దేశాలకూ మంచిదని చెప్పాను" అని సంయుక్త ప్రకటన ద్వారా మోదీ పేర్కొన్నారు. అమెరికాతో త్వరలోనే అతి భారీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ప్రధాని ప్రకటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయన్నారు. "రక్షణ, భద్రత, వ్యూహాత్మక ఇంధన,



సాంకేతిక సహకారం, గ్లోబల్ అనుసంధానం పెరుగుతాయి. వ్యూహాత్మక భాగస్వామ్యంలో భారత అమెరికాల రక్షణ, భద్రత ఒప్పందాలు కీలకం. మన రక్షణ పరికరాల ఉత్పత్తిదారులు ఇరుదేశాల సరఫరాలో భాగస్వాములవుతారు" అని ఆయన వివరించారు. "మన సైనిక దళాలు పెద్ద ఎత్తున అమెరికా సైన్యంతో కలిసి విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. ఉగ్రవాదానికి సహకరిస్తున్నవారిని కట్టడి చేయడంలో మా కృషి పెంచుతాం" అని చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నార్కో-టెర్రరిజం, వ్యవస్థీకృత నేరాల అదుపులో సైతం సహకరించుకుంటామన్నారు.

### ట్రంప్‌ను కలవడం ఐదోసారి

గత ఎనిమిది నెలల్లో నేను ట్రంప్‌ను కలవడం ఇది ఐదోసారి. మొతేరా స్టేడియంలో ఆయనకు అపూరూప స్వాగతం పలికాం. 21వ శతాబ్దిలోనే అతి ముఖ్యమైన సంబంధమిది. అందుకే దీనిని సమగ్ర అంతర్జాతీయ భాగస్వామ్య స్థాయికి తీసికెళ్లాలని మేమిద్దరం నిర్ణయించాం. ఈ దిశగా ట్రంప్ చేస్తున్న కృషి అమూల్యం" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇంధన సహకారం కూడా పెరుగుతుందని చెబుతూ, నాలుగేళ్లలో 20 బిలియన్ డాలర్ల మేర కొనుగోళ్లు జరిపామన్నారు.

# తాజ్ సమాధులకు దూరంగా ట్రంప్!

▸▸ వెల్లడించిన పర్యాటక గైడ్ నితిన్‌కుమార్

ఆగ్రా, ఫిబ్రవరి 25: తాజ్‌మహల్‌లోని సమాధుల వద్దకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెళ్లలేకపోయారు. అక్కడకు వెళ్లే దారి ఇరుకుగా, ఎత్తు తక్కువగా ఉండటమే దీనికి కారణం. ట్రంప్ ఎత్తు కన్నా (6 అడుగుల 3 అంగుళాలు) ఆ మార్గం ఎత్తు తక్కువగా ఉందని, ఇరుకుగా కూడా ఉందని ఆయన భద్రతా సిబ్బంది హెచ్చరించారు. దీంతో ఆయన తాజ్‌మహల్‌లోని షాజహాన్-ముంతాజ్‌ల సమాధుల వద్దకు వెళ్లలేకపోయారు. ట్రంప్-మెలానియా జంటకు పర్యాటక గైడ్‌గా వ్యవహరించిన నితిన్‌కుమార్ సింగ్(36) ఈ విషయం వెల్లడించారు. తాజ్ అందాలకు వారిద్దరూ మైమరిచిపోయారని చెప్పారు. పాలరాతి కట్టడం తాజ్‌ను చూడగానే అద్భుతమంటూ ట్రంప్ కొనియాడారని చెప్పారు. ఆగ్రాకు చెందిన నితిన్ 12 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నారు. 50 మంది గైడ్లను ఇంటర్వ్యూ చేసిన అమెరికా రాయబార కార్యాలయం చివరకు నితిన్‌ను ఎంపిక చేసింది. తాజ్‌మహల్ సమాధి గురించి, షాజహాన్-ముంతాజ్‌ల ప్రేమ గురించి ట్రంప్ దంపతులకు వివరించానని నితిన్ చెప్పారు. షాజహాన్, ముంతాజ్ సమాధులకు చేసిన 'మడ్ ప్యాక్ ట్రీట్‌మెంట్' గురించి మెలానియా ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారన్నారు. మరోసారి తాజ్‌మహల్‌ను సందర్శిస్తామని ట్రంప్ దంపతులు చెప్పారన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబానికి తాజ్‌మహల్ గురించి వివరించే అదృష్టం దక్కింది. నా జీవితంలో మరిచిపోలేని రోజు ఇది' అని గైడ్ నితిన్ ఉద్వేగంగా చెప్పారు.





## బాపూజీకి ట్రంప్ దంపతుల నివాళి

### గాంధీని కొనియాడుతూ సందర్శకుల పుస్తకంలో సంతకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ట్రంప్ దంపతులు మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్ వద్ద త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత ట్రంప్ రాజ్‌ఘాట్‌కు వెళ్లారు. అక్కడ మహాత్మా గాంధీ సమాధిపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి బాపూజీకి నివాళి అర్పించారు. అనంతరం సందర్శకుల పుస్తకంలో 'మహాత్ముడి ఆలోచనల నుంచి ఆవిర్భవించిన భారత్‌కు అమెరికా ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. ఇది నాకు దక్కిన అద్భుతమైన గౌరవం' అని రాసి సంతకం చేశారు. మెలానియా కూడా సంతకం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ దంపతులు ఓ మొక్కను నాటారు. అధికారులు ట్రంప్‌కు గాంధీజీ ప్రతిమను బహూకరించారు. ట్రంప్ వెంట కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ఉన్నారు. సోమవారం అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలోని సందర్శకుల పుస్తకంలో మహాత్ముడి గురించి ట్రంప్ ఒక్క ముక్క కూడా రాయకపోవడం విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే.

# 'హ్యాపీనెస్' స్ఫూర్తిదాయకం

## ఢిల్లీలోని సర్వోదయ పాఠశాలలో మెలానియా సందడి

▸▸ తిలకం, పుష్పగుచ్ఛంతో ఆమెకు విద్యార్థుల స్వాగతం

▸▸ నాలుగో తరగతి పిల్లలతో కలిసి ప్రథమ మహిళ ధ్యానం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విద్యార్థులను ఒత్తిడి నుంచి బయటపడేయడానికి ఢిల్లీ సర్కారు చేపట్టిన హ్యాపీనెస్ తరగతులతో తాను స్ఫూర్తి పొందానని అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ అన్నారు. 'బీ బెస్ట్' క్యాంపెయిన్‌లో భాగంగా ఢిల్లీలోని సర్వోదయ కో-ఎడ్యుకేషన్ సీనియర్ సెకండరీ స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. ఢిల్లీ సర్కారు చేపట్టిన హ్యాపీనెస్ క్లాసుల గురించి తెలుసుకున్నారు. తమ పాఠశాలకు చేరుకున్న మెలానియా ట్రంప్‌కు.. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థినులు పుష్పగుచ్ఛం ఇచ్చి తిలకం పెట్టి స్వాగతం పలికారు. భారత్‌లో ప్రతి చోటా తనకు లభిస్తున్న సాదర స్వాగతం పట్ల మెలానియా కృతజ్ఞతలు తెలిపారు. ప్రకృతితో మమేకమవడం ద్వారా రోజును ప్రారంభించడం కన్నా మరో గొప్ప మార్గం ఉంటుందని తాను అనుకోవట్లేదన్నారు. ఒక తరగతి గదిలో చెప్పిన కథను శ్రద్ధగా విన్న మెలానియా.. మరో తరగతిగదిలో లెగో బొమ్మలతో ఆడుకుంటున్న చిన్నారులతో కలిసిపోయారు. తాను కూడా కాసేపు ధ్యానం చేసి.. ప్రశాంతంగా ఉందన్నారు. అమెరికా విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడడం, ఆన్‌లైన్‌లో వారి భద్రత, వారి సంక్షేమం అనే మూడు అంశాలతో బీ బెస్ట్ క్యాంపెయిన్‌ను ఆమె నిర్వహిస్తున్నారు. ఆమె ఏ దేశానికి వెళ్లినా అక్కడి పాఠశాలలకు వెళ్లి ఇలాంటి కార్యక్రమాలను పరిశీలిస్తుంటారు. ఈ క్రమంలోనే ఢిల్లీలోని పాఠశాలను కూడా సందర్శించారు. కాగా.. ఆమె పాఠశాల నుంచి వెళ్లేటప్పుడు విద్యార్థులు హర్షధ్వానాలు చేశారు. పాఠశాల యాజమాన్యం ఆమెకు మధుబని పెయింటింగ్స్‌ను ఇచ్చి వీడ్కోలు పలికింది. ఈ కార్యక్రమానికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మంత్రి సిసోడియా హాజరు కావాల్సి ఉండగా.. ట్రంప్ యంత్రాంగం అనుమతి ఇవ్వలేదు.

### మీకిష్టమైన కార్టూన్ ఏంటి?

**మెలానియాకు విద్యార్థుల ప్రశ్నలు**

మెలానియాపై విద్యార్థులు బెరుకు లేకుండా ప్రశ్నల వర్షం కురిపించారు. "అమెరికా ఎంత పెద్దది? ఇక్కడికి చాలా దూరంలో ఉంటుందా? మీకు ఇష్టమైన కార్టూన్ ఏంటి?" అని కుతూహలంగా అడిగారు. మెలానియా నవ్వుతూ వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. మరో తరగతిగదిలో లెగోలతో బొమ్మలు తయారుచేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లగా.. 'ప్రథమ మహిళగా మీరేం చేస్తుంటారు?' అని ఒక బాలిక అడిగింది.





రాష్ట్రపతి ఇచ్చిన విందులో మాట్లాడుతున్న ట్రంప్

# అమెరికా.. భారత్‌కు చిరకాల స్నేహితుడు

## ట్రంప్‌తో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్ష దంపతులకు విందు
గడచిన రెండు రోజులూ ఫలవంతం: ట్రంప్
ఉపరాష్ట్రపతి, ప్రధాని, సీజేఐ, తెలంగాణ సీఎం సహా విందుకు పలువురు ప్రముఖుల హాజరు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గౌరవార్థం.. మంగళవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు తన భార్య మెలానియాతో విచ్చేసిన ట్రంప్‌కు రాష్ట్రపతి తన సతీమణితో సవితతో కలిసి స్వాగతం పలికారు. "హౌడీ మోదీ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ ఇప్పటికే కోట్లాది మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నారు. 'నమస్తే ట్రంప్' కార్యక్రమం ఆయన్ను భారతీయులకు మరింత చేరువ చేసింది. ఒక విదేశీ నేతను ఆహ్వానించడానికి భారత్ ఈ స్థాయిలో కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటిసారి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు. అనంతరం ట్రంప్ దంపతులను దగ్గరుండి దర్బార్‌హాల్‌కు తీసుకెళ్లారు. అక్కడ.. ఐదో శతాబ్దం నాటి గౌతమబుద్ధుడి విగ్రహాన్ని, మనదేశానికి చెందిన పలువురు నాయకుల చిత్రాలను ట్రంప్ తిలకించారు. విందు తర్వాత కోవింద్, ట్రంప్ మాట్లాడుకున్నారు. భారతదేశానికి అమెరికా ఒక విలువైన స్నేహితుడని.. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని కోవింద్ అన్నారు. ప్రపంచంలోనే రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా భారత్-అమెరికా పరస్పరం తమ ప్రజల ద్వారా, వారి ఆకాంక్షల ద్వారా అనుసంధానమై ఉన్నాయన్నారు. "నలభై లక్షల మందికి పైగా భారత సంతతి ప్రజలు అమెరికాను తమ నివాసంగా చేసుకున్నారు. అమెరికా కలలకు.. నూతన భారత్ స్వప్నానికి వారు సజీవ వారధులు. మన ద్వైపాక్షిక సంబంధాలనే కాన్వాస్‌కు ఎన్నో పొరలున్నాయి. అయితే వాటిలో ఏవీ కూడా.. అమెరికాలో పెరుగుతున్న భారత విద్యార్థి సమూహం గీసే చిత్రాలకన్నా మెరుగైనవి కావు" అన్నారు. ఇక.. వాణిజ్య, సైనిక ఒప్పందాల దిశగా ఇరు దేశాలూ కృషిచేస్తున్నాయని, గడచిన రెండు రోజులూ ఫలవంతమయ్యాయని ట్రంప్ అన్నారు. చక్కటి ఆతిథ్యం ఇచ్చినందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విందుకు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, తెలంగాణ సీఎం కేసీఆర్, అసోం సీఎం సర్బానంద సోనోవాల్, హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కర్ణాటక సీఎం యడ్యూరప్ప, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ.బోబ్డే, మహాదళపతి బిపిన్ రావత్, విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ, బ్యాంకర్ కోటక్ మహీంద్ర, సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ హాజరయ్యారు.

### విందులో ఇదీ మెనూ

శాకాహార పదార్థాలు: కొత్తిమీర షోర్బా, ఆలూ టిక్కీ, పాలక్‌పాప్డీ, జర్ఫేజ్ జమీన్, దాల్ రైజినా

మాంసాహార వంటకాలు: రాన్ అలీ షాన్, కాజున్ స్పైస్‌డ్ సాల్మన్, ధమ్ ఘోష్ట్ బిర్యానీ

.. ఇంకా యాపిల్‌పై, సాల్టీ కేరమెల్ సాస్, మాల్‌పువా రబ్డీ రోల్ వడ్డించారు

### మాకెంతో ప్రత్యేకం.. మళ్లీ వస్తాం

"ఈ రెండు రోజులూ మాకెంతో ప్రత్యేకం. ఐ లవ్ ఇండియా. భారతీయులను నేను గౌరవిస్తాను. మేం మళ్లీ తిరిగొస్తాం."
-రాష్ట్రపతి ఇచ్చిన విందులో ట్రంప్



## క్షేమంగా వచ్చి.. లాభంగా వెళ్లారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్షేమంగా భారత్‌కు వచ్చారు. రూ.21 వేల కోట్ల ఒప్పందంతో 'లాభం'గా తిరిగి వెళ్లారు. పర్యటనలో 'మరచిపోలేని ఆతిథ్యం' అందించారని ఆయన మురిసిపోయారు. రెండు రోజులూ మోదీ.. మోదీ.. అంటూ పలవరించి, పరవశించారు. 'ప్రత్యేక మిత్రుడు' అని పదేపదే ప్రస్తావించారు. ఇరువురూ పలు ఆలింగనాలు చేసుకున్నారు. మంగళవారం కలిసి మీడియాతో మాట్లాడారు. సంయుక్త ప్రకటన మాత్రం విడుదల కాలేదు. ఈ పర్యటనలో అమెరికాకు లాభసాటి 'రక్షణ' ఒప్పందం కుదిరినప్పటికీ.. భారత్‌కు కీలకమైన వాణిజ్య ఒప్పందం కొలిక్కిరాలేదు. 'వ్యాపార చర్చల్లో మోదీ మహా మొండి' అని ట్రంప్ తొలి నుంచీ ఆక్షేపిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన మంగళవారం రాజ్‌ఘాట్‌లో గాంధీకి నివాళులర్పించారు. అమెరికా రాయబార కార్యాలయంలో భారత వాణిజ్య దిగ్గజాలతో భేటీ అయ్యారు. మోదీ తో కీలక చర్చలు జరిపారు. తర్వాత బస చేసిన హోటల్‌లోనూ పాత్రికేయులతో ముచ్చటించారు. తనకూ, తన బృందానికి రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన విందును ఆస్వాదించారు. మంగళవారం రాత్రి 10.40 గంటలకు 'బై బై ఇండియా' అంటూ ఎయిర్‌ఫోర్స్ వన్‌లో వెళ్లిపోయారు.

## తడబడి... తంతుగా ముగిసి..!

### ట్రంప్ భారత పర్యటనతో ఒరిగిందేమీ లేదన్న విదేశీ మీడియా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన ఆర్భాటాలకే పరిమితమైందే తప్ప వాస్తవంగా సాధించినదేమీ లేదని విదేశీ మీడియా వ్యాఖ్యానించింది. ముఖ్యంగా 'నమస్తే ట్రంప్' సభలో అమెరికా అధ్యక్షుడి ఉచ్చారణ దోషాలను దాదాపు అన్ని పేపర్లు, ఆన్‌లైన్ విదేశీ వార్తా సంస్థలూ ప్రస్తావించాయి. ప్రముఖ మీడియా సంస్థల స్పందన ఇదీ...!

**వాషింగ్టన్ పోస్ట్**

భారత్‌తో వాణిజ్యపరమైన అంశాల్లో ఉద్రిక్తతల నడుమ ట్రంప్ భద్రతాపరమైన అంశాల్లో సహకారం పెంపొందించడమ్మై దృష్టిపెట్టారు. మోదీని మొండిఘటమని అభివర్ణించడం ద్వారా వాణిజ్య చర్చల్లో పురోగతే తప్ప ఒప్పందం కుదరదన్నది స్పష్టమైపోయింది. ఇక భారత ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ, బహుళత్వం గురించి ట్రంప్ అన్న మాటలు మత స్వేచ్ఛ గురించి అమెరికా ఆందోళనను వ్యక్తం చేశాయి. మత స్వేచ్ఛ గురించి మోదీతో ఏకాంత చర్చల్లో ట్రంప్ లేవనెత్తుతారని ఓ సీనియర్ అధికారి ముందే చెప్పారు.

**న్యూయార్క్ టైమ్స్**

నమస్తే ట్రంప్ సభను హౌడీ మోదీ-2గా చెప్పవచ్చు. ఇది ట్రంప్‌కు నిస్సంకోచంగా, ఉల్లాసపరిచేందుకు సమర్పించిన ప్రశంస.. నివాళి! ఈ పర్యటనను ఓ కీలక శిఖరాగ్ర సదస్సుగా కంటే, సీరియస్ అంశాల కంటే ఓ పీఆర్ వ్యవహారంగా, ప్రజాకర్షకంగా మలచడానికి భారత్ ప్రయత్నించింది. అయితే, ఇది చిరస్మరణీయన్న విషయం కాదనలేం. ట్రంప్‌కు కనబడకుండా అక్కడి మురికివాడలకు అడ్డంగా గోడ కట్టారు. ఇది భారత్‌లో అనేక వ్యాఖ్యానాలకు, విమర్శలకు తావిచ్చింది. ఆ సెగ ట్రంప్‌కూ తగిలింది.

**బీబీసీ**

ఈ పర్యటన ఎన్నికల వేళ ట్రంప్‌కు బాగా పనికొస్తుంది. భారీగా హాజరైన జనం విజువల్స్‌ను ఆయన ఉపయోగించుకుంటారు. తానంటే, అమెరికా అంటే ప్రపంచ దేశాల్లో ఎంత మంచి పేరుందో, ప్రతిష్ఠ ఉందో తెలియజెప్పేందుకు అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో వివరించవచ్చు. ఈ పర్యటన ద్వారా ఆయన భారతీయ అమెరికన్ల ఓట్లను భారీగా సాధించగలరా.. అంటే సందేహమే. అమెరికాలో 45 లక్షల మంది భారతీయ అమెరికన్ ఓటర్లున్నారు. సాధారణంగా వారు డెమొక్రాట్ల వైపు మొగ్గారు. ట్రంప్‌కు వచ్చిన ఓట్లు 16 శాతమే. మోదీతో చెట్టపట్టాల్ వేసుకుని మసలడం ద్వారా ట్రంప్ భారతీయుల మనసుల్ని గెలవాలనుకుంటున్నారు.

**సీఎన్ఎన్**

భారత్‌లో అట్టహాసంగా తనకు లభించిన స్వాగత సత్కారాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. ఆర్భాటాలంటే ఆయనకు ఇష్టం. గతంలో ఎన్నడూ ఆయన ఇంత భారీ స్థాయిలో స్వాగతం అందుకోలేదు. "నా జీవితంలో అత్యద్భుతమైనవి ఈ రెండ్రోజులూ..! భారత పర్యటనలో నేనెంతో నేర్చుకున్నాను" అని ఆయన అన్నారు. పెద్ద ఒప్పందాలేవీ లేకుండానే ట్రంప్ పర్యటన ముగిసింది. వాణిజ్య ఒప్పందం ప్రస్తుతానికి లేనట్లే.

**డాన్ (పాక్ పత్రిక)**

హౌడీ మోదీ సభకు ప్రతిస్పందనగా 'నమస్తే ట్రంప్'ను ఏర్పాటు చేశారే తప్ప మరొకటి కాదు. గట్టి ఒప్పందాలేవీ కుదరలేదు. కశ్మీర్‌పై మధ్యవర్తిత్వానికి ట్రంప్ సంసిద్ధత చూపారు. భారత గడ్డపైనే ఈ మాటన్నారు. దాని గురించి సుదీర్ఘంగా మాట్లాడామన్నారు.

**ది గార్డియన్**

పరస్పర ప్రశంసలు, వ్యక్తిగత స్నేహబంధాన్ని ఆవిష్కరించడం మినహా పర్యటనలో పెద్దగా సాధించినదేమీ లేదు. వాణిజ్య ఒప్పందం కుదర్లేదు. ఢిల్లీ అల్లర్లు ఈ సమయంలోనే పెచ్చరిల్లడంతో మీడియా దృష్టి అటు మళ్లింది. ట్రంప్ చెప్పినట్లు 70 లక్షల మంది ప్రజలు కూడా ఆ సభకు రాలేదు.

**బ్లూమ్‌బర్గ్**

భారత ప్రధాని అమెరికా అధ్యక్షుడికి రెడ్ కార్పెట్ పరిచారు. డొనాల్డ్ ట్రంప్ రాకలో ప్రజల ఉత్సాహమే తప్ప.. ఇరుదేశాలకూ మధ్య గట్టి ఒప్పందం ఏదీ కుదరలేదు.

**అల్ జజీరా**

వాణిజ్య ఒప్పందం కుదరదన్న విషయం ముందే వెల్లడైపోయినా వ్యక్తిగత బంధాన్ని బహిరంగపరచడం కోసం ఇద్దరూ తాపత్రయపడ్డారు. వాణిజ్యపరమైన అడ్డంకుల నడుమ ట్రంప్‌ను ఆకట్టుకోవడానికి మోదీ ప్రయత్నించారు. ఈ పర్యటన ఓ రకంగా రాజకీయ ప్రేక్షకత్వం. ఇద్దరివీ రాజకీయ అవసరాలే.

# 21 వేల కోట్లతో డీల్

- భారత్‌కు అపాచీ, రోమియో హెలికాప్టర్లు
- అగ్రరాజ్యంతో కుదిరిన ఒప్పందం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: అమెరికా నుంచి అత్యాధునిక 'ఆయుధ సామగ్రి' భారత్‌కు అందనుంది. ప్రపంచంలోనే అత్యుత్తమమైన అపాచీ, ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లతో సహా అధునాతన సైనిక ఆయుధాలు, ఉపకరణాలను భారత్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదిరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటనలో కీలకమైన, అసలైన ఘట్టం మంగళవారం చోటుచేసుకుంది. ట్రంప్, ప్రధాని మోదీ మధ్య వ్యూహాత్మక అంశాలతో పాటు వాణిజ్యం, రక్షణ, ఉగ్రవాద నిర్మూలన, ఇంధన తదితర రంగాలపై 5 గంటల పాటు విస్తృత చర్చలు జరిగాయి. దీనికిముందే 300 కోట్ల డాలర్ల (రూ.21 వేల కోట్లు) విలువైన ఆయుధ సంపత్తిని భారత్‌కు విక్రయించే రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో 'భారత్‌తో అమెరికా రక్షణ బంధం మరింత విస్తరించింది' అని ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందంతో ఇరు దేశాల సైనిక 'సంయుక్త బలం' పెరుగుతుందని చెప్పారు. దీనిని 'వండర్‌ఫుల్ డీల్ (అద్భుత ఒప్పందం)'గా అభివర్ణించారు. భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక బంధానికి ఈ ఒప్పందం నిదర్శనమని మోదీ వ్యాఖ్యానించారు. చర్చల్లో తాలిబన్లతో అమెరికా శాంతి ఒప్పందం, ఇండో-పసిఫిక్, గల్ఫ్ ప్రాంతాల్లో పరిస్థితి, ఉగ్రవాద ముప్పు అంశాలూ ప్రస్తావనకు వచ్చాయి.

### సీఏఏ చర్చకు రాలేదు: శ్రింగ్లా

కాగా, ఈ చర్చల్లో సీఏఏ ప్రస్తావనకు రాలేదని విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా చెప్పారు. మత సామరస్యంపై ఇరువురూ సానుకూలంగానే చర్చించారని తెలిపారు. 'భద్రత, రక్షణ, ఇంధన, సాంకేతికత, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు అనే ఐదు ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి. రక్షణ సహకారం విషయంలో భారత్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట, స్వదేశీ భద్రత పెంపునకు వర్కింగ్ గ్రూపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాంకేతిక పరిజ్ఞానం అందజేత, రక్షణ రంగంలో సంయుక్త సహకారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు' అని తెలిపారు. ద్వైపాక్షిక ఒప్పందంపైచర్చలను సాధ్యమైనంత త్వరగా ముగించి, 'బిగ్ డీల్' చేసుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చినట్టు చెప్పారు. 'ఇరుదేశాల్లోనూ కొనసాగుతున్న బహుళత్వం, భిన్నత్వంపై ఇరువురు నేతలూ ప్రశంసించుకున్నారు' అని తెలిపారు. జమ్మూకశ్మీర్ అంశం కేంద్రంగా సానుకూల పరిణామాలపైనే చర్చించినట్టు చెప్పారు. పాకిస్థాన్ ప్రస్తావన కూడా వచ్చిందని, సీమాంతర ఉగ్రవాదంపై భారత ఆందోళనలపై మాట్లాడారని తెలిపారు. హెచ్1బీ వీసాలపైనా చర్చించారన్నారు.

### ఆరోగ్య, ఇంధన రంగాల్లో..

ఆరోగ్య, ఇంధన రంగాల్లో ఇరుదేశాలు మూడు ఒప్పందాలు చేసుకున్నాయి. మానసిక ఆరోగ్యంపై ఇరుదేశాల ఆరోగ్యశాఖలు అవగాహన ఒప్పందం(ఎంవోయూ)పై సంతకాలు చేశాయి. వైద్య ఉత్పత్తుల భద్రతపై అమెరికా ఆహార-మందుల శాఖ పరిధిలోని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్‌తో ఎంవోయూ కుదిరింది. ఇంధన రంగంలో సహకారంపై ఐఓసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్), ఎక్సాన్ మొబైల్ ఇండియా ఎల్ఎన్‌జీ లిమిటెడ్, అమెరికాకు చెందిన చార్ట్ ఇండస్ట్రీస్ ఇన్‌క్ మధ్య ఒప్పందం కుదిరింది.

# చైనాకు చెక్ పెట్టేందుకే..

- మన సైన్యానికి రోమియో, అపాచీ హెలికాప్టర్లు
- హైదరాబాద్‌లో అపాచీ విడి భాగాల తయారీ!



చైనాకు చెక్ పెట్టే వ్యూహంలో భాగంగానే భారత్‌తో అమెరికా మూడు వందల కోట్ల డాలర్ల (రూ.21 వేల కోట్లు) విలువైన రక్షణ ఒప్పందాలపై సంతకం చేసింది. దీనిప్రకారం వచ్చే మూడేళ్లలో భారత్‌కు 24 ఎంహెచ్-60 రోమియో సీహాక్ హెలికాప్టర్లను, 12 ఏహెచ్ 64ఈ అపాచీ హెలికాప్టర్లను సరఫరా చేయనుంది. ఎంహెచ్-60 హెలికాప్టర్లను అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ గ్రూపు సరఫరా చేస్తే.. ఏహెచ్ 64ఈ అపాచీ హెలికాప్టర్లను బోయింగ్ సంస్థ భారత్‌లోనే తయారుచేస్తుంది. భారత దళాలకు ఈ హెలికాప్టర్లు అదనపు శక్తిని సమకూరుస్తాయని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. "ఆసియాలో చైనా తిరుగులేని శక్తిగా ఎదుగుతోంది. వారి నౌకా దళం తిరుగులేనిది. చైనాను నియంత్రించడానికి ఆసియాలో శక్తిమంతమైన దేశం సాయం అమెరికాకు అవసరం. అందుకే మనకు ఎంహెచ్- 60 రోమియో సీహాక్ హెలికాప్టర్లను అందించటానికి ఒప్పుకొంది. ఇవి అందుబాటులోకి వస్తే మన నౌకాదళ సామర్థ్యం ద్విగుణీకృతమవుతుంది. ఇక అపాచీ హెలికాప్టర్ల వల్ల సరిహద్దుల్లో శత్రు దేశాలను నియంత్రించడానికి వీలవుతుంది" అని రక్షణశాఖకు చెందిన అధికారి ఒకరు వివరించారు. ఈసారి ట్రంప్ పర్యటనలోనే ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్స్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూసీ)పై ఒక ఒప్పందం కుదరాల్సి ఉందని.. దీనికి అమెరికా కాంగ్రెస్ కూడా అనుమతి ఇచ్చిందని ఆయన వెల్లడించారు. కానీ ఒప్పందంలో ఐఏడీడబ్ల్యూసీకి సంబంధించిన అంశాలేమీ లేవు. ఈ వ్యవస్థ పూర్తిగా నాటో దేశాలన్నింటితో అనుసంధానమై ఉంటుందని.. దీని విక్రయానికి అన్ని దేశాల అనుమతి అవసరమని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

### ఎంహెచ్-60 రోమియో సీహాక్ హెలికాప్టర్లు

శత్రు జలాంతర్గాములను పసిగట్టి దాడులు చేయటానికి ఈ హెలికాప్టర్లు ఉపయోగపడతాయి. ఇప్పటిదాకా మన నౌకాదళం.. ఇందుకు సీకింగ్ అనే హెలికాప్టర్లను వినియోగిస్తోంది. వాటితో పోలిస్తే ఎంహెచ్-60 హెలి కాప్టర్లు అత్యంత శక్తిమంతమైనవి. యుద్ధనౌకల నుంచి సులభంగా వాడవచ్చు. వీటిలోని ఎయిర్ ఏఎస్‌డబ్ల్యూ వ్యవస్థ ఎంత లోతులో ప్రయాణించే జలాంతర్గామినైనా పసిగట్టగలదు. ఈ హెలికాప్టర్లు ప్రస్తుతం అమెరికా నౌకా దళం వద్ద మాత్రమే ఉన్నాయి. - స్పెషల్ డెస్క్

### ఏహెచ్ 64ఈ అపాచీ హెలికాప్టర్లు

అపాచీ హెలికాప్టర్లను భారత వైమానిక దళం ఇప్పటికే ఉపయోగిస్తోంది. అమెరికా తాజాగా సరఫరా చేయబోయే 12 ఏహెచ్ 64ఈ 'ఈ' వేరియంట్ అపాచీ హెలికాప్టర్లు అత్యంత అధునాతనమైనవి. గత ఏడాది భారత వైమానిక దళం 17 హెలికాప్టర్లతో ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసింది. వచ్చే మూడేళ్లలో వైమానిక దళంలోకి చేరబోయే ఏహెచ్ 64ఈ అపాచీ హెలికాప్టర్ల వల్ల శత్రు సరిహద్దులు మరింత సురక్షితం అవుతాయని నిపుణులు భావిస్తున్నారు. వీటికి అవసరమైన కొన్ని విడిభాగాలను బోయింగ్-టాటా సంస్థల అనుబంధ సంస్థ హైదరాబాద్‌లో తయారు చేయనుండడం విశేషం.

## ఇవాంకా ముచ్చట



రాష్ట్రపతి విందులో ఇవాంకా, కుష్నర్

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు రాష్ట్రపతి ఇచ్చిన అధికారిక విందు కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అందిన ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా తన వద్దకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సీఎం కేసీఆర్ తొలుత చేతులు జోడించి నమస్కారం పెట్టారు. ప్రతిగా చేయి చాచిన ట్రంప్‌తో కరచాలనం చేశారు. తనను తాను పరిచయం చేసుకున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో ఇవాంకా ట్రంప్ పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ విషయం విన్న ట్రంప్ చిరునవ్వు నవ్వుతూ 'అవును నాకు తెలుసు' అన్నట్లు సమాచారం. అనంతరం.. పక్కనే ఉన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సీఎం కేసీఆర్ నమస్కారం పెట్టి, ఆయనతో కరచాలనం చేశారు. అమెరికా తొలి మహిళ, ట్రంప్ సతీమణి మెలానియాకు నమస్కారం పెట్టి, తర్వాత ఆమెతో కరచాలనం చేశారు. కాగా, ట్రంప్ విందుకు ఆహ్వానించిన సమయంలోనే వెంట ఏమీ తీసుకురావద్దని రాష్ట్రపతి భవన్ స్పష్టంగా తెలియజేయటంతో సీఎం కేసీఆర్ తనతోపాటు ఏ కానుకలనూ తీసుకెళ్లలేదు. ఆయన బుధవారం హైదరాబాద్‌కు రానున్నట్టు టీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# అమెరికా కాన్సులేట్ ముట్టడి!

### ట్రంప్ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ నిరసన.. నారాయణ, చాడ అరెస్టు



సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకట్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్/బేగంపేట ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన పూర్తిగా స్వార్థం, వ్యాపార ప్రయోజనాలతో కూడుకున్నదని సీపీఐ ఆరోపించింది. ఆయన పర్యటన అంతా మోదీ-ట్రంప్ కేళీ విలాసాలతోనే సరిపోయిందని, భారతీయులపై వీసా పేరుతో విధించిన కఠిన నిబంధనల్ని ప్రస్తావించకుండానే టూర్‌ను ముగించారని విమర్శించారు. ట్రంప్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నేతలు మంగళవారం బేగంపేటలోని అమెరికన్ కాన్సులేట్ ముట్టడికి యత్నించారు. అయితే ముందస్తు సమాచారంతో అప్పటికే పెద్ద ఎత్తున బలగాలను మోహరించిన పోలీసులు ప్రకాష్‌నగర్ వద్ద వారిని అడ్డుకున్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ అజీజ్ పాషా తదితరులను అరెస్టు చేసి తిరుమలగిరి, బోయిన్‌పల్లి తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం నారాయణ, చాడ వెంకట్‌రెడ్డిపై బేగంపేట పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి.. 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ నోటీసుల్లో.. పలు షరతులు విధించారు. అయితే ఈ షరతుల్ని తాను అంగీకరించే ప్రసక్తే లేదని నారాయణ తెలిపారు. దాంతో పోలీసులు వారిని విడిచిపెట్టలేదు. గంట తర్వాత మళ్లీ వచ్చి మరోసారి నోటీసులు ఇచ్చారు. అయినా.. షరతుల్ని అంగీకరించబోనంటూ నారాయణ స్వయంగా నోటీస్ పేపర్‌లో రాసి సంతకం చేసి పోలీసులకు ఇచ్చి సాయంత్రం స్టేషన్ నుంచి వచ్చేశారు. కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, రాములునాయక్.. బోయిన్‌పల్లి స్టేషన్‌కు వెళ్లి వారిని కలిశారు. ఇదిలా ఉండగా మోదీ ప్రభుత్వం సీఏఏ పేరుతో దేశాన్ని మతపరంగా విభజిస్తోందన్న సీఎం కేసీఆర్.. మరోవైపు ట్రంప్‌తో కేంద్ర ప్రభుత్వ విందుకు ఎలా హాజరయ్యారని చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు.

## వివక్ష, దురభిమానం, శరణార్థులపై శత్రుభావం

- ఇవే భారత్, అమెరికా ఉమ్మడి విలువలు
- ఇరు దేశాల ఆమ్నెస్టీల విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: 'వివక్ష, మతదురభిమానం, శరణార్థులపై శత్రుభావం... ఇవే భారత్, అమెరికా పాటించే ఉమ్మడి విలువలు అని ఇరు దేశాల అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు (ఆమ్నెస్టీలు) ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించాయి. ఇరు దేశాల అధినేతల విధానాలు ముస్లిం వ్యతిరేకతతో నిండి ఉంటాయని ఆరోపించాయి. భారత్‌లో సీఏఏపై ఆందోళనలు, కశ్మీర్‌లో ఇంటర్నెట్ నిలిపివేత; వివిధ దేశాలపై ప్రభావం పడేలా ముస్లింలపై ప్రయాణ నిషేధం విధించడాన్ని ప్రస్తావించాయి.

### పేదల జీవితాల్లో ఏ మార్పూ ఉండదు: శివసేన

ముంబై: 'ట్రంప్ 36 గంటల పర్యటన వల్ల భారత్‌లో పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఏ మార్పూ ఉండద'ని శివసేన వ్యాఖ్యానించింది. ఈ మేరకు పార్టీ పత్రిక 'సామ్నా' సంపాదకీయం రాసింది. భారత్‌లో మత స్వేచ్ఛ గురించి బయటి వ్యక్తుల సలహాలు అవసరం లేదని సూచించింది.

### కార్పొరేట్ ప్రయోజనాలే ట్రంప్ ఎజెండా: సీపీఐ

న్యూఢిల్లీ: అమెరికా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం భారత మార్కెట్‌ను బలవంతంగా మరింత తెరిపించడమే డొనాల్డ్ ట్రంప్ పర్యటన ఏకైక ఎజెండా అని సీపీఐ ఆరోపించింది. ట్రంప్ ఎత్తుగడలో పడిపోవద్దని ప్రధాని నరేంద్ర మోదీకి సూచించింది. అమెరికా ఎజెండాతో భారత దేశ రైతులు, వ్యవసాయంపై, ముఖ్యంగా డెయిరీ, పౌల్ట్రీ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించింది.



అండర్-19 క్రికెట్‌లో చండీగఢ్ అమ్మాయి అద్భుత రికార్డు

# 29 బంతుల్లో 10 వికెట్లు

**కడప (స్పోర్ట్స్):** మహిళల అండర్-19 క్రికెట్‌లో చండీగఢ్ కెప్టెన్ కశ్వీ గౌతమ్ చరిత్ర సృష్టించింది. కేవలం 29 బంతుల్లో 10 వికెట్లు కూల్చి ఔరా అనిపించింది. బీసీసీఐ అండర్-19 మహిళల అంతర్ రాష్ట్ర వన్డే క్రికెట్ పోటీల్లో మంగళవారం అరుణాచల్‌ప్రదేశ్‌తో మ్యాచ్‌లో కశ్వీ అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చండీగఢ్.. కశ్వీ (49) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 186/4 స్కోరు చేసింది. ఛేదనలో కశ్వీ దెబ్బకు అరుణాచల్‌ప్రదేశ్ 25 పరుగులకే కుప్పకూలి.. 161 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. కుడిచేతివాటం మీడియం పేసర్ అయిన కశ్వీ 4.5 ఓవర్లలో 12 పరుగులు మాత్రమే ఇచ్చి 10 వికెట్లను పడగొట్టింది. ఇందులో హ్యాట్రిక్ కూడా ఉండడం విశేషం. మహిళల క్రికెట్ చరిత్రలో ఏ వయసు విభాగం నుంచైనా వన్డే, టీ20ల్లో ఇలాంటి రికార్డు ఇంత వరకు నమోదు కాలేదు.

## కూత ఘనం..

కశ్వీ గౌతమ్‌ది మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు సీమా శర్మ, సురేష్ శర్మ, చెల్లెలు ఆసీ ఉన్నారు. చండీగఢ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారి, తల్లి గృహిణి. 7వ తరగతిలో క్రికెట్ ఆడడం ప్రారంభించిన కశ్వీ రెండేళ్లలోనే చండీగఢ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. అండర్-16, 19, 23 సీనియర్స్ విభాగాల్లోనూ ఆడింది.

### వచ్చే నెల 12 వరకు..

కడపలో జరుగుతున్న అంతర్ రాష్ట్ర టోర్నీలో అరుణాచల్‌ప్రదేశ్, పాండిచ్చేరి, మిజోరం, నాగాలాండ్, జమ్ముకశ్మీర్, సిక్కిం, మేఘాలయ. బిహార్, మణిపూర్, చండీగఢ్ జట్లు పాల్గొంటున్నాయి. ఈనెల 19 నుంచి మార్చి 12 వరకు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో ఈ టోర్నీ జరుగుతోంది.

### దేశానికి ఆడడమే లక్ష్యం

నాకు క్రికెట్ చాలా ఇష్టం. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బంతులు వేయగలను. చండీగఢ్ క్రికెట్ సంఘం నా కెరీర్‌కు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. జాతీయజట్టుకు ఆడడం నా కల. **- కశ్వీ గౌతమ్**

# భారత్ నుంచి ఆరుగురు

## ఆసియా లెవెన్ జట్టు ప్రకటన





**ఢాకా:** వరల్డ్ లెవెన్‌తో జరిగే రెండు టీ20ల కోసం ఆసియా లెవెన్ జట్టును ప్రకటించారు. ఇందులో భారత్ నుంచి ఆరుగురు ఆటగాళ్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ, శిఖర్ ధవన్, రాహుల్, రిషభ్ పంత్, షమి, కుల్దీప్ యాదవ్ జట్టులో ఉన్నారు. బంగ్లా జాతిపిత షేక్ ముజీబుర్ రహ్మాన్ శత జయంతి వేడుకల సందర్భంగా వచ్చే నెల 21, 22తేదీల్లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తోంది. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా కోహ్లీ పేరును ఒక్క మ్యాచ్ కోసమే జట్టులో చేర్చినా కూడా అతను ఆడే విషయమై స్పష్టత లేదు. గంగూలీతో చర్చించాక కోహ్లీ నిర్ణయం తీసుకుంటాడని బోర్డు వర్గాలు తెలిపాయి. అలాగే కేఎల్ రాహుల్ పాల్గొనేదీ అనుమానమే. అయితే పంత్, కుల్దీప్, ధవన్, షమి ఆడతారని సమాచారం. పాక్ క్రికెటర్లు ఈ మ్యాచ్‌ల్లో పాల్గొనడం లేదు.

**ఆసియా లెవెన్**

రాహుల్, ధవన్, కోహ్లీ, పంత్, కుల్దీప్, షమి, పెరీరా, మలింగ, రషీద్ ఖాన్, ముజీబుర్, ముస్తాఫిజుర్, తమీమ్, ముష్ఫికర్ రహీమ్, లిటన్ దాస్, సందీప్ లామిచానె, మహ్మదుల్లా

**వరల్డ్ లెవెన్**

హేల్స్, గేల్, డుప్లెసి (కెప్టెన్), పూరన్, బ్రెండన్ టేలర్, బెయిర్‌స్టో, పొలార్డ్, కాట్రెల్, ఎన్‌గిడి, ఆండ్రూ టై, మెక్లెనెగన్.





'స్మృతి మంధాన లేకపోవడంతో బాధ్యత తీసుకోవాలనుకున్నాను. వీలైనంత వేగంగా పరుగులు సాధించాలన్న లక్ష్యంతో ఆడా..' బంగ్లాపై గెలిచిన తర్వాత షఫాలీ వర్మ చేసిన వ్యాఖ్య ఇది. తీవ్ర ఒత్తిడి నెలకొనే ప్రపంచ కప్‌లాంటి మెగా ఈవెంట్‌లో ఆడుతూ 16 ఏళ్ల వయస్సులోనే వర్మ తీసుకున్న బాధ్యత ఇది. నిజానికి మహిళల క్రికెట్‌లో స్టార్ బ్యాట్స్‌వుమెన్ ఎంతమంది ఉన్నా గత వారం రోజుల నుంచి మాత్రం షఫాలీ పేరు మార్మోగుతోంది. కారణం.. ఈ టీనేజర్ ఫియర్‌లెస్ ఆట తీరే.. జట్టుకు ప్రపంచకప్ అందించే వరకు ఇలాగే ఆడతానంటూ ప్రత్యర్థులకు షఫాలీ గట్టి సవాల్ విసురుతోంది.

# చిచ్చర పిడుగల్లే..

## చెలరేగుతున్న షఫాలీ వర్మ

టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళలు వరుసగా రెండు విజయాలు సాధించారు. దీనికి ప్రధాన కారణం బౌలింగ్‌లో వెటరన్ పూనమ్ యాదవ్ అయితే బ్యాటింగ్‌లో మాత్రం అంచనాలకు మించి రాణిస్తున్న 16 ఏళ్ల షఫాలీనే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌లపై టోర్నీకి ముందు అందరికీ భారీ అంచనాలు ఉండేవి. స్మృతి ఆడిన ఒక్క మ్యాచ్‌లో విఫలం కాగా, హర్మన్ పేలవ ఫామ్ కొనసాగిస్తోంది. కానీ షఫాలీ (హరియాణా) మాత్రం పవర్‌గేమ్‌కు మారుపేరుగా నిలుస్తూ భయమంటే తెలీకుండా ఆడుతోంది. వయస్సుకు మించిన ఆటను ప్రదర్శిస్తూ తొలి బంతి నుంచే ఎదురుదాడికి దిగి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచుతోంది. ఆరంభ మ్యాచ్‌లో భారత్ చేసింది 132 పరుగులే అయినా అందులో షఫాలీ 15 బంతుల్లో చేసిన 29 పరుగులు అత్యంత కీలకం. ఆమె ధాటికి 4 ఓవర్లలోనే జట్టు 40 పరుగులు సాధించింది. ఆ తర్వాత మధ్య ఓవర్లలో కాస్త నిదానంగా ఆడినా ఈ మెరుపు ఆరంభం జట్టుకు భరోసానిస్తోంది. ఇక బంగ్లాపై అయితే ఆమె ఆడిన షాట్లు అద్భుతం.

### సెహ్వాగ్ శైలిలో..

మహిళల క్రికెట్‌లో బంతిని బలంగా బాదేవారు అత్యంత అరుదుగా కనిపిస్తారు. ఆ అరుదైన జాబితాలో ఈ టీనేజ్ సంచలనం కూడా ఉంటుంది. అచ్చు సెహ్వాగ్‌ను తలపించే శైలిలో కచ్చితమైన స్ట్రోక్‌ప్లేతో తను ఆడే షాట్లు వహ్వా.. అనిపిస్తుంటాయి. నెంబర్ వన్ టీ20 బౌలర్ మెగాన్ షట్ ఓవర్‌లో మూడు ఫోర్లు బాదిన విధానం.. బంగ్లాపై పవర్‌ప్లేలోనే నాలుగు సిక్సర్లను స్టాండ్స్‌లోకి పంపిన నైపుణ్యం విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఇంత చిన్న వయస్సులో ఆమె ఆడే తీరును ప్రశంసించకుండా ఉండలేకపోతున్నారు. రెండో మ్యాచ్‌లో మంధాన లేని లోటును తెలీకుండా ఆడి శభాష్ అనిపించుకుంది. అటు టీమ్ మేనేజ్‌మెంట్ కూడా షఫాలీకి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. 'లైసెన్స్ టు కిల్' తరహాలో సహజశైలిలో చెలరేగమని చెప్పడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచినట్టయింది. ఆ వయసులో తాను కనీసం క్రికెట్‌లో శిక్షణ కూడా తీసుకోలేదని, 30 ఏళ్ల పేసర్ శిఖా పాండే అంటుంటే.. క్రీజులో షఫాలీని చూస్తుంటే తానే జూనియర్‌లా భావిస్తానని జెమీమా కొనియాడుతోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

### ఆరు నెలల క్రితం అంచనాల్లోనే లేదు..

గతేడాది మహిళల జట్టు కివీస్, ఇంగ్లండ్‌లతో తమ టీ20 సీజన్‌ను ఆరంభించినప్పుడు షఫాలీ పేరు ఊసులో కూడా లేదు. ఈ మెగా ఈవెంట్‌లో సరైన కూర్పును పరిశీలించేందుకు ఓపెనింగ్‌లో మంధానకు జతగా హర్లీన్ డియోల్‌ను తీసుకున్నారు. అయితే ఆ ప్రయోగం సక్సెస్ కాలేదు. ఇక టీ20 ప్రపంచకప్‌కు సరిగ్గా ఆరు నెలల ముందు వర్మ గత సెప్టెంబర్‌లో దక్షిణాఫ్రికాపై అరంగేట్రం చేసింది. అయితే డకౌట్‌తో ఆరంభించినా ఆ తర్వాత వరుసగా ఐదు ఇన్నింగ్స్‌లో 50కి పైగా సగటుతో 46, 14, 4, 73, 69 (నాటౌట్) బాదేయడంతో గట్టి సందేశాన్నిచ్చినట్టయింది. ఇక టీ20 చాలెంజర్స్ ట్రోఫీలో 155కి పైగా సగటుతో 189 పరుగులు సాధించింది. ఫైనల్లో 48 బంతుల్లో 89 పరుగులు సాధించి భారత్ 'సి'ని విజేతగా నిలిపింది. అటు టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కించుకుంది. అప్పటికి ఆమె వయస్సు 15 ఏళ్లే.

### కొసమెరుపు

9 ఏళ్ల వయస్సులో తన ఆరాధ్య క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ప్రత్యక్షంగా చూసిన షఫాలీ వర్మ ఆ రోజే క్రికెటర్ కావాలనుకుంది. సీన్ కట్ చేస్తే.. అంతర్జాతీయ స్థాయిలో భారత్ నుంచి అత్యంత చిన్న వయస్సు (15 ఏళ్ల 285 రోజులు)లోనే అర్ధసెంచరీ సాధించి.. సచిన్ 30 ఏళ్ల రికార్డును షఫాలీనే అధిగమించింది.

# బంగ్లా ఇన్నింగ్స్ విజయం

జింబాబ్వేతో ఏకైక టెస్టు



**ఢాకా:** జింబాబ్వేతో ఏకైక టెస్టులో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ఫార్మాట్‌లో గత 15 నెలలుగా బంగ్లా వరుస ఓటములకు బ్రేక్ పడినట్టయింది. 2018 విండీస్‌పై చివరి టెస్టు విజయాన్ని రుచి చూసిన బంగ్లాకు తమ క్రికెట్ చరిత్రలో ఇది రెండో ఇన్నింగ్స్ గెలుపు. 295 పరుగుల లోటుతో నాలుగో రోజు రెండోఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 189 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ క్రెగ్ ఎర్విన్ (43), మరుమా (41), సికిందర్ రజా (37) రాణించారు. నయీమ్ హసన్‌కు ఐదు, తైజుల్ ఇస్లాంకు నాలుగు వికెట్లు దక్కాయి. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 560/6 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా, జింబాబ్వే 265 పరుగులు చేసింది. 19 ఏళ్ల స్పిన్నర్ నయీమ్ హసన్ మొత్తం 9 వికెట్లతో రాణించాడు. డబుల్ సెంచరీ హీరో ముష్ఫికర్ రహీమ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

# టీమిండియాలో ఇన్ని మార్పులా?

## తప్పుపట్టిన కపిల్



**న్యూఢిల్లీ:** భారత జట్టులో భారీ మార్పులు చేయడాన్ని మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ తీవ్రంగా తప్పుపట్టాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా 10 వికెట్లతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై కపిల్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'భారత జట్టులో ఇన్ని మార్పులు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రతీ మ్యాచ్‌కు కొత్త టీమ్‌లా కనిపిస్తోంది. జట్టులో ఎవరి స్థానమూ శాశ్వతంగా లేదు. ఇలాగైతే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంద'ని కపిల్ అభిప్రాయపడ్డాడు.








Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

*₹10000 ఆదా సాధారణ ఫైనాన్స్ స్కీంపై లెక్కించబడింది మరియు నిర్ణీత లోన్ మొత్తం మరియు వ్యవధి పై ఆధారపడింది. ఎంపిక చేయబడిన ఫైనాన్షియర్‌తో తమ స్వంత నిర్ణయాధికారం మేరకు ఫైనాన్స్ లభిస్తుంది. చిత్రంలో చూపించబడిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. చిత్రంలో చూపించిన యాక్సెసరీస్ ప్రామాణిక ఫిట్మెంట్‌లో భాగం కాదు. **షరతులు వర్తిస్తాయి.

Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Mithra Honda - 8297235235, 0866 -2442149; Sri Santosh Honda - 9703123445, 8019669955; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda- 9703247365, 9703218817; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Mithra Honda - 08297557149/50; MYLAVARAM: Mithra Honda - 8297568888; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966; KANKIPADU: Sri Santosh Honda - 7901097975; HANUMAN JUNCTION: Anvita Honda - 9492225959, 08656-245959.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com


*Printed and Published by* **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* **Editor : K. Srinivas,** *RNI No:3470/1960,* **Managing Director : Vemuri Radha Krishna, Founder :** *K.L.N. Prasad.*